

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 146 పేజీలు: 12 వెల: 6.50


షాంఘై ఉమ్మడి తీర్మానంపై సంతకం చేయని రాజ్‌నాథ్

ఇరాన్ అణు కేంద్రాలు పూర్తిగా ధ్వంసమే: ట్రంప్

9లో

మాదక ద్రవ్యాలు విక్రయిస్తే ఆస్తులు జప్తు

ప్రజా పోలీసింగ్‌తో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఎపి

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో డిఅడిక్షన్ సెంటర్లు

అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో సిఎం చంద్రబాబు




గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# డ్రగ్స్, గంజాయిపై 'వార్'

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 26:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినదించింది. డ్రగ్స్, గంజాయిపై యుద్ధం ప్రకటిస్తున్నట్టు సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ యుద్ధానికి ఎవరైనా అడ్డువస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. గురువారం గుంటూరులో ఫీవర్ ఆస్పత్రి జంక్షన్ నుంచి మిర్చి దాబా వరకు గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి 'డ్రగ్స్ వద్దు బ్రో' బ్యానర్ పట్టుకుని సీఎం నడిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలంటూ ప్రతిజ్ఞ చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కింద చేపట్టిన కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. యువతను గంజాయి, డ్రగ్స్‌కు బానిస చేసి... సమాజాన్ని పీడిస్తున్న మాఫియాను తరిమేద్దామని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే ఆస్తుల జప్తే. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచంతో పోటీ పడాల్సి ఉంది. ఈ తరహా సమస్యలు పెరిగితే ఇబ్బందులు వస్తాయన్నారు. గంజాయి రవాణా, సాగు చేసే వారికి అల్టిమేటం జారీ చేస్తున్నా. సాగుచేసినా, బయట నుంచి తీసుకువచ్చి విక్రయించినా సహించేది లేదన్నారు. ఏజెన్సీ ఏరియాలో గంజాయి సాగుచేసే వారికి ప్రత్యామ్నాయాలు చూపామని, ఇంకా అదే పని చేస్తామంటే >>2

సైబర్ నేరాలపై వేటుకు బలమైన

# చట్టాలవసరం

## దానిపై వచ్చే సమావేశాల్లో చర్చ: డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

**సచివాలయం, జూన్ 26,ప్రభాతవార్త :** బెట్టింగ్ యాప్స్, లోన్‌యాప్స్ వల్ల ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారని, అటువంటి సైబర్‌క్రైమ్స్ నుండి ఆమాయకులను కాపాడేందుకు బలమైన చట్టాలు, వ్యవస్థను రూపొందించాల్సి న అవసరం ఎంతైనా ఉందని, ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ అభిప్రాయ పడుతున్నట్లు ఆ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ సీ ్పకర్ కె. రఘురామకృష్ణం రాజు తెలిపారు. ఈ అంశంపై ప్రజలను, ప్రభుత్వాని ్న, ప్రభుత ్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు వచ్చే శాసనసభ సమావేశాల్లో చర్చ జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గురువారం రాష్ట్ర శాసనసభ భవనంలోని తమ ఛాంబర్‌లో కమిటీ సభ్యులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ పట్టణం ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజుతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌కి సంబంధించి భీమవరం నుండి తమ పిటీషన్స్ కమిటీకి ఒక ముఖ్యమైన పిటిషన్ వచ్చిందన్నారు. ఆ పిటీషన్‌పైనేడు జరిగిన శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా జరిగే సైబర్‌క్రైమ్స్ రోజు రోజుకి పెరిగిపోతూ ప్రజల జీవితాలు తారు మారు అవుతున్నా టయని, ఒక్క తెలంగాణా రాష్ట్రంలోనే గత ఏడాది 950మోసపోయినట్లు అధికార నివేదిక తెలుపుతుందన్నారు. అయితే రాష్ట్రంలో ఎంతమంది మోసపోయారనే విషయం ఖచ్చితంగా తెలియదని, కాని కొన్ని వేల మందికి పైనే మోసపోయి ఉండవచ్చని, దేశ స్థాయిలో ఎంతమంది మోసపోయారనే విషయం ఊహించడమే కష్టమన్నారు.

ఇంత తీవ్రంగా జరిగే సైబర్ క్రైమ్స్ నియంత్రణకు ఉన్న చట్టాలు, వాటిలో తీసుకురావాల్సి న మార్పులు, పోలీసుశాఖ చేస్తున్న కృషి తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించడం జరిగిందన్నారు. గతంలో గేమింగ్ చట్టం 2020 ప్రకారం స్కిల్ గేమ్‌ను బ్యాన్ చేయడం సరికాదని కొందరు హైకోర్టుకు వెళ్ళినప్పుడు, ఏది >>2



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వైయస్‌ఆర్‌సీ ప్రతినిధిబృందం

# జగన్‌పై తప్పుడు కేసులు పెడుతున్న ప్రభుత్వం

## రాజ్‌భవన్‌లో గవర్నర్‌నుకలిసి ఫిర్యాదు చేసిన వైఎస్సార్సీ బృందం

### జడ్‌ప్లస్ ఉన్నా కనీస భద్రత కల్పించడం లేదని ఆరోపణ

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజయవాడ రాజ్ భవన్‌లో వైయస్‌ఆర్‌సీ ప్రతినిధి బృందం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఆయనకు పలు అంశాలపై వినతి పత్రం సమర్పించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన, అప్రజాస్వామిక విధానాలు, కక్షసాధింపులో భాగంగా అక్రమ కేసుల బనాయింపు, ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌కు భద్రత కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనంపై విజయవాడ రాజ్‌భవన్‌లో వైయస్‌ఆర్‌సీ ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, పేర్ని వెంకట్రామయ్య, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, బూసినె విరూపాక్షి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైయస్‌ఆర్‌సీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు గవర్నర్‌ను కలిసి, రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలపై, ప్రభుత్వం చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆయనకు వివరించారు. రాష్ట్రంలో >>2

జగన్ క్వాష్ పిటిషన్‌పై విచారణ నేటికి

# వాయిదా

## సింగయ్య మృతికేసులో జగన్-ఎ2

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త ప్రతినిధి:** సింగయ్య మృతి కేసులో తమపై నమోదైన కేసును క్వాష్ చేయాలని జగన్ సహా పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై నేడు న్యాయస్థానం విచారణ జరిపింది. డాక్యుమెంట్స్ సమర్పించేందుకు అడ్వకేట్ జనరల్ సమయం కోరారు. అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం పిటిషన్లపై తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గుంటూరుజిల్లా రెంటపాళ్ల గ్రామ పర్యటన సందర్భంగా వాహనం ఢీకొని చీలి సింగయ్య మృతి చెందిన కేసులో మాజీ సిఎం రెండో నిందితుడిగా ఉన్నారు. దుర్గారావు అనే >>2

## సింగయ్య మృతి కేసు ప్రత్యక్ష సాక్షులను ప్రశ్నించిన పోలీసులు

**విజయవాడ, జూన్26, ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సిఎం జగన్ కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన కేసులో పోలీసులు దర్యాప్తులో భాగంగా పోలీసులు పలువురిని విచారిస్తున్నారు. నెల 16న ఏటుకూరు బైపాస్ సమీపంలో ఘటన జరగ్గా ప్రత్యక్షంగా చూసిన వారిని ఇప్పటికే కొందరిని పిలిచి ప్రశ్నించారు. ఆ సమయంలో ఏం జరిగింది. జగన్ ప్రయాణిస్తున్న కారు కింద సింగయ్య ఎలా పడిపోయాడు, >>2

# 'స్పేస్'లో ఎపి అగ్రగామి

## రూ. 25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యంతో 'స్పేస్ పాలసీ'

## ప్రత్యక్షంగా 5 వేలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి

### తిరుపతి, లేపాక్షిలో స్పేస్ సిటీల ఏర్పాటు

### 'పాలసీ 4.0'పై సమీక్షించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్26, ప్రభాతవార్తప్రతినిధి:** స్పేస్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపడంతో పాటు, రూ.25 వేలకోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా 5వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. లేపాక్షి, తిరు పతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి...2025-2035 కాలానికి సంబం ధించి స్పేస్ రంగంలో వ్యూహాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యాసంస్థలను ఇందులో భాగస్వాములు చేయడం ద్వారా విద్యార్థులు ఈ రంగం వైపు ఆకర్షితులు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే ప్లగ్ అండ్ ప్లే విధానంలో వినియోగించుకునేలా కామన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కల్పించాలని, ఇందుకోసం టెక్నికల్ కమిటీ నియమించాలని ఆదేశించారు. కమ్యునికేషన్ రంగంలో అగ్రస్థా నంలో ఉన్న సంస్థలను ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్లకు సంబంధించి టెక్నాలజీ అనుసంధానం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

**భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదే**

సమీక్షలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. స్పేస్ విజన్ పాలసీ2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులు చేపడుతోందని... అలాగే స్టార్ లింక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టిస్తు న్నారని... భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదేనని సోమనాథ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో అనుక్షణం నూతన ఆవిష్కరణలు చోటు చేసుకుం టాయని వివరించారు స్పేస్ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేం దుకు ముందుకు వచ్చే సంస్థలకు మరింత మెరుగ్గా పెట్టుబడి రాయితీ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు >>2



# ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన శుక్లా, మరో ముగ్గురు

## విజయవంతంగా సాగిన డాకింగ్ ప్రక్రియ

### పరిశోధనలకోసం 14 రోజులు అంతరిక్ష కేంద్రంలోనే

మానవసహిత అంతరిక్ష యాత్రలకు ఇది మరో ముందడుగు: శుక్లా

2లో



గురువారం రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి షెకావత్. చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, డి.సిఎం పవన్ తదితరులు

# పర్యాటకానికి పెద్దపీట

## రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టు, బొమ్మూరులో సైన్స్ కేంద్రం ప్రారంభించిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 26(ప్రభాతవార్త):** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంయుక్త అభివృద్ధితో ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు సాధ్యం అని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో రూ.94.44 కోట్లతో నిర్మించనున్న అఖండ గోదావరి ప్రాజెక్టు, బొమ్మూరులో రూ.15 కోట్లతో నిర్మించిన సైన్స్ కేంద్రాన్ని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ గురువారం ప్రారంభించారు. దివాన్ చెరువులో రూ. 30 కోట్లతో నిర్మించినున్న అటవీ అకాడమీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంఖుస్థాపన చేశారు. ముందుగా మంత్రులు గోదావరి ఫోటో ఎగ్జిబిషన్, అటవీ శాఖ ఫోటో ఎగ్జిబిషన్ను వీక్షించారు. అనంతరం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తి చేసి ఎనిమిది వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి ఉంటుందన్నారు. 2035 నాటికి 35 లక్షల పర్యాటకులు రావడం లక్ష్యం అన్నారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్, శాస్కి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సిబిడిడి) తదితర స్కీమ్ వలన పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ప్రపంచ ఆర్థిక టూరిజం అండ్ ట్రావెల్ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో 54వస్థానంలో ఉన్న ఇండియా 39వ స్థానానికి చేరుకుందన్నారు. మన దేశం టాప్ 10 దేశాల్లో >>2




27-6pg2exHMNWJQE.qxd:27-6pg2exHMNWJQE.qxd 01/01/01 9:08 AM Page 1





గురువారం సిఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ భేటీ అయిన దృశ్యం, ఫోటోలో మంత్రి లోకేష్ ఉన్నారు.

# డబులింజన్ సర్కార్‌తో అద్భుత ఫలితాలు

## ప్రజాస్వామ్య వ్యవస్థను ఎమర్జెన్సీ నిర్వీర్యం చేసింది: కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎమర్జెన్సీ నిర్వీర్యం చేసిందని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ చీకటి రోజులను గుర్తుచేసుకుంటేనే ఎంతటి నియంతృత్వాన్ని దేశం చవిచేసిందో అర్థమవుతుందన్నారు. 1975 జూన్ 25వ తేదీన భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించబడింది. ఇది ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అన్ని ప్రాథమిక హక్కులను కాలరాశారు. పత్రికలపై ఆంక్షలు పెట్టి అరాచకాలు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారు. లక్షమందికిపైగా అన్యాయంగా అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చారు. సంజయ్ గాంధీ నియంతలా ప్రజల మీద పడి అరాచకాలకు పాల్పడ్డారు. ప్రజల ఐక్యపోరాటంతో చివరకు ప్రజాస్వామ్యం విజయం సాధించింది. గజేంద్రసింగ్ షెకావత్ గురువారం ఏపిలో పర్యటించారు. రాజమండ్రిలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం విజయవాడ బిజెపి ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితిపై జరిగిన నియంతృత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన కోట్లాది మంది త్యాగాలను ఈ సందర్భంగా దేశం గుర్తుచేసుకుంటుందని, నేటికీ కాంగ్రెస్ ఈ దుశ్చర్యను ఖండించకుండా, పశ్చాత్తాపలేకుండా ఉండటం చాలా దురదృష్ట కరం. జయప్రకాశ్ నారాయణ్, వాజ్‌పాయ్, వంటి ఎంతోమంది నేతలు అప్పటి పోరాటాలకు నేతృత్వం వహించారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి భారీ మూల్యం చెల్లించిన ఈ చారిత్రాత్మక పోరాటం చేసిన వీరులను దేశం కృతజ్ఞతతో నేడు గుర్తుచేసుకుంటుంది. దేశం వారికి సదాగౌరవం ఇస్తుంది. నేటి తరాలకు ఎమర్జెన్సీ రోజులను వివరిస్తాం అని షెకావత్ పేర్కొన్నారు. అనంతరం ఆయన ఉండవల్లి చేరుకున్నారు.మంత్రి నారా లోకేష్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన చంద్రబాబు నివాసంలో వెళ్లారు. షెకావత్, చంద్రబాబు ఒకరినొకరు ప్రేమ పూర్వకం ఆలింగనం చేసుకున్నారు.తరువాత సిఎం చంద్రబాబు,కేంద్రమంత్రి షెకావత్‌తో పాటు మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపికి చాలా ప్రాజెక్టులవస్తున్నాయి. వాటిలో ఒకటి రాజమండ్రిలో ఈరోజు ప్రారంభించాం. సిఎం చంద్రబాబు నాయుడుని కలిసి పలు ప్రాజెక్టులపైకూడా చర్చించనున్నాం.ఇరిగేషన్, టూరిజంఅభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. ప్రణాళిక బద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తాం అనిఅన్నారు. మరోవైపు, 'పెహల్గాం'లో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఇప్పుడు పర్యాటకులు స్వేచ్ఛగా అక్కడ ప్రాంతాలను సందర్శించవచ్చు అన్నారు. మరో పదిహేను రోజుల్లో అక్కడ పర్యాటకులు సందడి మొదలవుతుందని కేంద్రమంత్రి వెల్లడించారు. ఏపికి పర్యాటక రంగాభివృద్ధికి రూ.450కోట్లు కేటాయించామన్నారు.కేంద్రంలో ప్రధానిమోడీ, ఏపీ చంద్రబాబు దూరదృష్టితో అభివృద్ధి కోసం ఆలోచన చేస్తారన్నారు.డబుల్ ఇంజిన్‌ప్రభుత్వం మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు.

# ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన శుక్లా, మరో ముగ్గురు

**న్యూఢిల్లీ,జూన్ 26:** భారత వైమానిక దళానికి చెందిన ఫైటర్ పైలట్, వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షయానం సరికొత్త రికార్డు సాధించాడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా రికార్డుకెక్కారు. యాక్సియం4 మిషన్‌లో భాగంగా నింగిలోకి దూసుకెళ్లిన ఆయన ప్రస్తుతం భూకక్ష్యలో పరిభ్రమిస్తున్నారు. గురువారం సాయంత్రానికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అంతరిక్షం నుంచి ఆయన లైవ్‌కాల్‌లో మాట్లాడుతూ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం అద్భుతంగా ఉందని, భారరహిత స్థితిలో నడవడం వంటివి చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నానని ఆయన తెలిపారు. భారత కాలమానం ప్రకారం నిన్న మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు శుక్లా సహా మొత్తం నలుగురు వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన విషయం తెలిసిందే. ఈ వ్యోమనౌక గురువారం సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం అయింది. ఈ బృందం అక్కడ 14 రోజుల పాటు ఉండి పలు కీలక పరిశోధనలు చేపడుతుంది. దాదాపు 41 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఒక భారతీయుడు అంతరిక్షంలోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి. అంతరిక్షం నుంచి లైవ్‌కాల్‌లో శుభాంశు శుక్లా మాట్లాడుతూ అంతరిక్షం నుంచి అందరికీ నా నమస్కారాలు. తోటి వ్యోమగాములతో కలిసి ఇక్కడ ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఇది ఒక గొప్ప ప్రయాణం. 30 రోజుల క్వారంటైన్ అనంతరం ఇప్పుడు ఐఎస్ఎస్‌కు చేరుకోబోతున్నాం. ఈ ప్రయాణంలో నాకు అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలని పేర్కొన్నారు. తమతో పాటు జాయ్ అనే ఒక బేబీ హంస బొమ్మను కూడా తీసుకెళ్తున్నామని, భారతీయ సంప్రదాయంలో హంస విజ్ఞానానికి ప్రతీక అని ఆయన వివరించారు. దాదాపు 15 నిమిషాల పాటు సాగిన ఈ లైవ్‌కాల్‌లో శుభాంశు తన అనుభూతులను వివరిస్తూ భారరహిత స్థితికి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నాను. అంతరిక్షంలో ఎలానడవాలి? ఎలా ఆహారం తీసుకోవాలి? వంటి విషయాలను ఒక చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నాను. ఇక్కడ గడిపే ప్రతీ క్షణాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. నా భుజంపై మన మువ్వన్నెల పతాకం ఉంది. అది చూసినప్పుడల్లా ఈ ప్రయాణంలో నేను ఒంటరిని కానని, కోట్లాది మంది భారతీయులు నాకు తోడుగా ఉన్నారనే ధైర్యం కలుగుతుందన్నారు. రోదసీయానంలో నాది ఒక చిన్నఅడుగే కావచ్చు, కానీ భారత మానవ సహిత అంతరిక్ష యాత్రలకు ఇది ఒక ఘనమైన ముందడుగు.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వీలైనంత ఎక్కువ సమయం గడపాలని, నా అనుభవాలను మీ అందరితో పంచుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని శుభాంశు శుక్లా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. శుభాంశుతో ఉన్న బృందం ఐఎస్ఎస్‌లో 14 రోజులపాటు గడిపి సుమారు 60కిపైగా ప్రయోగాలుచేస్తారు. హ్యూమన్ ఫిజియాలజీ, న్యూట్రిషన్, సీడ్ జెర్మినేషన్‌లలో మైక్రో గ్రావిటీ పరిశోధనలున్నాయి. అలాగే ప్రధానిమోడీతో సంభాషించడంసహా అంతరిక్షం నుంచే శుక్లా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యోమగాములు 14రోజులు స్థానికంగా లభించే ఆహారాన్నే స్వీకరిస్తారు.

# అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌ఒడి టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. టెండర్లలో లి1 గా నిలిచిన సంస్థల బిడ్లను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన కేబినెట్‌లో బిడ్లను ఖరారు చేసి మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.ంటిగ్రేటెడ్ సచివాలయం నిర్మాణ పనులను ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. హెచ్‌వోడీ, జీఏడీ టవర్ నిర్మాణ పనులను ఈ సంస్థ పూర్తి చేయనుంది. రూ.882.47 కోట్లతో సచివాలయంలోని జీఏడీ టవర్ నిర్మాణం జరగనుంది. సచివాలయంలోని 1, 2 హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను షాపూర్జీ పల్లోంజీ అండ్ కంపెనీ లిమిటెడ్ దక్కించుకుంది. 1487కోట్ల రూపాయలతో 1,2 హెచ్‌వోడీ టవర్లు నిర్మించనున్నారు. 3, 4 హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది. 1,303 కోట్లతో 3,4 హెచ్‌వోడీ టవర్ల నిర్మించనున్నారు. ఎల్1 బిడ్డర్లకు ప్రతిపాదిత పనులు అప్పగించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఆర్డీఏ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఇ3 రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసారు.వీటితో పాటు అమరావతిలో ని3 రోడ్డు (ఫేజ్ 3) విస్తరణకు సైతం నిధులు మంజూరు చేసింది. రూ.682.99 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వంతెనలు, అండర్‌పాస్‌లు, 6లేన్లఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, ఎన్‌హెచ్16కి ఈ3 రోడ్డు అనుసంధానించే పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. తగినచర్యలు తీసుకోవాలని అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, ఎండీకి ఆదేశిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా ప్రభుత్వ సముదాయ ప్రాంతం లేఅవుట్‌లలో మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించారు. రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ కల్పనకు, యుటిలిటీ డక్ట్‌లు, పునర్వినియోగ నీటి లైన్, అవెన్యూ ప్లాంటేషన్ నిర్మాణం కోసం నిధులు విడుదలకు లైన్ క్లియర్ అయింది.

## జూలై 9న వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సమ్మె

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్యారోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ దేశవ్యాప్తంగా జులై 9న సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్మోహనరావు తాళ్లూరివెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు. ఉద్యోగులకు నష్టం చేసే కార్మిక చట్టాలను రద్దుచేయాలని అందర్నీ రెగ్యులర్ చేయాలని, ఈలోగా ఎంటీఎస్ అమలుచేయాలనే డిమాండ్లతో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

# బలమైన చట్టాలవసరం

>> స్కిల్ గేమ్,ఏది లక్ గేమ్ అనేదాన్ని నిర్ణయించేందుకు ఒక కమిటీని వేయమని కోర్టు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు.ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించడంతో ప్రభుత్వం ఒక కమిటి వేయగా, 2023 ఆగస్టులో ఆ కమిటీ నిర్ణయాన్ని వెలిబుచ్చడం జరిగిందన్నారు.గత ఏడాది ఆగస్టులో హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయగా నేటి వరకు ఆ కేసు విచారణకు రాలేదన్నారు.కేసు త్వరగా విచారణకు వచ్చే విధంగా అడ్వకేట్ జనరల్ ద్వారా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలు మోసపోకుండా, ఆత్మహత్యలు చేసుకోకుండా చూసేందుకై శాసనసభ ద్వారా సైబర్ చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సైబర్ నేరాలకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు సైబర్ నేరాలపై సినీ నటులు,ప్రముఖుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఆయన తెలిపారు.ఈ విషయాలపై మరింత లోతుగా చర్చ జరిపి తగు చర్యలు తీసుకునే విధంగా వచ్చేనెల 18వ తేదిన జరగనున్న పిటీషన్ల కమిటీ సమావేశానికి ఐటి,హోంశాఖ ఉన్నతాధికారులు కూడా హాజరు కావాలని కోరండం జరిగిందన్నారు.అంతకు ముందు శాసనసభ కమిటీ హాల్లో చైర్మన్ మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణ రాజు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటీసన్ల కమిటీ సమావేశంలో శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్,సూర్యదేవర,కమిటీ సభ్యులు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ,గంటా శ్రీనివాసరావు, పి.విష్ణు కుమార్ రాజు,పల్లా శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులు పెడుతున్న ప్రభుత్వం

>> ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం రాజ్‌భవన్ బయట శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ...చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చేస్తున్న అఘాయిత్యాలు, మాజీ సిఎం వైయస్ జగన్‌కు కల్పించాల్సిన భద్రతను విస్మరించడం, ఆయన పర్యటనల సందర్భంగా అక్రమ కేసులను బనాయిస్తున్న విధానాలపై గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళాం. ఇవి అప్రజాస్వామికం, గతంలో ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడలేదు, కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న వైనంపై గవర్నర్‌కు వివరించాం. ఇటీవల సత్తెనపల్లిలో జరిగిన వైయస్ జగన్ పర్యటన సందర్భంగా ఒక వాహనం ఢీ కొని సింగయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటనపై సాక్షాత్తు పల్నాడు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రమాదానికి వైయస్ జగన్‌కు చెందిన కాన్వాయి వాహనాలు కారణం కాదు, వేరే ప్రైవేటు వాహనం ఢీ కొట్టడంవల్లే ఈప్రమాదం జరిగిందని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ ప్రమాదంలో సింగయ్య గాయపడటంతో పోలీసులే అతడిని ఆసుపత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటన జరిగిన మూడు రోజుల తరువాత హటాత్తుగా పోలీసుల తీరు మారింది. ఈ సంఘటన వైయస్ జగన్ ప్రయాణించిన కారు ఢీకొనడం వల్లే జరిగిందటూ, ఎప్పుడూ చరిత్రలో జరగని విధంగా కారులో ప్రయాణిస్తున్న వారిపైన కూడా కేసులు నమోదు చేశారు. ఆ కారునుకూడా సీజ్‌చేసి తీసుకువెళ్లారు. ఈ ప్రభుత్వంఎటువంటి అరాచకంకు పాల్పడుతుందో దీని ద్వారా రాష్ట్రప్రజలందరికీ అర్థమవుతోంది. ఏదో ఒక విధంగా వైయస్ఆర్‌సీ నేతలను భయపెట్టాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉంది. అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని అడ్డుకోవాలని చూడటం వారి అవివేకం. వైయస్ జగన్ దేశంలోనే అత్యంత ప్రజాధరణ కలిగిన నాయకుడు, ఆయన పర్యటనకు భద్రతకల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఆయన ఎక్కడకు వెళ్లినా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారనే సమాచారం, ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌లు ప్రభుత్వం వద్ద లేవా? ఎందకు దానికి తగిన విధంగా ఏర్పాట్లు చేయడం లేదని ప్రశ్నిస్తున్నాం.వైయస్ జగన్ పర్యటన సందర్భంగా ఆయన కాన్వాయిచుట్టూ వందలమంది ప్రజలు ఉన్నారు. ఆయనకు పోలీస్‌భద్రత ఇచ్చామని చెబుతుంటే, అంత మంది ఆయన ప్రయాణిస్తున్న కారుకు అత్యంత సమీపంలోకి ఎలా వస్తున్నారు? సింగయ్య నిజంగానే వైయస్ జగన్ వాహనం కింద పడితే ఆ కారుకు ముందు ఉండాల్సిన పోలీస్ ఎస్కార్ట్ వాహనాలు, దానిలోని పోలీసులు, రోప్ పార్టీ ఎందుకు చూడలేదు? ఈ ఘటనపై జిల్లా ఎస్పీ ఏసమాచారం ప్రకారం మొదట వివరాలను వెల్లడించారు? ఈ కుట్రనే గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని బొత్స అన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలో మంత్రుల కమిటీ

## ఎపిఎన్జీఓ సంఘం నాయకులు

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్లు ఎపి ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్ డివి రమణ తెలిపారు. సచివాలయంలో బుధవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎపిఎన్జీఓసంఘం ప్రతినిధుల బృందం కలిసింది. ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పిఆర్సీ వేయాలి. జులై 2023 నుంచి పిఆర్సీ ఇవ్వాలి. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గ్రామ వార్డు సచివాలయాల మిగులు ఉద్యోగులను వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలి. పదోన్నతులు కల్పించాలి అని సంఘ నేతలు కోరారు.

# పర్యాటకానికి పెద్దపీట

>> ఒకటిగా ఉండాలన్నది లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో స్వదేశీ దర్శన్ స్కీమ్ ద్వారా 2015-17లో కాకినాడ హోప్ ఐల్యాండ్,కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, పులికాట్ సరస్సు, మైపాడు బీచ్, ఇసుకపల్లిలో సర్క్యూట్, బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా శాలిహుండం, బావికొండ, అమరావతికి సహకారం అందించామని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రానికి సుమారు రూ.450 కోట్లతో ఏడు టూరిజం ప్రాజెక్టులు మంజూరయ్యా యన్నారు . విశాఖ స్టీల్ ప్లాంట్ స్టీల్ ప్రైవేటీకరణ జరగకుండా కాపాడడం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి 974 కి.మీల సుదీర్ఘ సముద్రతీరం, గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, ఇంకా ఎన్నో చిన్న నదులు ఉన్నాయని తెలుపుతూ నదీ పరివాహక ప్రాంతాల్లో రివర్ ఫ్రంట్ ఏరియా ఉంటుందని, విదేశాల్లో ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ లుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ఇన్ చార్జి మంత్రి , నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైకాపా పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ టూరిజానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఎంపీ పురందేశ్వరీ మాట్లాడుతూ వికసిత్ రాజమహేంద్రవరంలో భాగంగా అఖండ గోదావరి ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి రాజమహేంద్రవరం నగరం రానున్న పుష్కరాలకు అభివృద్ధి చేసి హోటల్స్, రెస్టారెంట్లు, రవాణా తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్ లను అభివృద్ధి గురించి వివరించారు. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆధ్యాత్మిక టూరిజం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు ప్రారంభమైనా యని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 27-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
విదియ ఉ.11.24
పునర్వసు ఉ.7.23
వర్జ్యం మ.3.06-సా.4.40
దు.ఉ.8.15-9.07, 2) మ.12.38-1.29
శుభసమయం : ఉ.5.30-6.00, 2) సా.6.30-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** గృహనిర్మాణ ఆలోచనలు నెమ్మదిగా కార్యరూపం దాలుస్తాయి. మిత్రుల కలయిక.

**వృషభం :** ఆరోగ్యం, వాహనాల విషయాలలో అప్రమత్తంగావుండటం అన్నివిధాలా మంచిది.

**మిథునం:** భూ వివాదాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో పరిచయాలు.

**కర్కాటకం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**సింహం:** అన్ని వ్యవహారాలలో ఊహించని విధంగా విజయం సాధిస్తారు. ధన, వస్తులాభాలు.

**కన్య :** మానసిక ఉల్లాసంతో ముందుకుసాగి కొత్తపనులు సైతం ప్రారంభిస్తారు.

**తుల :** కుటుంబ సభ్యుల సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ధనలాభం.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు:** అన్ని పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి వచ్చిన వార్తవల్ల కొంత సంతోషం కలుగుతుంది. వాహన సౌఖ్యం.

**మీనం :** మీరు ఎంత జాగ్రత్తగా ఉన్నా అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు. వస్తుకొనుగోలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




గుంటూరులో గురువారం గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిపిన ర్యాలీలో సిఎం చంద్రబాబు

# డ్రగ్స్, గంజాయిపై 'వార్'

>> చూస్తూ ఊరుకోమని తెలిపారు. టెక్నాలజీతో డ్రోన్లు వినియోగించి నేర నియంత్రణ చేస్తున్నామని, సిసిటివి కెమెరాలతో నేరాలు జరక్కుండా చూస్తున్నామని సిఎం తెలిపారు. కేసులు పెట్టడమే కాదు.. గంజాయి, డ్రగ్స్ విక్రయించిన వారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని, జప్తు చేసిన ఆస్తుల నుంచి వచ్చిన ఆదాయంతో డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలకు.. అవగాహన కల్పించేందుకు వినియోగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా మాదక ద్రవ్యాల నివారణపై సమీక్ష చేయలేదని, గంజాయి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమమూ చేపట్టలేదన్నారున డ్రగ్స్ గురించి పోరాడితే కేసులు పెట్టారని, టిడిపి కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గంజాయి, డ్రగ్స్ సమస్య 'కూటమి' ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిందన్నారు. కష్టనష్టాలను ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని బాగుచేసే బాధ్యతను తీసుకున్నామని, రాజకీయాల్లో ఉండే వ్యక్తులు ఆదర్శంగా ఉండాలని, కానీ గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లతో మాజీ సీఎం చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారన్నారు. వారిని ప్రోత్సహిస్తూ, పరామర్శిస్తున్నారని అన్నారు. రాజకీయ ముసుగు వేసుకుంటే దాన్ని తొలగించి కట్టడి చేస్తామని, గంజాయి విక్రయించేవారిని.. వారికి సహకరించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.. గంజాయి నిర్మూలనకు ప్రతిపక్షాలూ ముందుకు రావాలని, ప్రజలకు మంచి చేసి ఓట్లు వేయించుకోవాలని, అంతే కానీ.. గంజాయి బ్యాచ్‌ను సపోర్టు చేస్తూ తప్పుడు కార్యక్రమాలు చేయొద్దు." అని ముఖ్యమంత్రి హితవు పలికారు.

2047కి తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలన్నదే నా ఆకాంక్ష. అందుకే ఇప్పటి నుంచే గంజాయి వంటి సమస్యల్ని పరిష్కరించుకుని ముందడుగు వేయాలని సిఎం అన్నారు.మత్తు నుంచి యువతను బయటకు తెస్తామని, రాష్ట్రంలో మాదక ద్రవ్యాల బారిన పడిన యువతను బయటకు తెచ్చేలా కార్యాచరణ చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న గంజాయిలో ఒడిశా, ఎపిలోనే 50 శాతం సాగు అవుతోందని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గంజాయికి కేంద్రంగా విశాఖ ఉండటం అత్యంత బాధాకరమని అన్నారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయంలో 2 శాతాన్ని మాదకద్రవ్యాల నియంత్రణకు ఖర్చు చేస్తున్నామని, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం పెద్ద ఎత్తున చేస్తున్నామని తెలిపారు. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతిలలో ఎన్డీపీఎస్ కేసుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెడుతున్నాం. అన్ని జిల్లాల్లోనూ నార్కోటిక్స్ కంట్రోల్ సెంటర్లు పెట్టామని, పాఠశాలల్లో ఈగల్ క్లబ్బులు ఏర్పాటు చేశామన్నారు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మూడు ప్రాంతాల్లో డీఅడిక్షన్ సెంటర్లతో పాటు రాష్ట్రంలో 56 డీఅడిక్షన్ సెంటర్లు పెడుతున్నామని సిఎం వెల్లడించారు. గంజాయి నివారణకు ప్రజలు కూడా సహకరించాలని, సెలబ్రిటీలు కూడా వీటికి వ్యతిరేకంగా ప్రజాచైతన్యం కోసం ప్రచారం చేయాలన్నారు. డ్రగ్స్, గంజాయిపై ఫిర్యాదులకు వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్లుమత్తుపదార్థాలను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు బాధ్యత తీసుకోవడమే కాదని.. దీనికి ప్రజా మద్దతు కూడా అవసరమని చంద్రబాబు అన్నారు. ప్రజా పోలీసింగ్ ద్వారానే డ్రగ్స్, గంజాయిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టగలమని స్పష్టం చేశారు.

డ్రగ్స్ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగిల్ టాస్క్ ఫోర్సు ఫిర్యాదుల కోసం వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని చెబుతూ, ఈ టోల్ ఫ్రీ, వాట్సప్ నెంబరును ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. టోల్ ఫ్రీ నెంబరు 1972, వాట్సప్ నెంబరు 8977781972లను సీఎం విడుదల చేశారు. ఈ నెంబరకు సమాచారం అందించి డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సిఎం పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణకు పని చేసిన వివిధ వ్యక్తులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులను సిఎం చంద్రబాబు సన్మానించారు.

# 'స్పేస్'లో ఎపి అగ్రగామి

>> సూచించారు. రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల వరకు మైక్రో, రూ.2.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు స్మాల్, రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకు మీడియం, రూ.125 కోట్ల నుంచి రూ.500 కోట్లవరకు లార్జ్ కేటగిరీలుగా పెట్టుబడు లను విభజించారు. రూ.500 కన్నా ఎక్కువ పెట్టు బడులను మెగా కేటగిరీ కింద పరిగణిస్తారు. 25 శాతం నుంచి 45 శాతం వరకు పెట్టుబడి రాయితీ ఇచ్చేలా ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. అలాగే ఇందులో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశం పైనా సమీక్షలో చర్చించారు.

**టెక్నాలజీకి లేపాక్షి స్పేస్ సిటీ**

రాష్ట్రంలో రెండు స్పేస్ సిటీలు నిర్మించాలని కొత్త పాలసీలో నిర్దేశించారు. 500 ఎకరాల్లో ఏర్పాటు కానున్న లేపాక్షి స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధానత్య ఇస్తారు. ఆర్ అండ్ డి, స్పేస్ స్టార్ట్ అప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్లుసేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు కానున్నాయి.

**తయారీ రంగానికి తిరుపతి స్పేస్ సిటీ**

తిరుపతి స్పేస్ సిటీని మాన్యుఫ్యాక్చరింగ్, లాంచ్ లాజిస్టిక్ సేవలు అందించే సంస్థల ఏర్పాటుకు కేటాయించారు. ఇక్కడ లాంచ్ వెహికల్ అసెంబ్లీ,శాటిలైట్‌పేలోడ్ అసెంబ్లీ, మెకానికల్ సిస్టమ్‌కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్ ఏవియానిక్స్ అసెంబ్లీ సంస్థలకే ఈ సిటీలో అవకాశం కల్పిస్తారు. బెంగళూరుకు సమీపంలో లేపాక్షి స్పేస్ సిటీ, శ్రీహరికోట చెన్నయ్‌కు సమీపంలో తిరుపతి స్పేస్ సిటీ ఉండటం కలిసొచ్చే అంశం. తిరుపతి స్పేస్‌సిటీ నుంచి-శ్రీహరికోటకు రోడ్ కనెక్టవిటీపైనా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

**గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 2 శాతం వాటా**

గ్లోబల్ స్పేస్ ఎకానమీలో ప్రస్తుతం భారతదేశం కేవలం 2 శాతం వాటా కలిగి ఉంది. ఈరంగంలో 2033 నాటికి 44 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియా స్పేస్ పాలసీ 2023... 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తోంది. ఇండియా స్పేస్ విజన్2047 కింద... శాటిలైట్ల తయారీ, రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ల లాంచింగ్, చంద్రయాన్ 4, వీనస్ ఆర్బిటరీ మిషన్, మార్స్ ల్యాండర్ మిషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్‌స్పేస్ స్టేషన్, నెక్ట్స్ జెనరేషన్ లాంచ్ వెహికల్, శ్రీహరికోటలో 3వ లాంచ్ ప్యాడ్ నిర్మాణంవంటివి లక్ష్యాలు. 2040 కల్లా చంద్రుడిపై మనిషి అడుగుపెట్టాలనేది ఆశయం. కేంద్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0ను రూపొందిస్తోంది.

# విచారణ నేటికి వాయిదా

>> వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా 105, 49 సెక్షన్లను నమోదు చేశారన్నారు. తనపై నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని క్వాష్ పిటిషన్‌లో జగన్ కోరారు. జగన్ వ్యక్తిగత కార్యదర్శి కె. నాగేశ్వరరెడ్డి (ఏ3), వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి (ఏ4), మాజీ మంత్రులు పేర్ని నాని (ఏ5), విడదల రజిని (ఏ6) లు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గుంటూరు జిల్లా పర్యటన సందర్భంగా వాహనం ఢీకొని చీలి సింగయ్య అనే దళితుడు మృతిచెందిన కేసులో రెండో నిందితుడు, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం హైకోర్టులో వ్యాజ్యం వేసారు. తనపై నల్లపాడు పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టేయాలని కోరారు. తాను ప్రయాణిస్తున్న వాహనం బరువు ఇరువైపులా నిల్చున్న గార్డులతో కలిపి 4,000 కిలోల వరకు ఉంటుందన్నారు.

మృతుడు సింగయ్య గాయాలను చూస్తే అతడు ఆ వాహనం కిందపడి నలిగినట్లు లేదని, పోలీసుల వాదన నమ్మదగినదిగా లేదని ఆరోపించారు. తాను ప్రజలను కలవకుండా అడ్డుకోవాలనే రాష్ట్రప్రభుత్వం ఈ కేసులో ఇరికించిందని జగన్ పిటిషన్‌లో వెల్లడించారు. అమాయకుడినని, ప్రమాదానికి టాటా సఫారీ వాహనం కారణమని ప్రారంభంలో పోలీసులు తెలిపారని ఆ వాహన యజమానిని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వాంగ్మూలాలను నమోదు చేసి, పూచీకత్తు తీసుకున్నాక బెయిల్‌పై విడుదల చేశారని తెలిపారు. రాజకీయ ప్రతీకారంతో ఈ కేసులో తనను ఇరికించారని ఆరోపించారు. ఎఫ్‌ఐఆర్‌లోని వివరాలను నిజమనుకున్నా సెక్షన్ 105 నమోదు చెల్లదని వివరించారు. తాను అమాయకుడినని, తప్పుడు కేసులో ఇరికించారని పేర్కొన్నారు.

కాన్వాయ్‌లోని గుర్తుతెలియని వాహనం సింగయ్యను ఢీకొన్నట్లు గుంటూరు ఎస్పీ మొదట ప్రకటన విడుదల చేశారని తెలిపారు. తన పర్యటన వివరాలను పోలీసులకు అందజేసినా తగిన భద్రత కల్పించడంలో విఫలమయ్యారని జగన్ ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీవ్ర సెక్షన్లను నమోదుచేశారని తెలిపారు. పోలీసులు తనను అరెస్టు చేసినా, తొందరపాటు చర్యలు తీసుకున్నా ప్రతిష్ఠకు పూడ్చుకోలేని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పోలీసులను తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరారు. ఆ కేసు ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని జగన్ పిటిషన్‌లో కోరారు.

# ప్రశ్నించిన పోలీసులు

>> ఆయన్ను ఎవరు బయటకు తీశారు. తదితర వివరాలను సేకరించారు. ఆ సమయంలో ఫోన్లలో వీడియోలు తీసిన వారిని కూడ గుర్తించి సమాచారం సేకరిస్తున్నారు. ఘటన జరిగిన సమయం నుండి సింగయ్యను ఆస్పత్రికి తరలించేందుకు ఏం జరిగిందన్న అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ఈ కేసులు అందుబాటులోకి మరికొన్ని సాక్ష్యాలను పోలీసులు తీసుకున్నట్లు సమాచారం.

27-06Pg3exHMNWJQECKLPRT.qxd:27-06Pg3exHMNWJQECKLPRT.qxd 01/01/01 9:09 AM Page 1





## భక్తులను మోసగిస్తున్న గేమింగ్‌యాప్‌పై చర్యలు తీసుకోండి

**- టిటిడి ఛైర్మన్‌కు జనసేన వినతి**

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల యాత్రకు సంబంధించి కొందరు మోసగాళ్ళు భక్తులను భక్తిముసుగులో గేమింగ్‌యాప్‌లతో మోసంచేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని జనసేన తిరుపతినేత కిరణ్‌రాయల్ కోరారు. ఈ మేరకు ఈ రోబ్లోక్స్ కంపెనీ యాప్‌ను ఎలా క్రియేట్‌చేశారు, భక్తులను ఎలా మోసం చేశారనే విషయాలను గురువారం మధ్యాహ్నం తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలిసి తెలియజేశారు. తిరుమలయాత్రపై గేమింగ్ యాప్‌ను సృష్టించిన ఆ కంపెనీ భక్తుల సెంటిమెంట్‌ను ఆసరాగా చేసుకుని సామాజిక మాధ్యమంలో కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారన్నారని ఫిర్యాదు చేశారు. తిరుమలపై గేమ్‌డిజైన్‌చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు కిరణ్‌రాయల్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఛైర్మన్ వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. తిరుపతి నుండి తిరుమల ప్రయాణం, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ నుండి శ్రీవారి ఆలయం, దైవదర్శనం చేసుకునే దృశ్యాలతో యాప్ రూపొందించిన కంపెనీ విషయాలను తెలిపారు. దైవభక్తిని అదనుగుగా తీసుకుని డాలర్స్ రూపంలో వసూలుచేశారని ఫిర్యాదు అందిందన్నారు. స్వలాభం కోసం తిరుమల ఫోటోలతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామాన్నారు.

## స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్‌గా సి.కుటుంబరావు

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరికం లేని సమాజాన్ని రూపొందించడం, అభివృద్ధే లక్ష్యంగా ఇప్పటికే ప్రకటించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 సమర్థంగా అమలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది. కార్యకలాపాలు సాగిం చేందుకు వీలుగా స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌గా మార్చింది. దీనికి వైస్ ఛైర్మన్‌గా సి. కుటుంబరావును నియమించింది. ఫౌండేషన్ సమర్థ నిర్వహణ, కార్యకలాపాల కోసం విధివిధానాలనూ ప్రకటించింది. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా వేమూరు రవికుమార్ నియమితులయ్యారు. ఏపీ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీకి సంబంధించి సలహాదారుగా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## దేశంలో అత్యధిక సిజేరియన్లు ఎపిలోనే

**- ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్**

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యధిక సిజేరియన్లు రాష్ట్రంలో జరుగుతున్నాయని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్ పేర్కొన్నారు. ఈ తీవ్రత తగ్గేలా సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని రాష్ట్రంలో 42.2 శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-5 గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. యునిసెఫ్, రాష్ట్ర ప్రభుత్వం, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ల అధ్వర్యంలో వైద్యుల సహాయంతో జరిగే సహజ ప్రసవాల (అసిస్టెడ్ వెజైనల్ బర్త్స్-ఏవీబీ)పై శిక్షకులకు రెండు రోజుల కార్యశాలను విజయవాడలో బుధవారం కమీషనర్ ప్రారంభించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలంటే వైద్యశాలల్లో నైపుణ్యం ఉన్న సిబ్బంది అవసరమని చెప్పారు. మాతాశిశు ఆరోగ్యమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని లియర్డల్ ఫౌండేషన్ అమలు చేస్తోందని నిర్వాహకులు వివరించారు. కార్య శాల ద్వారా అన్ని జిల్లాల సీనియర్ ప్రసూతి నిపుణులకు ఫోర్సెప్స్, వాక్యూమ్ డెలివరీ లాంటి ఏవీబీ సాంకేతికతలపై అవగాహన పెంచి, మాస్టర్ ట్రైనర్ల బృందాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జెడి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

## అతిథిగృహం వద్ద దివ్వెల మాధురి రీల్స్

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను మరోసారి మంట గలుపుతూ వైసిపి ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ బార్య దివ్వెలమాధురి బసచేసిన అతిథిగృహం వద్ద రీల్స్‌చేయడం ఇప్పుడు దుమారం రేపు తోంది. ఇద్దరూ కలసి బుధవారం ఉదయం తిరుమలకు శ్రీవారిని దర్శించుకున్నారు.

దర్శనా నంతరం దివ్వెల మాధురి బసచేసిన అతిథి గృహం వద్ద మరోసారీ రీల్స్ చేస్తూ వివాదా స్పదంగా మారారు. గతంలోనూ వీళ్ళు ఆల యం ముందు పరిసరాల్లో చేసిన రీల్స్ వీడియోలుపెద్ద దుమారాన్ని రేపిన విషయం విదితమే.

## 'యువగళానిక్షి కేంద్రమంత్రి షెకావత్ ప్రశంసలు

### అమరావతి ప్రాంతంలో ఘనస్వాగతం..



**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్త బ్యూరో:** కేంద్ర సాంస్కృతిక మరియు పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు, అమరావతి రాజధాని ప్రాంతంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు కేంద్ర మంత్రి షెకావత్ అమరావతి సందర్శనకు వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర విద్యా,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రాజ మహేంద్రవరంలో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరై నందుకు కేంద్రమంత్రికి లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రాజెక్టు తొలివిడత నిర్మాణ పనుల్లో భాగంగా రూ. 94.44 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి, తన స్వహస్తాలతో ఆరంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంపూర్ణ ప్రగతి వికాసాలకు కేంద్ర సర్కారు అందిస్తున్న సహకారానికి కూట మి ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి నారా లోకేష్, తన పాదయాత్ర "యువగళం" విశేషాలతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను కేంద్ర మంత్రికి బహూకరించారు. యువగళం పాద యాత్ర వివరాలను ఆసక్తి పరిశీలించిన కేంద్ర మంత్రి లోకేష్‌ను అభినందించారు. భవిష్యత్తులో అత్యంత సమర్థ నాయకునిగా ఎదగాలని అభిలషించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల కేంద్రమంత్రి సంతృప్తి వ్యకం చేశారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఇదే విధంగా కొనసాగి మరింత బలపడటమే కాక, రాష్ట్రాభివృద్ధికి దోహద పడాలని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రి అమరావతి పర్యటన పురస్కరించుకొని సీఎం చంద్రబాబు నివాస గృహంలో మర్యాదపూర్వక భేటీ జరిగింది.

## ఆప్కో ఉద్యోగులకు 2022 పిఆర్సీ అమలు

### - సంస్థ ఉన్నతికి విస్తృత కార్యాచరణ :ఆర్ పి సిసోడియా

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా ఆప్కో ఉద్యోగులకు సైతం 2022 పిఆర్ సిని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ లూమ్స్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం నిర్ణయించింది. బుధవారం విజయవాడ ఆప్కో కేంద్ర కార్యాలయంలో సంస్థ ఛైర్మన్, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగింది. చేనేత కార్మికుల అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై లోతుగా చర్చించిన పాలకమండలి కీలక అంశాలను అమోదించింది. ప్రధానంగా గత ప్రభుత్వ హాయాంలో ఆప్కో ఉద్యోగులకు పిఆర్ సి అమలు చేయకుండా కాలయాపన చేయగా, ప్రస్తుత బోర్డు ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుండి పెరిగిన జీతాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఆప్కో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్పటికీ, సంస్థ ఉన్నతికి ఒక పక్క ప్రత్యేక కార్యాచరణ సిద్దం చేస్తూ, మరోవైపు ఉద్యోగుల అంకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించామన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆప్కో శాశ్వత ఉద్యోగులు లబ్ది పొందుతారన్నారు. మరోవైపు ఉద్యోగుల సంపాదిత సెలవులో ప్రతి సంవత్సరం 15 రోజులు సెలవును నగదుగా మార్చుకునేందుకు సైతం పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. ఆప్కో ఉన్నతికి సం బంధించి పలు నిర్ణ యాలను సైతం పాలక మండలి ఆమోదించిందని సంస్థ నిర్వహణా సంచాలకులు విశ్వ మనోహరన్ తెలిపారు. ఆప్కో పై ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ నిర్వహించిన అధ్యయనం నివేదికను పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామన్నారు. సొసైటీ లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. విశ్వవ్యాప్త విక్రయాలను ప్రోత్సహించేలా ఆప్కో వెబ్ సైట్ ను ఆధునీకరించనున్నామని విశ్వ మనోహరన్ తెలిపారు. అప్కో , లేపాక్షి సంస్థల ఉత్పత్తులు రెండు సంస్థల షోరూమ్ లలో ఉండేలా తీసుకున్న నిర్ణయాన్ని పాలకమండలి స్వాగతించిందన్నారు. చేనేత, జౌళి శాఖ కమీషనర్ జి.రేఖారాణి మాట్లాడుతూ చేనేత కార్మికులకు మెరుగైన వేతనాలు లభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సమావేశంలో పాలకమండలి డైరెక్టర్లుగా ఉన్న నాబార్డు ఎజిఎం మిలింద్ చౌసల్కర్, ఆప్కాబ్ సిజిఎం నర్రా వెంకటరత్నం, ఎన్ సిడిసి ప్రాంతీయ సంచాలకులు స్నేహాన్షు గోస్వామి, ఆన్ లైన్ విధానంలో పరిశ్రమల శాఖ ఉప కార్యదర్శి నేతల వీర విజయ కుమారి పాల్గొన్నారు. ఆప్కో జిఎం నాగేశ్వరరావు, ఎజిఎంలు హరికృష్ణ, బేనహర్, సాయిబాబు, ఎఓ శ్రీనివాసరావు సమావేశంలో ఉన్నారు.



జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా అధ్యక్షతన జరిగిన ఆప్కో పాలక మండలి సమావేశం

## కడప నగరానికి అమృత్ పథకంతో సొబగులు

**కడప,కర్నూల్, అనంతపురం జిల్లాలకు రూ.2262 కోట్ల అమృత్2 పథకం నిధులు**

**కడప నగరానికి 663 కోట్ల నిధులు టెండర్లు పిలిచిన ప్రభుత్వం**




**రాజంపేట,జూన్26 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ పథకం పనులకు మరల కదిలిక వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా జమ చేయకపోవడంతో మూలనపడ్డ అమృత్ పథకానికి మరలా ప్రాణం వచ్చింది. కూటమి ప్రభుత్వం తిరిగి అమృత్ పథకం కింద ఎంపికైన పట్టణాలకు మంచినీటి పైప్ లైన్ వ్యవస్థ ,మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు అయ్యాయి. ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు 2,262.79 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మూడు జిల్లాలలో అమృత పథకం ద్వారా పనులు చేప ట్టేందుకు అనంతపురం పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ.రామ్మోహన్ రెడ్డి గురువారం టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప కార్పొరేషన్ కు అత్యధికంగా 663.05 నిధులు మంజూర య్యాయి. ఈ నిధులతో మంచినీటి పైప్లైన్ వ్యవస్థను సమూలంగా మార్పు చేయనున్నారు 592.23 కోట్ల రూపాయలతో పైప్ వ్యవస్థను, మంచినీటి సరఫరా వ్యవస్థను మార్పు చేస్తారు. అలాగే 70.82 కోట్ల వ్యయంతో మురుగునీటి వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తారు. అలాగే జిల్లాలోని ఎర్రగుంట్ల ,జమ్మలమడుగు ,బద్వేల్ ,మైదుకూరు మున్సిపాలిటీలలో కూడా అమృత్ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపాలిటీల్లో పనులు చేపడతారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరంలోని ఆదోని మున్సిపాలిటీలోనూ నంద్యాల మున్సి పాలిటీ లోనూ పనులు చేపడతారు. కర్నూలు నగరంలో మంచినీటి పైప్లైన్ వ్యవస్థకు 137.53 కోట్లు, మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు 150.11 కోట్లు మంజూరయ్యాయి. నంద్యాల మున్సిపాలిటీలు మంచివి ఐపిఎల్ వ్యవస్థకు 38.75 కోట్లు, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి 169.67 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అలాగే డోన్ ,బేతంచెర్ల మున్సిపాలిటీలో కూడా అభివృద్ధి పనులు అమృత్ ద్వారా చేపట్టనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, తాడిపత్రి, గుంటకల్, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుగొండ, మడకశిర మున్సిపాలిటీలలో 561.38 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఈ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు.1 ప్యాకేజీలో అనంతపురం, సత్యసాయి,

అన్నమయ్య జిల్లాల్లో 609. 58 కోట్లు, ప్యాకేజీ 2 లో కర్నూలు, నంద్యాల జిల్లాలో 687.76 కోట్లతోనూ, కడప జిల్లాలో 3 ప్యాకేజీ కింద 965.45 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు.

## పోలీసులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ నుండి ప్రశంసాపత్రం

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజల పాస్‌పోర్ట్ కలలకి వేగంగా అండగా నిలుస్తూ, సమర్థవంతమైన వెరిఫికేషన్ ప్రక్రియతో దేశ వ్యాప్తంగా అత్యుత్తమంగా నిలిచేందుకు గాను భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖకు ప్రతిష్ఠాత్మకమైన 'సర్టిఫికెట్ ఆఫ్ రికగ్నైజేషన్‌ను ప్రధానం చేసింది. .జూన్ 23 నుండి 25 వరకు ఢిల్లీలో నిర్వహించిన 13వ పాస్‌పోర్టు సేవా దినోత్సవంలో ఈ అవార్డును అందచేసింది. ఒక సంవత్సర కాలంలో 6.25 లక్షల పోలీసు వెరిఫికేషన్లు ఏపీ పోలీసు శాఖ మరోసారి తన కార్యదక్షతను చాటింది. దేశ వ్యాప్తంగా అత్యుత్తమ పనితీరుతో మెప్పించి, కేవలం ఒక సంవత్సర కాలంలో 6.25 లక్షల పోలీస్ వెరిఫికేషన్ నివేదికలు పూర్తి చేయడంలో రికార్డు నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో ఏపీలకి మొత్తం మూడు విభాగాలలో అవార్డులను అందుకుంది..

పోలీసు విభాగం అవార్డు: రాష్ట్ర పోలీసు శాఖ-వేగవంతమైన వెరిఫికేషన్ గుర్తింపు. ఇనిస్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు(పోస్టల్) గుంటూరు పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రం. ఇండివిడ్యువల్ రికగ్నైజేషన్ అవార్డు లభించింది. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి (ఆర్‌పిఓ) రెండో సారి ఘనత లభిం,ఇంది. ఈ అవార్డు ఎపి పోలీసులకు రావడం ఇది రెండో సారి. గతంలో 2018-19లో కూడ రాష్ట్రానికి ఇదే గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ 'ఇది కేవలం పోలీసు శాఖ విజయమే కాదు. రాష్ట్ర ప్రజలకి సమర్థవంతమైన సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి విజన్ ఫలితమే' అని అన్నారు.



విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పాస్‌పోర్టు అధికారిణి

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు వివరాలివ్వండి

**- పోలీసులకు హైకోర్టు ఆదేశం**

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటనలో దర్యాప్తు వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పిటీషనర్లు ఆరోపిస్తున్నట్లు దర్యాప్తులో ఏమైనా పొరపాట్లు జరిగాయా... అని ఆరా తీసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ దర్యాప్తులో ఎలాంటి తప్పు లూ చోటుచేసుకోలేదన్నారు. దర్యాప్తు చివరి దశకు చేరిందని తెలిపారు. దారిలో ప్రవీణ్ మూడు చోట్ల మద్యం కొన్నారని, ఆయన బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోందని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపినట్లు వీడియో ఆధారాలు న్నాయని చెప్పారు. ప్రవీణ్ మృతిపై వారి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడం లేదన్నారు. రూ.5 లక్షలు కోర్టులో జమ చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని హర్షకుమార్ తరపు న్యాయవాది అభ్యర్థించడంతో ధర్మాసనం అంగీకరించింది. విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎపాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెప పాల్, హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని మాజీ ఎంపీ హర్షకుమార్ వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. పిల్స్ దాఖలు వెనుక సదుద్దేశాన్ని నిరూపించుకునేందుకు రూ.5 లక్షల చొప్పున హైకోర్టులో జమ చేయాలని పిటీషనర్లను ఆదేశించింది. విచారణలో కెఎ పాల్ వాదనలు విని పిస్తూ, తన పిల్ ఉపసంహారణకు అనుమతించాలని, తాజాగా దాఖలు చేసుకునేందుకు వెసులుబాటు ఇవ్వాలని కోరారు.

## తన సమస్యను పరిష్కరించాలని డిఆర్‌ఎం కార్యాలయం ఎదుట లోకో పైలట్ నిరాహార దీక్ష

**గుంతకల్లు రైల్వే, జూన్ 26,ప్రభాతవార్త** రైల్వే యాజమాన్యం నిరపరాధి అయిన తనను ఉద్దేశపూర్వకంగా రైల్వే సర్వీస్ నుంచి తొలగించిందని ఆరోపిస్తూ బాధిత రైల్వే లోకో పైలట్ విజయ్ బహద్దూర్ పాథక్ నిరాహార దీక్షకు దిగారు. తన న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరుతూ విజయ బహద్దూర్ పాథక్ గురువారం ఉదయం 10గంటల నుంచి 24గంటల పాటు నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలతో తనను విధుల నుంచి తొలగించడం న్యాయం కాదని పేర్కొంటూ డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని పాథక్ డిఆర్‌ఎం గుప్తాకు విజ్ఞప్తి చేశారు.

# తిరుమల సమాచారం

## నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తాం: టిటిడి ఛైర్మన్ నాయుడు



**తిరుమల, జూన్ 26ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని కడపజిల్లా నందలూరులోని సౌమ్య నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. జులై 5వతేదీ ఉండి 13వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల గోడపత్రికలను గురువారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒలు ప్రశాంతి, నటేశ్‌బాబుతో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు జులై 4వతేదీ అంకురార్పణ జరుగుతుందని, భక్తులకు స్వామివారి దర్శనం, తాగునీరు, అన్నప్రసాదాలు అందజేయాలని కోరారు. జులై5న ఉదయం 10.30గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8గంటలకు,రాత్రి 7గంటలకు వాహనసేవలు జరుగుతాయి. జులై 11వతేదీ ఉదయం 10గంటలకు ఆర్జితకల్యాణోత్సవం జరుగుతుంది. గృహస్థభక్తులు 500 రూపాయలు చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చున్నారు. గృహస్థులకు ఒక ఉత్తరీయం, ఏక రవికె, అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు. 14వతేదీ సాయంత్రం ఆలయంలో పుష్పయాగం నిర్వహించనున్నారు.

## జులై 5నుండి అమెరికాలో శ్రీనివాస కల్యాణాలు

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** నిత్య కల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవం సేవ తరహాలోనే అమెరికాలో జులై 5వతేదీ నుండి సెప్టెంబర్ 1వతేదీ వరకు మూడునెలలు 8 నగరాల్లో విస్తృతంగా శ్రీనివాసకల్యాణాలను తిరుమల తిరుపతిదేవస్థానం నిర్వహించనుంది. శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా ఈ కల్యాణాలను నిర్వహించేలా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆదేశాలిచ్చారు. ఆయన అమెరికాలో స్థిరపడిన ప్రవాసభారతీయుల కోసం కల్యాణోత్సవాలను టిటిడి చేపడు తోంది. టిటిడి కల్యాణోత్సవం ప్రాజెక్టు ఆధ్వర్యంలో నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (ఎన్ఎటిఎస్, నాటాస్), నార్త్ టెక్సాస్ హిందూ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని 8 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. శ్రీనివాసకల్యాణాలు అమెరికాలో నిర్వహించే ప్రాంతాలను టిటిడి వెల్లడించింది. అమెరికా దేశంలో శ్రీనివాసకల్యాణోత్సవాలకు సమన్వయకర్తగా శ్రీధర్ గొట్టిపాటి వ్యవహరించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి రాష్ట్రప్రభుత్వం, టిటిడి పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేపడుతోంది.

జులై5వతేదీ ఫ్లోరిడాలోని టాంపా, జులై 12న కరోలిన రాష్ట్రంలోని ర్యాలీ ప్రాంతంలో, 19న న్యూ జెర్సీలోని న్యూజెర్సీలో, జులై 26న మిస్సోరీ రాష్ట్రంలోని సెయింట్ లూయిస్‌లో, ఆగస్టు 2న ఇల్లినాయ్‌రాష్ట్రంలోని చికాగోలో, ఆగస్టు 16న వాషింగ్టన్‌రాష్ట్రంలోని సీటెల్‌లో, ఆగస్టు 23న జార్జియా రాష్ట్రంలోని అట్లాంటలో, సెప్టెంబర్ 1న టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు జరిపించనున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలుసుఖ సంతోషాలతో ఉండాలని, అంతా శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఎమ్మెల్యే సుజనాచౌదరి, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, ఒడిస్సా ఎంపి అపరింజిత సారంగి, ఉత్తరాఖండ్ మాజీ సిఎం త్రిపురాంత్‌సింగ్‌రావత్, సినీనిర్మాత బండ్లగణేశ్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు ఎన్ఆర్ఐ భూరి విరాళం

**- ఛైర్మన్ నాయుడుకు రూ.కోటి చెక్కు అందజేత**



**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా పేదవారికి ఉచితంగా అవసరమైన శస్త్రచికిత్సలు, గుండె ఆపరేషన్లు ఇతరత్రా మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు ఎన్ఆర్ఐ దాత తోటచంద్రశేఖర్ కోటి రూపాయలు విరాళాల చెక్కును టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు గురువారం ఉదయం ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో అందజేశాడు. ఈ సందర్భంగా దాత చూపిన దాతృత్వాన్ని ఆయన అభినందించారు. దాత తోటచంద్రశేఖర్ గూగుల్ సంస్థలో కీలకపదవిలో ఉన్నాడు.

## ఉద్యోగుల సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్

**-2వేల హెల్మెట్లు అందజేసిన టిటిడి ఛైర్మన్ నాయుడు**

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ భక్తులకు ఇతోధిక సేవలందించేందుకు తిరుమల-తిరుపతి, తిరుపతి-తిరుమల మధ్య ద్విచక్రవాహనాల్లో విధులకు హాజరవుతున్న ఉద్యోగులు, సిబ్బంది సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కోరారు. బండి నడిపితే తలకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అన్నారు. టిటిడి ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్‌ల పంపిణీ రెండవ విడత గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో చేపట్టారు. అమలాపురంకు చెందిన నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన నాగేంద్రప్రసాద్ దాతలు విరాళంగా 15లక్షలు రూపాయలు విలువైన 2వేల హెల్మెట్లు అందించారు. ఈ హెల్మెట్లను దాతలతో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఉద్యోగులకు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో 7,500 హెల్మెట్లు టిటిడి ఉద్యోగులకు అందిస్తామని తెలిపారు.

## భగవంతుని ఆశీస్సులు ప్రభుత్వంపై ఉండాలి : సినీనటుడు రఘు, నటి శ్రీదేవి

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి చల్లనిచూపు, దయ ఆశీస్సులున్న ప్రభుత్వంపై, మనందరిపై ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు సినీనటుడు రఘు, నటి జాబిలి శ్రీదేవి తెలిపారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.: 03/2025-26/CE (GVMC)/SE-IV/E.E-VI, Dt: 16.06.2025
Number of Works : 3 Nos., Value of Works : Rs.1639.64 Lakhs
Downloading Starting Date : 25-06-2025 @ 02.00 PM
Downloading Ending Date : 09-07-2025 @ 02.00 PM
Note: Further details @ www.ape.procurement.gov.in
O/o CE (GVMC) or EE-VI (Contact No.9550781594) For Commissioner

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada – 520002 (A.P.)
E-Procurement Short Tender Notice (Second-Call)
NIT No. :102/PROC/MAU61-USIOHB(SECW)/4/2025-HB/2nd Call, Dated: 25.06.2025
Name of Work: APCRDA - "RFP for Engagement of Project Management Consultant (PMC) for the work Construction of civil structures Legislative Assembly building (B+G+3) and High court building (B+G+7) in Amaravati Government complex area of Amaravati Capital City, Andhra Pradesh".
The bid can be downloaded on AP e-procurement portal from 27.06.2025 to 05.07.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 05.07.2025 up to 15.00 Hrs, Technical bid opening 05.07.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

కష్టసుఖాలనే అడ్డుగోడల్ని చీల్చుకొని పోగలిగేది కేవలం మంచి ప్రవర్తన మాత్రమే.

-ఐ. గెథే

# వ్యాపారంగా మారుతున్న భిక్షాటన!


ఆశ అత్యాశగామారి దురాశగా రూపాంతరం చెందితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి. అడ్డదారులకు, అక్రమాలకు అదుపుఅజ్ఞా ఉండదు. ఈ కారణంగానే భిక్షాటన ఒక వ్యాపారంగా రూపాంతరం చెందుతున్నదేమోననిపిస్తున్నది. అన్నెం పున్నెం ఎరుగని పసిబాలలతో భిక్షాటన చేయించడం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ముఖ్యంగా పుణ్యస్థానాల్లో పెరిగిపోతున్నది. భిక్షాటనే వృత్తిగా జీవనం సాగించేవారి సంఖ్య పెరుగుతున్నా చర్యలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. చట్టాలు చేస్తున్నారు. కానీ వాటి అమలు చేసే విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదు. భిక్షాటనకు మించి లాభసాటిగా ఉండే మరో వృత్తివ్యాపారం లేదని చెప్పొచ్చు. పెట్టుబడి ఉండదు. నష్టాలు వచ్చే అవకాశం లేదు. సర్వకాల సర్వవస్థలయందు వృత్తి ఆగే పరిస్థితి లేదు. అందుకే ఈ వృత్తిలోకి దిగినవారు ఎవరైనా దాన్ని వదిలి రావడానికి ఏమాత్రం అంగీకరించరు. కాకపోతే ఆరంభించేటప్పుడు కొంత ఇబ్బందిగానే ఉంటుంది. ముఖ్యంగా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి పదాలకు చోటు ఇవ్వకుండా వాటిని త్యాగం చేయగలిగి పట్టించుకోకపోతే ఇంతకు మించిన లాభసాటి వృతి మరొకటి లేదనేది నిర్వివాదం. భిక్షాటనను నిరోధించడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా నిరుపయోగం అవుతున్నాయి. కాగా ఈ వృత్తిని ఆశ్రయించేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతున్నది. విధివంచనకు గురై అంగవికలురై మరే పని చేయలేక పొట్టగడవక, నా అనే వారు లేక, మరో గత్యంతరం లేక, భిక్షాటన వైపు మొగ్గుచూపుతున్నవారి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సానుభూతి ప్రకటించవచ్చు. వారికి అంతో ఇంతో సహాయం చేయవచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటి మానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి. కానీ దాన్ని ఆసరాగా తీసుకొని కాలు, చేతులు అన్నీ సక్రమంగా ఉండి పనిచేసే శక్తి ఉన్నా భిక్షాటన చేపట్టడం ఎంతవరకు సమంజసం? చివరకు దీన్ని వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో ఊహించుకోవచ్చు. ప్రాంతాల వారీగా అడ్డుకుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో తాము తప్ప మరొకరు అడుక్కోకూడదని నిషేధిస్తున్నారు. దీంతో భిక్షగాళ్ల గ్రూపుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. పోలీసులు జోక్యం చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక హైదరాబాద్ లాంటి నగరాల్లో యాచకుల సంఖ్య పెరిగిపోతున్నది. రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండ్లు, ప్రార్థనామందిరాలు, ఒక చోటేమిటి అడుక్కోవడానికి వీలైన చోట్ల వీళ్లతో నిండిపోతున్నది. చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ముందు, వెనుక చూడకుండా ఒక్కసారిగా వాహనాలకు అడ్డుపడుతున్నారు. కదులుతున్న వాహనాల్లో చేతులు చాపుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పోలీసులు వీరిని బలవంతంగా పారద్రోలినప్పటికీ మరుసటి రోజు అక్కడే ప్రత్యక్షమవుతున్నారు. వీరి వెనుక కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తీవ్ర కరవుతో అన్నానికి జరక్క అల్లాడుతున్న పొరుగు రాష్ట్రాల్లోని దుర్భిక్ష ప్రాంతాలకి ఈముఠాలు వెళ్లి అక్కడి నుంచి పదేళ్లలోపు పిల్లలను తీసుకువస్తున్నారు. వారి తల్లిదండ్రులకు అంతో ఇంతో ముట్టచెప్పి మూడు నాలుగు నెలలకాంట్రాక్టుగా ఈ వృత్తిలోకి దింపుతున్నారు. వారికి చింపిరి బట్టలు తొడిగి ఉదయాన్నే వ్యాన్‌లో అడుక్కుతినే కూడళ్ల వద్దకు తీసుకువెళ్లి దింపుతున్నారు. తిరిగి సాయంత్రానికి వారిని తీసుకువెళ్లుతున్నారు. విదేశీ ప్రముఖులు నగరానికి వస్తున్నప్పుడు వీరి వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని తాత్కాలికంగా దూరంగా తరలిస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వకాలంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ముందుజాగ్రత్త చర్యలుగా యాచకులందరిని నగరానికి దూరంగా తరలించారు. ఆ తర్వాత జార్జిబుష్ వచ్చినప్పుడు కూడా అధికారికంగా ప్రకటించకపోయినా అదే దారిపట్టారు. ఎప్పుడూ విదేశాల ప్రముఖులు వచ్చినా ఈ తంతు తప్పడం లేదు. ఈ వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారుతున్నది. హైదరాబాద్ నగరంలోనే కాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లో సమస్య అంతకంతకు పెరుగుతున్నది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సక్రమంగా ఉండి అడుక్కుతినేందుకు సంసిద్ధులైతే గ్రామస్తులు అంగీకరించరు, ప్రోత్సహించరు. పైగా అటువంటి ప్రయత్నం ఎవరైనా చేస్తే నిరుత్సాహపరిచి మందలిస్తారు. కానీ పట్టణాలు, పుణ్యక్షేత్రాల్లో పరిస్థితి వేరుగా ఉంది. రెండు రాష్ట్రాల్లో దాదాపు ఏడెనిమిది లక్షలమంది యాచకులు ఉండవచ్చుననే అంచనా. వీటిలో కొందరు ఈ వృత్తిద్వారా లక్షలాది రూపాయలు సంపాదించేవారు ఉన్నారు. నెలకు నలభై, యాభై అద్దెలు వచ్చే భవనాలున్న భిక్షగాళ్లు ఉన్నారు. మంచి మంచి కుటుంబాల్లోని వారు సైతం ఆదరణ కరవై, చిన్నచిన్న మనస్పర్థలతో కుటుంబ సభ్యుల మీద ఆగ్రహంతో ఇల్లువదిలి వచ్చి బతుకు దుర్భరమై తిరిగి ఇంటికి వెళ్లలేక యాచనకు అలవాటుపడి ఆ తర్వాత ఆవృత్తిని వదిలిపెట్టలేకపోతున్నారు. దీనికితోడు పొరుగునున్న జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి యాచకులు తరలివస్తున్నారు. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత పటిష్టం చేసి అమలకు శ్రీకారం చుట్టాలి. అలాగే మరో దారిలేక యాచకులైన వారి సంక్షేమాన్ని కూడా పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

ఐశ్వర్యానికి ఆభరణం మంచితనం. విద్యకు అలంకారం నీతి, ధనానికి అలంకారం దానం. అన్ని గుణాలకీ అలంకారం మంచి శీలం.



అబ్రహాంలింకన్

కఠినంగా ఉన్నదాన్ని సరళంగానూ, సరళంగా ఉన్నదాన్ని అలవాటుగానూ, అలవాటుగా ఉన్నదాన్ని ఆహ్లాదంగానూ తయారు చేసుకో.



కె.స్టానిస్లావిస్కి

# ప్రజావాక్కు



## రైల్ల హాల్ట్ పునరుద్ధరణ మాట గాలికేనా?

వ్యాపార, వ్యవసాయ విద్యారంగాల్లో ఎంతో అభివృద్ధి చెందినపశ్చిమ గోదావరిజిల్లా అత్తిలిలో టిక్కెట్లు విక్రయాలు తక్కువగా ఉన్నాయన్న సాకుతో 2021 సంవత్సరం కరోనా సమయంలో అత్తిలి రైల్వే స్టేషన్లో పలు ఎక్స్‌ప్రెస్ రైల్ల హాల్ట్ రద్దుచేశారు. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలకు ముందునర్సాపురం నియోజకవర్గంబిజెపి యమ్.పి అభ్యర్థిఎన్నికల ప్రచారసమయంలో భాగంగా ఆగిపోయిన ఎక్స్ ప్రెస్ రైల్లహాల్ట్‌లు అన్నీ కూడా యమ్.పి గా ఎన్నికైన వెంటనే కేంద్రరైల్వే శాఖామంత్రితోనూ, ఇతర అధికారులతో మాట్లాడి ఎక్స్‌ప్రెస్ రైళ్లు అన్నీ ఆగే విధంగా బాధ్యత తీసుకుంటానని అత్తిలి మండల ప్రజలందరికీ హామీ ఇస్తున్నట్లుగా అప్పుడుచెప్పారు. ఆయన యమ్.పి గా గెలిచి కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సరం దాటుతున్నా కూడా ఆయన ఇచ్చిన హామీ గాలికేనా అనిపిస్తుంది.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గోజిల్లా

## అస్తిత్వాన్ని కాపాడుకోవాలి

నిజమే బహుళపక్ష వాదం ప్రమాదంలో పడింది. ఎందుకని ఆధిపత్య దేశాల దుందుకుడు చర్యల వల్ల మాత్రమే లేదా అవకాశ వాదం వల్లనే అని చెప్పక తప్పదు అయితే ఇప్పుడు భారత్ చేయవలసింది ఏమిటి తన అస్తిత్వం చెడిపోకుండా ఇతరులు వేలుపెట్టకుండా చేసుకోవడమే అంటే అమెరికా అధ్యక్షుడుచెప్పినట్లు భారత్‌పాక్ యుద్ధం అంచులకు వెళ్లకుండా ఆపానని పదే పదే చెపుతున్న తన పెద్దన్న పాత్రఎక్కడ జారిపోతుంది అన్న మీమాంస అమెరికాలోను స్పష్టంగా కనపడుతున్నది. తగువులాట పెట్టేది తనేచల్లరిపేది తనేఅన్నచందంగా అమెరికాపరిస్థితి ఉంది.

- భారత అవినాష్, జనగామ

## దేశ చరిత్రలో మైలురాయి

నూటనలభైకోట్లమంది భారతీయుల ఆశలను మోసుకుని శుభాంశు శుక్లా రోదసీలోకి వెళ్లడం అభినందనీయం. ఈ ప్రయోగం విజయవంతం కావాలని అందరం కోటుకుందాం డ్రాగన్ రోదసీలోకి దూసుకెళ్ళగానే దేశం అంతా హర్షం వ్యక్తంఅవుతుంది. శుక్లానుచూసి భారత్ గర్వపడుతోంది.దేశచరిత్రలో ఇదొక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. ప్రపంచంలో భారత్ అన్ని రంగాల్లో రాణిస్తుంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లిజిల్లా

## ప్రయాణ భద్రత రాజీ పడకూడని అంశం

దేశవ్యాప్తంగా ప్రముఖ విమానాశ్రయాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిర్వహించిన ఇటీవలిన ఆడిట్‌లో వెలుగుచూసిన విమాన రవాణా లోపాలు దేశ ప్రజల ప్రాణభద్రతపై ముప్పుగా మారిన అంశాలను స్పష్టంగా బయట పెట్టాయి. మరమ్మతులు జరగని విమానాలు, దెబ్బతిన్న టైర్లు వంటి వాటితోపాటు,పునరావృతంగా కన్పించే లోపాలు ఇవన్నీ విమానయాన సంస్థల్లో పర్యవేక్షణా వ్యవస్థలు ఎంతగా క్షీణించి పోతున్నాయో తెలుపుతున్నాయి.నిర్వహణ ప్రమాణాలు పాటించని విమాన సంస్థలపై కఠిన శిక్షలు అమలు చేయాలి. వీటిలో భారీ ఆర్థికజరిమానాలు, లైసెన్సు తాత్కాలికంగా రద్దు చేయడం,అవసరమైతే శాశ్వతనిషేధం వంటిచర్యలు కూడా ఉండాలి. డీజీసీఏ తన పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఆకస్మిక తనిఖీలను మరింత పటిష్ఠంగా నిర్వహించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## హాస్యాస్పదం

పశ్చిమాసియాలో 12 రోజులు ప్రజ్వలంగా ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య భీకర యుద్ధం జరిగి ప్రాణ ఆస్తి నష్టాలు జరిగాక ప్రశాంతి లభించింది. ఈ బుద్ధిముందే ఎందుకు రాలేదు? వచ్చి ఉన్నట్లయితే నష్టాలనివారణ జరిగేదిగా యుద్ధాల్లో నాయకులు సాధారణంగా క్షేమంగానే ఉంటారు.ఈకాల్పుల విరమణ ఎంత కాలం?యుద్ధాలకు గల కారణాలు సమసి పోయాయా? దీనికి ముగింపు పలకాలని యుద్ధ పిపాసి అయిన ట్రంప్ ఎందుకు నిర్ణయం తీసుకున్నట్లు? తానీ యుద్ధం ఆపడంవల్ల తన గౌరవం మరింత ఇనుమడించిందని ఆయన ఆనందంతో పొంగి పోతున్నారు. ఆయనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని చెప్పి తప్పు చేసామని పాకిస్థాన్ నాలుక కరుచుకుంది. అసలు ఈ ప్రతిపాదనే హాస్యాస్పదంగా మారింది.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## మద్యం షాపులు దూరంగా ఉండాలి

ఇటీవలఏపిలోకొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్నినగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లో వచ్చేజనం ఆ మార్గం గుండా వస్తారు. మద్య సేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటున్న ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోతున్నారు. ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారు.

-బొల్లోజు మేఘనాధ్, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సోషల్ మీడియా సుడిలో చిక్కిన సమాజం

**మొత్తంగా ఈ దారుణ మారణ సంఘటనలకు ఆది మూలం ఆర్థికం, వివాహేతర సంబంధాలు. వీటి నుండి సమాజాన్ని రక్షించుకోవాలి. మానవీయతను పెంచి పోషించాలి. విలువల రాహిత్యాన్ని నిరోధించాలి. వీటిని పెంపొందించాలంటేవిద్యా విధానాన్ని మెరుగుపరచాలి. విద్యలో అంతరాలను తొలగించాలి. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. పాలకులు ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించాలి. ప్రజల కోసం ప్రజల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం పాటుపడాలి. నైతిక విలువలు పెంపొందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియాను కట్టడి చేయాలి. మన దేశంలో 46 కోట్లమందికి పైగా సోషల్ మీడియా వినియోగదారులు ఉండటం ఆశ్చర్యకరం. చిన్నపిల్లలు ఉపయోగించకుండా చట్టాలు చేయాలి.అమానుషంగా ప్రవర్తించిన వారిని నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠినంగా శిక్షించాలి.**

తండ సదానందం

మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు, మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అని ప్రముఖ తెలంగాణ కవి అందెశ్రీ రాసినట్టు ప్రస్తుత ఆధునిక సమాజంలో గ్రహాంతరాలను చుట్టి వస్తున్నా, అభివృద్ధిలో రాకెట్ల దూసుకుపోతున్న మానవత్వం కోరవడుతున్నది. తల్లిదండ్రులు,అన్నదమ్ములు,అక్క చెల్లెలు,భార్యభర్తల మధ్య బంధాలు అనుబంధాలు ఆప్యాయత అనురాగాలు మటు మాయమవుతున్నాయి. అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకంలా స్వార్థంతో రగిలిపోతున్నారు. తాత్కాలిక సుఖ సంతోషాల కోసం నేరాలు ఘోరాలు హత్యలు జరుగుతుండడం అత్యంత విచారకరం. సభ్య సమాజం తలదించుకునే విధంగా ఒళ్లుగగుర్పొడిచే అత్యంత దారుణ సంఘటనలు చోటు చేసుకుంటుండటం బాధాకరం. ఇటీవల మీడియాలో పలు రకాల నేరాలకు సంబంధించిన వివరాలు చూస్తుంటేమానవ సమాజం పయనం ఎటువైపు అని బాధవేస్తుంది. అత్యంత విలువైన మానవ ప్రాణాలను అతి సులువుగా దయాదాక్షిణ్యాలు ,ప్రేమానుబంధాలు ఏమీ లేకుండా కర్కశంగా చంపివేయడం దారుణాతి దారుణం. మానవులకు, జంతువులకు తేడా ఏమిటంటే విచక్షణ. మనిషికి విచక్షణ ఉంటుంది.కానీ నేటికాలంలో ఎటువంటి విచక్షణ ఆలోచన లేకుండా హత్యలకు పాల్పడుతుండటం మానవ సమాజానికి సిగ్గుచేటు.నవ మాసాలు మోసి, పురిటినొప్పులతో మరో జన్మఎత్తి పిల్లలకు ప్రాణం పోసి, మలమూత్రాలు ఎత్తి, తమ రక్తాన్ని పాలగా ధారపోసి అష్టకష్టాలు పడి బిడ్డలను పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా తల్లిదండ్రులు, పిల్లలకు క్రమశిక్షణ నేర్పే విషయంలో పెద్దల బాధ్యతగా మందలించినందులకు క్షణికావేశంలో తల్లిదండ్రులను తమ బిడ్డలే కఠినంగా కొట్టి హింసించి చంపివేయడం లాంటి వార్తలు వెలుగులోకి రావడం శోచనీయం. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అస్తమానం ఫోన్లో తమ బాయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడుతుంటే అది సరికాదని మందలించినందులకు ఆ తండ్రిని అతని కూతుర్లు భార్య, వారి స్నేహితుల తీవ్రంగా దాడి చేసి హత్య చేయడం జరిగింది. మేడ్చల్ జిల్లాలో పట్టుమని 16ఏళ్లు లేని పదవ తరగతి చదువుతున్న అమ్మాయి గత 8 నెలలుగా సోషల్ మీడియాలో పరిచయమైన అబ్బాయితో కాలక్షేపం చేస్తుండడంతో వద్దని వారించినందుకు కని పెంచిన అమ్మ ఆప్యాయత అనురాగాలను మరిచి పగతో ద్వేషం పెంచుకొని తన స్నేహితుడితో కలిసి పథకం ప్రకారం తల్లిని హత్య చేయడం అమానవీయతకు నిదర్శనం.

ప్రేమించామని చెప్పి చేట్టపట్టాల్ వేసుకుని తిరిగి బ్రతిమాలి పెళ్లి చేసుకొని కొద్ది రోజులకే మరో స్నేహితునితో కలిసి కిరాతకంగా భార్యాభర్తల అనుబంధాన్ని మంటగలిపి తన భర్తను చంపించడం వంటి దుస్సంఘటనలు కోకోల్లలుగా జరుగుతుండడం మానవత్వానికి మాయని మచ్చ. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థికసంబంధాలే అనడానికి మచ్చుతునకలుగా మిగిలిపోతున్నాయి ఈ నేరాలు ఘోరాలు. రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదని ఒక కుమారుడు వృద్ధ తండ్రిని నాలుక కోసి హింసించడంలాంటి సంఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించి ఆదుకోవాల్సి ఉండగా



ఆరోగ్యం బాగాలేక తను సంపాదించిన భూమికే ప్రభుత్వం నుండి వచ్చిన రైతు భరోసా డబ్బులో కేవలం 2000ఖర్చు చేసినందుకు తీవ్రంగా దాడిచేసి కోడవలితో నాలుక కోసిన కుమారుడు, మరోవైపు తల్లిదండ్రుల ఒత్తిడితో వివాహం చేసుకొని పిల్లలను కనీపెంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలిసిన క్లాస్మేట్ అండతో కన్నపేగును కనికరంలేకుండా తెంచుకున్న ఇల్లాలు ఉండటం దురదృష్టకరం. ఇలా నిత్యం పతాక శీర్షికలో అత్యంత అమానవీయ సంఘటనలు చోటు చేసుకోవడం విలువల రాహిత్యమే. సమాజంలో విలువల మృగ్యమయ్యాయి. ముఖ్యంగా నాగరికులలో అత్యంత ఉన్నత విద్యావంతులలో విలువలు లోపించడం భవిష్యత్తు తరాలకు గొడ్డలి పెట్టువంటిది. ఆధునిక పోకడలతో ఆర్థికంగా అమాంతంగా ఒకేసారి ఎదిగిపోవాలనే దురాశతో మనిషి అమానుషంగా ప్రవర్తిస్తుండటం, వీటికితోడు సోషల్ మీడియా,సెల్‌ఫోన్ తోడవడంతో విపరీత అనర్థాలకు మూలం అయ్యాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా అడ్డుఅదుపు లేకుండా చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు విచ్చలవిడిగా సెల్ఫోన్ సోషల్ మీడియాను ఉపయోగించుతుండటంతో ఈ సంఘటనలకు బీజం పడుతున్నాయి. మంచికి బదులుగా చెడు విషయాలకు విరివిగా వాడుతుండడం అభ్యంతరకరం. మనుషులకు సరిపడా ఉపాధి లేక ఖాళీగా ఉంటుండడంతో నేర ప్రవృత్తి చెలరేగుతుంది. ఉద్యోగాల కోసం తమ సొంత తల్లిదండ్రులనే చంపాలనుకోవడం దుర్మార్గం.కారుణ్య నియామకాల కోసం కన్న కొడుకులే కాలయములవుతున్నారు.ఆస్తి పంపకాల తేడాలతో అన్నదమ్ముల మధ్య హత్యలు జరుగుతున్నాయి. ఇటీవల సొంత తమ్ముళ్లే అన్నతో గొడవపడి అడ్డువచ్చిన తండ్రిని సైతం చితకబాది అన్నను హత్యచేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది.ఇటువంటి పరిస్థితులలో కుటుంబ సభ్యుల మధ్య అభద్రతాభావం పెరిగిపోయింది. నమ్మకాలు సడలిపోతున్నాయి. మొత్తంగా ఈ దారుణ మారణ సంఘటనలకు ఆది మూలం ఆర్థికం, వివాహేతర సంబంధాలు. వీటి నుండి సమాజాన్ని రక్షించుకోవాలి.మానవీయతను పెంచి పోషించాలి. విలువల రాహిత్యాన్ని నిరోధించాలి. వీటిని పెంపొందించాలంటేవిద్యా విధానాన్ని మెరుగుపరచాలి. విద్యలో అంతరాలను తొలగించాలి. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. పాలకులు ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించాలి. ప్రజల కోసం ప్రజల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం పాటుపడాలి.నైతిక విలువలు పెంపొందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియాను కట్టడి చేయాలి. మన దేశంలో 46 కోట్లమందికి పైగా సోషల్ మీడియా వినియోగదారులు ఉండటం ఆశ్చర్యకరం. చిన్నపిల్లలు ఉపయోగించకుండా చట్టాలు చేయాలి.అమానుషంగా ప్రవర్తించిన వారిని నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠినంగా శిక్షించాలి. మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలను ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు అందకుండా చూడాలి. మానవత్వం పరిమళించే విధంగా విద్యార్థులలో ప్రజలలో అవగాహన తీసుకురావాలి. బలమైన చట్టాలు అమలు చేయాలి. పాఠశాల స్థాయిలోనే నైతిక విద్య, సామాజిక విలువలు, సహనశీలత గౌరవం వంటి అంశాలను బలంగా నేర్పించాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలు కల్పించాలి. వృత్తి శిక్షణలలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. మహిళలకు, చిన్నారులకు భద్రతా చర్యలు చేపట్టాలి. ఈ చర్యలు ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే కాకుండా ప్రతిపౌరుడు బాధ్యత తీసుకోవాలి. న్యాయం వేగవంతం కావాలి,నేరస్తులు శిక్షను పొందాలి. నేరం లేని సమాజం అందరి లక్ష్యం కావాలి. అప్పుడే సమాజం సస్యశ్యామలంగా అలారాడుతుంది. ●

# రైతులను కంటతడి పెట్టిస్తున్న ఉల్లి

ఎస్.కిష్టయ్య

ఉల్లిపాయ భారతీయ వంటలలో విడదీయలేని భాగం మాత్రమే కాదు, దేశ వ్యవసాయ వ్యవస్థలోనూ ఒక కీలకమైన ఆర్థిక పంట. దీని శక్తి మన వంటకాల్లో గులాబీ సుగంధంలా వినిపించినా, దీని వెనుక రైతుల చెమట, కష్టం, ఆశలూ అంతే తీవ్రంగా దాగిఉన్నాయి. ఈ విలువైన పంటను సమాజం గౌరవించేందుకు, రైతుకష్టాన్ని గుర్తించేందుకు, ఉల్లిపాయ మార్కెట్ సమస్యలపై చైతన్యాన్ని పెంచేందుకు జూన్ 27వ తేదీని జాతీయ ఉల్లిదినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ దినోత్సవానికి అధికారిక కేంద్ర ప్రకటన లేకపోయినప్పటికీ, వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖలు, రైతు సంఘాలు ఈ దినాన్ని ప్రజల అవగాహన కోసం జరుపుకుంటున్నాయి. భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఉల్లి ఉత్పత్తిదారుగా నిలుస్తోంది. 2024-25 గణాంకాల ప్రకారం, దేశంలో సుమారు 25 నుండి 28 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉల్లిపాయఉత్పత్తి జరుగుతోంది. ఇది ప్రపంచ ఉల్లిఉత్పత్తిలో సుమారు 22 శాతం. దేశవ్యాప్తంగా 1.3మిలియన్ హెక్టార్లలో ఉల్లిసాగు సాగుతోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు ఈ పంటలో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రత్యేకించి మహారాష్ట్ర ఒంటరిగా దేశ ఉత్పత్తిలో 38 శాతానికి పైగా వాటా కలిగిఉంది. ఉల్లి ఎగుమతులద్వారా దేశం వార్షికంగా 3,000 కోట్ల రూపాయల వరకు విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. ఉల్లిపాయలు ఆరోగ్య పరంగా కూడా అమూల్యమైనవి. వీటిలో విటమిన్ సి, బీ6, పొటాషియం, ఫ్లావనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. జీర్ణ క్రియకు సహాయ పడటమే కాకుండా, క్యాన్సర్ కారకకణాల వ్యాప్తిని నిరోధించే శక్తికూడా కలిగి ఉంటాయని శాస్త్రీయంగా గుర్తించబడింది. ఈ పంట రైతుకు లాభం తీసుకురావాల్సింది. కానీ విపరీతంగా మారుతున్న మార్కెట్ ధోరణులు, నిల్వ సౌకర్యాల కొరత, రవాణా సమస్యలు, మధ్యవర్తుల నియంత్రణ లేక



పోవడం వలన రైతునష్టాల పాలవుతున్నారు. కొన్నిసార్లు కిలో ఉల్లిధర రూ.100 దాటినా, మరికొన్ని సందర్భాల్లో రూ.5కే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రైతులు ఎకరానికి రూ.6,000 నుండి రూ. 8,000 వరకు ఖర్చు పెట్టినా, మార్కెట్లో తమ ఉత్పత్తికి న్యాయమైన ధర పొందలేకపోతున్నారు. పంట నిల్వలు చేయలేని పరిస్థితుల వలన భారీగా నష్టం ఎదురవుతోంది. భారత దేశంలో ఉల్లి నిల్వ సామర్థ్యం సుమారు 35శాతానికి పరిమితమై ఉంది.మిగతా ఉత్పత్తి నిల్వల అజాగ్రత్త వల్ల పాడైపోతూ, మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోవటానికి దారితీస్తోంది. ఇది రైతుకు పెద్ద నష్టంగా మారుతోంది. ప్రభుత్వాలు ధరల నియంత్రణ కోసం ఎగుమతులపై ఆంక్షలు విధించినా, అదే సమయంలో దిగుబడి సమయంలో రైతుకు మద్దతుగా నిలబడడంలో వెనుకడుగు వేస్తున్నాయి. కనిష్ఠ మద్దతు ధర అమలులో ఉన్న అసమర్థత, గిడ్డంగుల కొరత, భద్రతాగనులలో క్రమం తప్పిన నిబంధనలు రైతు నిస్పృహకు మూలంగా మారాయి. ప్రజల పాత్ర కూడా ఇక్కడ కీలకం. మనం నిత్యం వినియోగించే ఉల్లిపాయలు ఎక్కడి నుంచి వస్తున్నాయో, రైతు పరిస్థితి ఏంటి అన్నదానిపై అవగాహన పెరగాలి. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా రైతు బజార్ల ద్వారా కొనుగోలు చేయడం రైతుకు ఉపయోగ పడుతుంది. పౌరులుగా సామాజిక చైతన్యాన్ని పెంచేలా వ్యవహరించాలి. ఉల్లిధరల విషయంలో కొంత ఆత్మ నియంత్రణ పాటిస్తూ, రైతుదుస్థితిపై ప్రశ్నలు వేయగల సామర్థ్యం మనలో ఉండాలి. నూతన సాగు సాంకేతికతలపై శిక్షణశిబిరాలు, రైతుల సన్మానాలు, ఆరోగ్యావగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో పోషకాహారంపై ఉపన్యాసాలు, వంటల పోటీలు వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఈ దినానికి ప్రాముఖ్యత ఇవ్వవచ్చు. ఇది కేవలం ఉల్లిపాయను గుర్తించే దినం కాదు ఇది వ్యవసాయ విధానాలపై పునరాలోచన చేసే అవకాశం. రైతు కన్నీటిని తుడిచే మార్గం. ఈ దేశ భవిష్యత్తు రైతుపైనే ఆధారపడి ఉంది. రైతు కన్నీటిలో మానవతా పరిమళం ఉంది. మనం నిత్యం తినే ఒక్క ఉల్లిపాయ వెనకున్న జీవనయానం తెలుసుకొని, రైతుల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలి. రైతు శ్రమకు మనం తగిన గుర్తింపు ఇవ్వగలిగితేనే ఈ దినోత్సవానికి సార్థకత ఉంటుంది. ఇది కేవలం ఒక ఆహార పదార్థం పట్ల కాదు - ఒక జీవన వేదన పట్ల ఉదాత్తమైన భావోద్వేగం. ●

# ప్రైవేటు విద్య అంతా మిథ్యేనా?

డాక్టర్ మోటె చిరంజీవి

నేటి బాలలే రేపటి పౌరులు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది పాఠశాలలే. కానీ అలాంటి పాఠశాలలే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యతును నాశనం చేస్తున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు బడులు విద్యార్థుల చదువును సంతలో సరుకుగా మార్చేశాయి.స్కూల్‌లు ప్రారంభం అయ్యాయి. దోపిడీమొదలైంది. అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లని, బుక్స్‌కు సపరేట్ అని, యూనిఫామ్‌కు సపరేట్ అని, ఐఐటి ఫౌండేషన్ అయితే సపరేట్, బస్సుఫీజు సపరేటు అని ఇలా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠశాల యాజమాన్యాలు.తమ విద్యార్థులను ఉన్నతమైన, నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజులో పడి ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెర తీశారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దీంతో స్కూలు, హాస్టల్ పేరుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.50వేలవరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ.60 వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు తాము తక్కువ కాదంటూ కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఇదే సంప్రదాయానికి దిగాయి. సాధారణ చదువులతో ఐఐటీ ఫౌండేషన్ అంటూ మరికొంతనొక్కుతున్నాయి. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి,వెనక్కి వెళ్ళలేక చేర్పించే సాహసం చేయలేక తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. నేడు విచ్చలవిడిదిగా ఫీజులు వసూలు చేస్తూ, దోపిడీ చేస్తూ అక్షరాలను వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్, సెమీ కార్పొరేట్ తరహా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాల దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయింది. వీటిని నిరోధించాల్సిన అవసరం విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా నిబంధనలు పాతరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు చైతన్యమై ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిబంధనలు కనుక చూసినట్లయితే సెక్షన్ 6 ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి.సెక్షన్ 11 ప్రైవేటు యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజు కంటే ఎక్కువ వసూలు చేయకూడదు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 1,2 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత,వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీస్



బోర్డ్‌లో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ 12 ప్రకారం టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20కి మించరాదు.విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతిప్రైవేటు యాజమాన్యం 25శాతం సీట్లను ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్‌బుక్స్, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, ఇతర స్టేషనరీని అమ్మరాదు. ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా సూచించరాదు. డి.ఎడ్ లేదా బి.ఈడీ అర్హత ఉండాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు డీఎడ్‌లేదా బీఈడీ అర్హత ఉండి టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్‌లైన్ లో ఉంచాలి. జీవో నెంబర్ 42 ప్రకారం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయరాదు. ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల్లో 1000 చదరపు మీటర్లు. గ్రామీణ ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. పాఠశాల పక్కా భవనంలో నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో సలహాలు, సూచనలకు ఫిర్యాదు బాక్సులు ఉండాలి. ఫీజు స్లిప్పులను చిన్నారుల చేతికి రాసిఇస్తే జరిమానా ఉంటుంది. అభం, శుభం తెలియని చిన్నారుల చేతికి స్కూల్ ఫీజుల రసీదులు ఇస్తున్నారు పాఠశాల యాజమాన్యం. మీ అమ్మ నాన్నఇంకా ఫీజు చెల్లించలేదంటూ వారిని కించపరుస్తున్నారు. గతంలో చిన్నారి చేతికి రసీదు ఇచ్చిన ఓ ప్రైవేట్ స్కూలుకు చెందిన యాజమాన్యానికి భారీ ఎత్తున జరిమానా విధించింది విద్యాశాఖ. అనుమతులు లేకుండా స్కూళ్లను ప్రారంభించకూడదు. ప్రభుత్వ అనుమతితోనే ప్రారంభించాలి. ఆరు నెలల్లోపు అనుమతులు పొందాలి. ప్రభుత్వ సూచనల ప్రకారం ఫీజులు తీసుకోవాలి. 20 మంది చిన్నారులకు ఒక ఉపాధ్యాయుడు, ఒక సంరక్షకుడు ఉండాలి. రక్షణ భద్రతా పారిశుద్ధం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. భవనానికి ప్రహరీ ఉండి, గాలి వెలుతురు బాగా వచ్చేలా ఉండాలి.చిన్నారులు నిద్రపోవడానికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండాలి. సిసిటీవీలను అందుబాటులో ఉంచాలి. అగ్నిమాపక దళ అధికారుల నుంచి ధ్రువీకరణపత్రం పొందాలి. ప్లే స్కూలు రోజుకు మూడు నుంచి నాలుగు గంటల్లోపు మాత్రమేనిర్వహించాలి. పిల్లలకు సంబంధిం చిన ఆట వస్తువుతోనే బోధనఉండాలి. పిల్లలకు గాయాలై నట్లయితే ప్రథమ చికిత్స కిట్టు,చిన్న పిల్లలకు అవసరమైన టువంటి మందులు అందుబాటులో ఉండాలి.వైద్య నిపుణు లతో ప్రతి మూడు నెలలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహించా లి. ప్రవేశపత్రము,హాజరు, ఆరోగ్య రికార్డులు, స్టాకుఫీజు, వగైరా రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలి. ప్లే స్కూల్‌కు తప్పనిసరిగా ప్లేస్కూల్ అని బోర్డు పెట్టాలి. ప్రవేశాలు పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల కమిటీని నెలలోపు నియమించాలి. ఇందులో 50శాతంతల్లులు, 25శాతం ఉపాధ్యాయులు, 25శాతం తండ్రులు ఉండేలా చూడాలి. ఈ కమిటీని ఏటా మారుస్తుండాలి.ఫీజులు ఇష్టం వచ్చినట్లు పెంచుతున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. దీనికికూడా ఒక ప్రత్యేక కమిటీని నియమించి, రాష్ట్ర ప్రభుత్వం పలానా తరగతికి ఫలానా అమౌంట్ తీసుకోవాలని సూచించాలి. దానిప్రకారమే ప్రైవేటు పాఠశాలలు ఫీజులు తీసుకోవాలి.అలా చేసినట్లయితే ప్రైవేటు పాఠశాల నుండి కొంత ఉపశమనం లభిస్తుందని పిల్లల తల్లిదండ్రులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ●

## షాపూర్‌జీ,పల్లోంజీ,ఎల్‌అండ్‌టీ,ఎన్‌సీసీ సంస్థలకు ఎల్‌ఓఏలను అందజేసిన సిఆర్డిఏ కమిషనర్

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్త:** ప్రజారాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా ఐకానిక్, బీవీదీ సెక్రటేరియట్ భవన నిర్మాణ సముదాయాలకు సంబంధించిన లెటర్ ఆఫ్ అవార్డు(లివీతి)లను కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్ గారు అందజేశారు. అమరావతిలోని బీవీదీ టవర్స్(1 2) జి+39 అంతస్తులు నిర్మాణ పనులకు సంబంధించి షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ వారికి, బీవీదీ టవర్స్(3 4) జి+39 అంతస్తులు నిర్మాణ పనులకు సంబంధించి ఎల్ అండ్ టీ సంస్థకు, బితిదీ టవర్ నిర్మాణ



పనులకు(జి+49 అంతస్తులు) సంబంధించివిదిది సంస్థ వారికి లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్‌ఓఏ)ను కమిషనర్ గారు విజయవాడలోని సిఆర్డిఏ ప్రధాన కార్యాలయంలో అందజేశారు. ఎల్‌ఓఏ అందుకున్న సదరు సంస్థ వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అనుసరిస్తూ నిర్మాణ కార్యకలాపాలు చేపట్టాలని, అదే విధంగా నిర్మాణ కార్యకలాపాల వద్ద కార్మికుల భద్రతకు సమగ్రంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గారితో పాటు ఈఎన్‌సి ఆర్.గోపాలకృష్ణ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ శిజురీ భాస్కర్, ఎస్‌ఈ పి. అంకమ్మ చౌదరి, డీఈఈ ఎం.హేమాంబరధర రెడ్డి, సిఆర్డిఏ అధికారులు పాల్గొన్నారు.




పామర్రు టౌన్ లో జరిగిన "డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతం" అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం 26 సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నుండి శ్రీ.రీ.శ్రీ.శి శ్రీబీ స్కూల్ వరకు ర్యాలీ లో పాల్గొన్న పామర్రు లీలిత వర్ల కుమార్ రాజా , జనసేనపార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, అధికారులు వారితోపాటు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

**పామర్రు,జూన్ 26, ప్రభాతవార్త**

## వృద్ధులకు దివ్యాంగులకు 26 నుండి 30వరకు నిత్యవసర సరుకుల డోర్ డెలివరి -తహశీల్దార్ కాలి లక్ష్మి

**ఎ కొండూరు, జూన్ 26, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ (జె.సి) ఇలక్కా ఆదేశాల మేరకు ఎ కొండూరు మండలంలోని 32 రేషన్ డిపోల ద్వారా వృద్ధులకు దివ్యాంగులకు ఈ నెల 26 నుండి 30వరకు రేషన్ డిపో డీలర్లు నిత్యవసర సరుకులు డోర్ డెలివరి చేస్తున్నట్లు ఎ కొండూరు మండల తహశీల్దార్ కాలి లక్ష్మి గురువారం ప్రభాతవార్తకు తెలిపారు. మండలంలో 1956 మంది వృద్ధులు దివ్యాంగులు ఉండగా గురువారం మధ్యాహ్నానికి 731మందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారని తహశీల్దార్ కాలి లక్ష్మి తెలిపారు. మండలంలోని మిగతా వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జులై 1 నుండి 15 వరకు డీలర్లు సరుకులు రేషన్ షాపుల వద్ద పంపిణీ చేస్తారని తహశీల్దార్ కాలి లక్ష్మి తెలిపారు.

## ఏపిలో రెండు ప్రాజెక్టుల టెండర్ గెలుచుకున్న ఎన్‌హెచ్‌పిసి

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త :** ఎసిఎంఈ సోలార్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రాజెక్టుల కోసం ఎన్‌హెచ్‌పిసి నిర్వహించిన స్వతంత్ర బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ టెండర్‌ను గెలుచుకుంది. ఈ మైలురాయితో ఎసిఎంఈ సోలార్ తన ప్రస్తుత సౌర గాలి ఎఫ్‌డిఆర్‌ఈ, హైబ్రిడ్ పునర్వి యోగ శక్తి ప్రాజెక్టులకు తోడు తొలిసారి స్వతంత్ర బిఈఎస్ఎస్ ప్రాజెక్టులను తన పోర్ట్‌ఫోలియోకి చేర్చుకుందని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ కశ్యప్ మాట్లాడుతూ ఏపిలో ఎన్‌హెచ్‌పిసి స్వతంత్ర బిఈఎస్ఎస్ ప్రాజెక్టును అభివృద్ధి చేసే అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు.

## కర్బలా అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం : అతా నిజాంబాబా

**అమరావతి, జూన్ 26, ప్రభాతవార్త :** ఇస్లాం హిజ్రీ క్యాలెండర్ ప్రకారం మొహరం నెలవంక గురువారం దర్శనమివ్వడంతో గుంటూరు ఇజల్లా వేమూరు నియోజకవర్గం వేమూరు మండలం జంపనిలోని ఎఎబిఎస్‌టిఎ దర్బార్ ఫౌండర్ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామిషాతాజ్ ఖాదరీ (అతా నిజాంబాబా) ముస్లీం సమాజానికి యావత్ భారత జాతికి మొహరం హిజరి 1447 ఈ పవిత్ర నెల ప్రారంబం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతా నిజాంబాబా మాట్లాడుతూ ఈ పవిత్ర నెల సందర్భంగా మన హృదయాలు అల్లాహ్ సన్నిధిలో నమ్రతతో వుండాలని ప్రియ ప్రవక్త హజరత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహివ సల్లం పవిత్ర అహెలెబైత్ పైన దరూద్ పంపాలని వీరు ప్రార్థించారు. మొహరం షరీఫ్ అనేది కేవలం కాలచక్రం మారడం మాత్రమే కాదు. ఇది ఇరాక్‌లోని కర్బలా మైదానంలోని అమరులైన ప్రియ జగత్ ప్రవక్త మనుమలు హజరత్ హుస్సేన్ హుస్సేన్ అలైహిసలాంల ప్రాణత్యాగాన్ని అమరత్వాన్ని వారి త్యాగాలను సత్యం ధర్మం కోసం ఇస్లాం ధర్మ రక్షణ కోసం దుష్టుడైన యజీద్ శత్రు సైన్యంతో వీరోచితంగా పోరాడిన ధైర్యాన్ని దివ్య ప్రేమ అర్థాన్ని గుర్తుచేసే ఆత్మీయమైన స్మరణ సమయమని వీరు తెలిపారు. మన ప్రియ పీరో ముర్షిద్ హజరత్ సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా (ఖుదసిర్రుహు) తనవలయంలో ఉన్న ప్రతి ఆషిక్‌కు జిక్ర, మారిషత్, సబ్ వంటి దివ్య గుణాల వెలుగుతో ఆశీర్వదించుగాక ఈ ఇస్లాం కొత్త సంవత్సరం మీ ఇంట్లో శాంతి నిండాలని మీ హృదయాల్లో అల్లా ప్రేమ వెలుగొందాలని మీ జీవితదారులు ఔలియా అల్లా కిరణాలతో మార్గదర్శితమవ్వాలని దువా (వేడుకోలు) చేశారు. అతా నిజాంబాబా సజ్జాదా ఖాదరియా తరికా తరపున ముస్లీం సోదరులకు ముస్లీంమేతర సోదరులకు మొహరం ఇస్లాం మొదటి సంవత్సరం ప్రారంభ నెల శుభాకాంక్షలు తెలిపారు.

## గుండ్ల చెరువు అభివృద్ధికి విశేష కృషి : టిడి జనార్ధన్

**వత్సవాయి, జూన్ 26, ప్రభాతవార్త :** మండలంలోని లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గుండ్ల చెరువు అభివృద్ధికి విశేష కృషి చేయనున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరో సభ్యులు, టిడిపి కార్యదర్శి టిడి జనార్ధన్ తెలిపారు. గురువారం గుండ్ల చెరువును ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించిన అనంతరం తన చిన్ననాటి జ్ఞాపకాలు తలచుకుంటూ చెరువు పటిష్టత అభివృద్ధి కొరకు పలు సూచనలు చేస్తూ చెరువు అభివృద్ధి చేస్తే ఆయకట్టు పెరుగుతుందని నీటి నిల్వ కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిఈ శ్రీనివాసరావు ఈఈ గంగయ్య, డిఈ రఘు, జెఈ రామ నరసింహారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు తొండపు జగన్‌మోహన్ రావు, వివిధ గ్రామాల తెదేపా నాయకులు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.




VAARTHA CLASSIFIEDS

FOR SALE

★ విజయవాడ, కానూరు 150 గజాలు నాన్ లేఅవుట్, 18ft road facing, తూర్పు 32000/- owner + 918978282072 whatsap / local 9866623879

(Ro.No.11916)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


# విజయవాడ వార్త

## నేడు జిందాల్‌లో పర్యటించనున్న సీఎం



**యడ్లపాడు, జూన్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండవీడు రెవిన్యూ పరిధి కొత్తపాలెం గ్రామ పరిధిలోని జిందాల్ వెస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంటును రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్న సందర్భంగా గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్లాంటులో పరిశీలించే ప్రాంతాలను, హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి చర్చించారు. శుక్రవారం సాయంత్ర సమయంలో సీఎం పర్యటన ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు

**విజయవాడ క్రైం,జూన్ 26,ప్రభాతవార్త:** ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని దాని ప్రకారం డ్రగ్స్ నివారణకు ఫిట్ ఎన్‌డిపిఎస్ యాక్ట్ అనే ఒక ప్రివెంటివ్ టిటెక్షన్ యాక్ట్ ప్రకారం కేసులు పెడితే సంవత్సరం వరకు ఎటువంటి విచారణ లేకుండా జైలులో పెట్టడం జరుగుతుందని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును ఎన్టీఆర్ జిల్లా పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 3వేల మంది వివిధ శాఖల సిబ్బంది,కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో స్టేడియం నుండి డివి మేనర్ హోటల్ వరకు మెగా వాక్‌థాన్‌ను నిర్వహించారు. డిజిపి హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా సిపి రాజశేఖరబాబు అధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు 'డ్రగ్స్‌కు బానిస కావద్దు,నీ తల్లి కన్నీటికి కారణం కావద్దు,డ్రగ్స్‌ను తరిమికొడదాం-యువతను కాపాడుదాం' అనే నినాదంతో డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్,డ్రగ్స్ రహిత ఎన్టీఆర్ జిల్లా సాధన దిశగా మనం వేస్తున్న తొలి అడుగన్నారు. గత సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపి ముందుకు వెళ్ళామన్నారు. కొన్ని వందల అరెస్టులు జరుగుతున్నాయన్నారు. కొన్ని వేల కిలోల గంజాయి సీజ్ చేసినా కూడా ఇంకా ఆ ట్రేస్ ఉన్నాయని, ట్రేసెస్‌ని ఖచ్చితంగా మొత్తం తీసివేయాలనే లక్ష్యంతో పోలీసు శాఖ గట్టిగా కృషి చేస్తోందన్నారు.ప్రివెంటివ్ డిటెక్షన్ యాక్ట్ మీద కేసులు పెట్టమని ప్రభుత్వం ఆదేశించిందని, ఆ విధంగా కేసులు పెడితే




సంత్సరం వరకు ఎటువంటి విచారణ లేకుండా జైలులో పెట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 11 మంది మీద ఈ చట్టం పెట్టి ప్రభుత్వానికి పంపించామన్నారు. అందులో ఐదుగురిపై ఇది అమలవుతోందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం,రవాణా అనేది ఎటువంటి పరిస్థితులలోను సహించేదని, దాన్ని స్పష్టంగా సమాజానికి తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నామని,దయచేసి విద్యార్థులు ఊడ ఇటువంటి గంజాయి పోకడలకు వెళ్ళకూడదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గంజాయి కేసులో ఒక వ్యక్తిని పట్టుకుని విచారిస్తే దాదాపు 125 మంది విద్యార్థులు గంజాయి సేవిస్తున్నట్లు బయటకు వచ్చిందని,వారి పేర్లు కూడ బయటకు రావడంతో దీనిపై జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖాధికారి, విద్యాశాఖ,పోలీసు శాఖ,ఎక్సైజ్ శాఖలందరూ కలిసికట్టుగా ఒక బృహత్తర కార్యక్రమంతో ఈ రోజు ముందుకు వెళ్తున్నామని,ఇది ఇంతటితో ఆగదని,చివరి కేజీ గంజా సీజ్ చేసే వరకు గంజాయిని సమూలంగా తొలగించే వరకు నిద్రపోవాల్సిన అర్హత మనకు లేదనే విషయం గుర్తు పెట్టుకొని ముందుకు వెళ్ళాలన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టం గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు డ్రగ్స్ రహిత సమాజాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని,వారు తమ భాధ్యతగా కుటుంబంలో ఎవరికైన అటువంటి అలవాటు ఉంటే దాన్ని కంట్రోల్ చేసుకోవాల్సిన భాధ్యత ఉందని,దీన్ని మనస్పూర్తిగా అవగాహన చేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడమే కాకుండా నిత్యం మనం మనసులో పెట్టుకోవాలన్నారు. అవకాశం మేరకు దీనిని అవగాహనపర్చడానికి ప్రయత్నం చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీషా మాట్లాడుతూ అవేర్నెస్ పెంచితే డ్రగ్స్ బారి నుండి దూరంగా మన పిల్లలను సమాజాన్ని ఉంచగలుగుతామన్నారు.స్కూళ్లో,కళాశాలల్లో, మీ ఇంటి పక్కన,చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నారంటే వాళ్ళకు సంబంధించిన సమాచారం మీ దగ్గరలో ఉన్న పోలీసు శాఖకు గాని, సచివాలయంలో ఉన్న డిపార్ట్‌మెంట్ అధికారులకు కాని తెలియచేయమన్నారు. వాళ్ళను డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ల ద్వారా వారికి ఈ అలవాటును మానుకునేలా నేర్పించడం జరుగుతుందన్నారు. డిసిపి కెజివి సరిత మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ జీరో టోలరెన్స్ డ్రగ్ అనే నినాదం వంద శాతం చేసేంత వరకు ఆంధ్రప్రదేశ్ పోలీసు నిద్రపోదన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నుండి విముక్తి చేయడానికి కృషి చేస్తానని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిసిపి ఎబిటిఎస్ ఉదయరాణి,కృష్ణమూర్తినాయుడు,ఏడిసిపిలు జి.రామకృష్ణ,ఎవిఎల్ ప్రసన్నకుమార్,సబ్ కలెక్టర్ కావూరి చైతన్య,ఈగల్ టీం సభ్యులు,అన్ని శాఖల అధికారులు,సిబ్బంది,వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్ కోసం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలి : అక్కౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి

**విజయవాడ కార్పొరేషన్,జూన్ 26,ప్రభాతవార్త:** యువత భవిష్యత్ కోసం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం వద్ద ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాంటీ డ్రగ్స్ అండ్ ఎలిసెట్ ట్రాఫికింగ్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషా ఆదేశాల మేరకు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విఎంసి సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల




ద్వారా డ్రగ్స్ అవగాహన పెరుగుతుందని, డ్రగ్స్ ప్రభావం నుంచి సమాజాన్ని రక్షించేందుకు ప్రతి పౌరుడు భాధ్యతగా వ్యవహరించాలని, ఇటువంటి కార్యక్రమాలను స్థిరంగా నిర్వహించడం ద్వారా సమాజంలో చైతన్యం పెరిగి,డ్రగ్స్ వాడకంపై నియంత్రణ సాధ్యమవుతుదన్నారు. కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి,విఎంసి వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.


## తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు హసీం బేగ్‌కు ఉత్తమ కార్యకర్త అవార్డు

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్త:** ముఖ్య నాయకులు,కార్యకర్తలతో టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి పార్టీ సభ్యత్వాల్లో తనకంటూ రాష్ట్ర స్థాయిలో ఓ బలమైన ముద్ర వేసిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్‌కు 'ఉత్తమ కార్యకర్త' అవార్డును నారా లోకేష్ తన చేతుల మీదుగా అందించారు. బందరులో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్,ఎపి జోనల్-3 కో-ఆర్డినేటర్, మాజీ ఎంఎల్‌సీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.




## రేవేంద్రపాడు విద్యార్థినికి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేత

**గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థినికి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రేవేంద్రపాడు ఎంపీటీసీ కొప్పుల మధుబాబు రూ.91,413 ఆర్థికసాయం అందించారు. దుగ్గిరాల



మండలం రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్ లో చదివిన గంపా ఉమామహేశ్వరి అనే విద్యార్థిని మొన్నటి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 575 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచారు. దీంతో మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనిబరిచిన వారికి మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి లోకేష్ సాధించిన మెజార్టీతో నగదు బహుమతి అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రూ.91,413 చెక్కును సదరు విద్యార్థినికి అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన తనకు అండగా నిలవడం పట్ల మంత్రి లోకేష్, టీడీపీ నేత మధుబాబుకు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 2025 బెస్పోక్ ఏఐ ఉపకరణాల శ్రేణి

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తమ 2025 బైస్పోక్ ఏఐ ఉపకరణాల శ్రేణిని పరిచయం చేసింది. ఏఐతో జీవితాలను సుసంపన్నం చేయడానికి సరళీకరించడానికి ఈజి కేర్ సేవ్ సెక్యూర్ అనే నాలుగు విభిన్న వినియోగదారు ప్రయోజనాలపై నిర్మించబడింది.

## నూతన విధానాలతో విస్తృత ఈకామర్స్‌సేవలు

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త :** భారతదేశపు స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ విక్రేతలు మరియు కస్టమర్‌ల కోసం వృద్ధి ఆధారిత వేదికను పెంపొందించడం కొనసాగిస్తోందని ఫిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ విభాగ సీనియర్ డైరెక్టర్ కపిల్ తీరాని తెలిపారు. ఆన్‌లైన్ వ్యాపారాన్ని మరింత అనుకూలమైన, పారదర్శక మరియు బహుమతిగా చేయడానికి రూపొందించబడ్డాయన్నారు.

## జీ తెలుగులో తండేల్

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త :** వారం వారం సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగులో 29న సాయంత్రం 6గంటలకు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోంది. జూన్ 24 నుండి 28వరకు జీతెలుగు రేడియో సిటీలో నిర్వహించే తండేలు సినిమా క్విజ్‌లో అడిగే ప్రశ్నలకు 9586060601 నెంబర్‌కు సమాధానాలు వాట్సప్ ద్వారా పంపితే కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతలను జూన్ 29 సాయంత్రం 6 గంటల నుండి తండేల్ సినిమా ప్రసారమయ్యే సమయంలో ప్రకటిస్తారు.

## త్రీఇన్‌వన్ అడ్వాంటేజ్‌తో ఎఎంసి స్మాల్‌క్యాప్ ఫండ్

**విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త :** క్వాలిటీ గ్రోత్ విలువను అందించే స్మాల్ క్యాప్ షేర్లలో ప్రధానంగా ఇన్‌వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ బజాజ్ ఫిన్సర్వ్ స్మాల్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి ప్రకటించింది. 27న ప్రారంభమయ్యే సబ్‌స్క్రిప్షన్ జులై 11న ముగుస్తుంది. 52వారాల గరిష్టానికి 15-45 శాతం దిగువన ట్రేడవుతున్నాయి.

## శుభ్రమైన ఇళ్ల మక్కువ

విజయవాడ, జూన్ 26, ప్రభాతవార్త : భారతదేశానికి శుభ్రమైన ఇళ్ల పట్ల ఉన్న మక్కువను వెల్లడించిన డైసన్ అధ్యయనంలో వెట్ క్లీనింగ్ అలవాట్లు ప్రవర్తనలు ప్రజలు వెట్ క్లీనింగ్ పరికరాలతో ఎదుర్కొంటున్న చిరాకులతో పాటు మనం ఆశించే పరిశుభ్రమైన ఇళ్లను అందించేలా డైసన్ తన మొదటి గ్లోబల్ వెట్ క్లీనింగ్ స్టడీ ఫలితాలను ప్రకటించింది. భారతీయ గృహాలు తరచూ శుభ్రం చేస్తున్నప్పటికి వినియోగిస్తున్న పరికరాలు, అలవాట్లు ఇళ్లను శుభ్రంగా కాకుండా తక్కువ పరిశుభ్రంగా మారుస్తున్నాయని గ్లోబల్ అధ్యయనం తేటతెల్లం చేసింది.

## సజావుగా తిరువూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

**తిరువూరు, జూన్ 26, ప్రభాతవార్త :** తిరువూరులో మున్సిపల్ చైర్‌పర్సన్



కె.నిర్మల అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాలకపక్ష ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్ కె.మనోజా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.









## మాదక ద్రవ్యాలను సమాజంలో పూర్తిగా నిర్మూలించినప్పుడే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**బాపట్ల, జూన్26,ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను సమాజంలో పూర్తిగా నిర్మూలించినప్పుడే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్




తెలిపారు. గురువారం పట్టణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు, వివిధ శాఖల సమన్వయంతో బాపట్ల పట్టణంలో చేపట్టిన భారీ ర్యాలీని పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాలను వినియోగించరాదంటూ ర్యాలీలో పాల్గొన్న యువత ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినదించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం కూడలిలో మానవహారం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, వాడకం, విక్రయం రవాణా చేయడం నేరమన్నారు. కొంతమంది వ్యక్తులు చిన్నారులు, యువతలో లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నారన్నారు. సంఘ విద్రోహశక్తులు అక్రమార్జన కోసం పిల్లలకు బలవంతంగా అలవాటు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దుశ్చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యం మేరకు మాదకద్రవ్యాలకు బాపట్ల జిల్లా చోటు ఇవ్వరాదన్నారు. ఇందుకోసం ప్రజలను విస్తృతంగా చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. బాపట్లను నషా ముక్త్ జిల్లాగా నిలపడానికి అందరూ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలు తయారీ, వినియోగం, రవాణా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. మంచి సమాజ నిర్మాణం కొరకు విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే చెడును విడిచి పెట్టడం, మంచి విషయాలపై పిల్లలకు మార్గ నిర్దేశం చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో అందరిని సమీకరించుకుని పెద్ద ఎత్తున ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాపట్ల పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఐదు వేల మందికి పైగా విద్యార్థులు, యువత, ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకం అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో 80 మేర గంజాయి కేసులు తగ్గాయన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లాలో ఈగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బుడా ఛైర్మన్ సలగల రాజశేఖర బాబు, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# హామీ మేరకు అందరికీ బాండ్లు ఇస్తాం

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గత ఐదేళ్ళ పాలనలో రాష్ట్రంలో, ప్రత్యేకించి పొన్నూరులో విధ్వంసకరమైన పాలన జరిగిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జీబిసి రోడ్డు విస్తరణలో ఇళ్ళు, స్థలాలు

**-గత ఐదేళ్ళల్లో రాష్ట్రంలో విధ్వంస పాలన సాగింది**
**-జీబిసి రోడ్డు విస్తరణలో గత ప్రభుత్వ తీరును మర్చిపోలేం**
**-బాధితుల కన్నీళ్ళు నన్ను కదిలించి వేశాయి**
**-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్**

కోల్పోయిన నిర్వాసితులకు గురువారం టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ జీవిసి రోడ్డు విస్తరణ సందర్భంగా వైకాపా ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వందలాది మంది పోలీసులను రప్పించి వారి కనుసన్నల్లో, బాధితులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. బాధితులు తమ గోడును చెప్పుకును అవకాశాన్ని గత ప్రభుత్వం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పోలీసులు, అధికారులు అత్యంత కర్కశంగా బాధితుల పట్ల వ్యవహరించారన్నారు. బాధితుల కన్నీళ్ళు, వారి ఆర్తనాదాలు తనను మరింత కదిలించాయన్నారు. బాధితుల పక్షాన టిడిపి పోరాటం చేసిందన్నారు. విధ్వంస పాలనకు వ్యతిరేకంగా నిరసనలు, వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని గత ఎన్నికల సమయంలో చెప్పామని, ఇచ్చిన హామీ మేరకు అందరికీ బాండ్లు ఇస్తామన్నారు. ఐదేళ్ళు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి వ్యవహరిస్తున్న తీరు సరిగ్గాలేదన్నారు. జగన్మోహనరెడ్డి అధికారంలో వున్నప్పుడు చేసిన విధ్వంసాన్ని ప్రతిపక్షంలో ఉండి కూడా అదే విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారన్నారు. జగన్మోహనరెడ్డి పర్యటనలకు ఎక్కడికి వెళ్ళినా తన అనుచరులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేవిధంగా అరాచకంగా మాట్లాడేవిధంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే బెట్టింగులకు పాల్పడి ఆత్మహత్య చేసుకొన్న వైకాపా నాయకుని మరణాన్ని ప్రభుత్వ హత్యగా చిత్రీకరించడం దారుణమన్నారు. విచక్షణ కోల్పోయిన జగన్ తప్పు కప్పిపుచ్చుకునేందుకు ఎదురు దాడికి దిగుతున్నారన్నారు. తన కారు కింద పడి వ్యక్తి మృతి చెందినా కనీసం పట్టించుకోకపోవడాన్ని బట్టి జగన్‌కు మానత్వం ఉందా..? అనే అనుమానం కలుగుతుందన్నారు. అరాచక మనస్తత్వం ఉన్న జగన్ వంటి వారిని సమాజం నుంచి బహిష్కరించాలన్నారు. మేనిపెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలోనే కొన్ని పథకాలను అమలు



చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఇచ్చిన ఐదేళ్ళ అధికారంలో అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. పెన్షన్లు, మహిళలకు ఉచిత గ్యాస్, తల్లికి వందనం, డిఎస్సీ పరీక్షల నిర్వహణ, నల్లచట్టాల రద్దు వంటి కార్యక్రమాలను చేయడం జరిగిందన్నారు. ఈ నెలలోనే రైతు భరోసా, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేరుస్తామన్నారు. సంక్షేమం-అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ళు, రెండింటిని దృష్టిలో పెట్టుకొని ప్రజల కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విష ప్రచారం చేస్తూ అరాచకం సృష్టిస్తే ప్రజలు తమ వైపు ఉంటారనే భ్రమలో జగన్ ఉన్నాడన్నారు. ప్రజలు అధికారాన్ని తుంగలో తొక్కి 11సీట్లకు పరిమితం చేసినా జగన్‌లో అహంకారం తగ్గలేదన్నారు. 55మంది నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, జనసేన పార్టీ నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, ఆకుల సాంబశివరావు, షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండలో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, జూన్ 26 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో గురువారం సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులతో పాటు వివిధశాఖల అధికారులకు



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జూలై 6వతేదీన తొలి ఏకాదశి సందర్భంగా వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై కోటప్పకొండపై చేయాలన్నారు. ప్రతి ఏడాది ఏకాదశి పర్వదినాన జిల్లాలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరస్వామివారిని దర్శించుకోడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. భక్తులకు అవసరమైన మంచినీరు, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడటం, ప్రశాంతత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయడం, భక్తులకు సంబంధించి భద్రత, తదితర ఏర్పాట్లను చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అధికారులకు తెలియజేశారు.



**అటవీశాఖ అధికారితో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ భేటీ...**

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణప్రియను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అటవీశాఖకు సంబంధించిన వివిధ పనుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా కోటప్పకొండలో ఘాట్‌రోడ్డుకు సంబంధించి, గిరి ప్రదక్షిణ మార్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో బి.టి.రోడ్డు అనుమతులు, నిధులపై మాట్లాడారు. కోటప్పకొండను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అటవీశాఖ నుండి తగిన సహకారాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా కోరారు.

## విశిష్ట పురస్కార్ అవార్డు అందుకున్న పోలీసురావు

**కర్లపాలెం, జూన్26, ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున చేసిన సేవలో భాగంగా విశిష్ట పురస్కార్ అవార్డును పొందినట్లు పోలీసు రావు తెలిపారు. గురువారం బాపట్ల కలెక్టర్ ఆఫీస్ లో జరిగిన రెడ్ క్రాస్ సేవా అవార్డ్స్ లో భాగంగా పోలీసు రావు కి అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా పోలీసు రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్




తరఫునుంచి మండలంలో మిగిలిన సభ్యులను కలుపుకొని సేవా రంగంలో ఇంకా ఉత్తమమైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ అవార్డును పొందుకున్నందుగాను ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేనరేంద్ర వర్మ రాజు, ఆర్డిఓ, డిఎంహెచ్ఓ, రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ నారాయణ బట్టు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ ఫ్రీ ఇండియాగా చేద్దాం

**-పారా లీగల్ వాలంటీర్లు**

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** భారతదేశాన్ని డ్రగ్ ఫ్రీ ఇండియాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పారా లీగల్ వాలంటీర్లు షేక్ ముజీర్, జి.రమేష్‌బాబు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్లు మాట్లాడుతూ



నేడు యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి అనేకమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ఇది సరైన విధానం కాదని, చట్టరీత్యా నేరమన్నారు. మార్పు అనేది విద్యార్థుల నుంచి రావాలన్నారు. విద్యార్థులైన యువత చైతన్యవంతులై సమాజాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. మత్తు మందులకు అలవాటుపడి నేడు యువత తమ జీవితాలను నాశనం చేసుకొంటున్నారన్నారు. డ్రగ్స్‌కు, గంజాయి, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాలంటీర్లు కోరారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలన,మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలి

**కర్లపాలెం, జూన్26, ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల నిర్మూలన, మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలని కర్లపాలెం తహశీల్దార్ సుందరమ్మ



అన్నారు. కర్లపాలెం బోర్డ్ స్కూల్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దురి శ్రీనివాసరావు, ఎం ఈ ఓ విజయశ్రీ ,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ,కార్యదర్శి సునీత, మహిళా కానిస్టేబుల్ సౌందర్య ,వెల్ఫేర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు

## రూ.13.81లక్షలు హుండీ ఆదాయం

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు రావాలని కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ కోరారు. స్థానిక శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జివి అమర్నాథ్ మాట్లాడుతూ



దేవాలయాల ప్రశాంతతకు, ఆధ్యాత్మిక చింతనకు నిలయాలన్నారు. అలాంటి దేవాలయాలను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు భక్తులు, దాతలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నప్పటికీ దాతలు వచ్చినప్పుడే పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.13,81,603ఆదాయం సమకూరిందన్నారు. గత సంవత్సరం జూన్ నెలతో పోలిస్తే రూ.6,00,749అధికంగా ఆదాయం సమకూరిందన్నారు. రానున్న కాలంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సహాయ సహకారాలు, సలహాలతో కృషి చేస్తామన్నారు. లెక్కింపు కార్యక్రమాన్ని బాపట్ల దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మందలపు గోపి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు పదార్ధాల వ్యతిరేక కార్యక్రమం

**నరసరావుపేట, జూన్ 26 ప్రభాతవార్త :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మత్తు పదార్ధాల నష్టాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా



హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న హాస్పటల్ వైద్యులు, సిబ్బంది, ఫార్మా విద్యార్థులను అభినందించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. డ్రగ్స్‌కు యువత బానిసలు కావద్దన్నారు. మత్తు పదార్ధాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## నియోజకవర్గ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా చుండూరు వీరయ్య

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాళ్ళపాలెం గ్రామానికి చెందిన చుండూరు వీరయ్యను వైకాపా నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్‌లో ఉత్సాహంగా పనిచేస్తున్న వీరయ్యను నియమించడం పట్ల కార్యకర్తలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. చుండూరు వీరయ్య తాళ్ళపాలెం సర్పంచిగా గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తుండడంతో వీరయ్య నియామకాని మార్గం సుగమం అయింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ వైకాపా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసే వరకు పార్టీని వార్డు, గ్రామ స్థాయిలో కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతను కర్తవ్యంగా నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పార్టీ పటిష్టతకు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



## మైనింగ్ ఫిర్యాదుపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఆర్డీవో

**యడ్లపాడు, జూన్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన వారు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు అధారంగా అర్‌డివో మధులత గురువారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. గ్రామానికి చెందిన జి శ్రీనివాసరావు, ఎస్ రవి, ఎమ్ రాజు తదితరులు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు తెలుపుతూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, అయితే గ్రామ సమీపంలోని సర్వేనెంబరు 240/10లో మైనింగ్ కొండ, క్వారీలు ఉన్నాయని, తద్వారా క్వారీలో మైనింగ్ మరియు లీజ్ అగ్రిమెంట్లు లేకుండా అమోనియా, యూరియా, ఎలక్ట్రికల్ డిటో నెటర్లలను ఎక్కువగా వినియోగించుతూ బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, వీటి కారణంగా గృహాలు బీటలు వారుతున్నాయని, దీని కారణంగా విపరీతంగా దుమ్ము వస్తుందని, దీనివల్ల చిన్న పిల్లలకు, పెద్దవయస్సు వారికి కొత్త వ్యాధులు వస్తున్నాయని, దుమ్ము



వల్ల పంటలు లేవని, బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు గృహాలపై పడుతున్నాయని, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం ఎక్కువగా ఉండటం త్రాగు నీరు కలుషితం అవ్వటం జరుగుతుందని, విచ్చల విడిగా అనుమతులు లేకుండా రాయి రవాణ చేస్తున్నారని, ఏమైనా అంటే పోలీసులను ఉసిగొల్పుతున్నారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. మట్టిని, రాయిని తీసి లోతైన గుంటలు పెడుతున్నారని, పశువులు, స్కూలుకు వెళ్ళే పిల్లలు పడి చనిపోతున్నారని, బాగా లోతు తీయటం వల్ల పొలాలకు నీరు అందటం లేదని, ఇందులో మొత్తం 17మంది నిర్వాహకులు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరటం మైందన్నారు. వీటన్నిటిపై క్షేత్రస్థాయిలో అర్‌డివో మధులత పరిశీలించారు. ఫిర్యాదు దారుల వద్ద నుండి వివరాలు అడిగి తెల్సుకున్నారు. మైనింగ్ వారు సరిఅయన సమాదానాలు ఇవ్వలేకపోవటం వారిని పూర్తిస్థాయిలో రికార్డులు తీసుకుని కార్యాలయానికి రావాలని అదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ టిఎ కళ్యాణి, మైనింగ్ సర్వేయర్ రవితేజ, తహశీల్దార్ విజయశ్రీ, ఎంపీడివో వి హేమలతాదేవి, సర్వేయర్ సురేంద్రనాద్, అర్ఐ సుబ్బారావు, పంచాయితీ కార్యదర్శి బాపిరాజు, విఅర్‌వో కోటి తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తపరచిన గ్రామస్తులు

**యడ్లపాడు, జూన్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వంకాయలపాడు పంచాయితీ పరిధిలో అధికంగా మైనింగ్ క్వారీలు ఉన్నాయి. అయితే ఇవి అన్నీ ఉప్పరపాలెం గ్రామ సమీపంలో ఉంటాయి. నిత్యం వీటి ముందుగానే వారు తమ గ్రామంకు వెళ్లవలసి ఉంటుంది. అయితే అనాదిగా ఇక్కడ క్వారీంగ్ జరుగుతుండేది. గతంలో అయితే కూలీల ద్వారా చిన్నపాటి మందుగుండు సామాగ్రిని ఉపయోగించి పనులు చేస్తుండేవారు. అయితే కాలక్రమేణా అది కాస్తా అధునాతన యంత్రాలు, మందు గుండు సామాగ్రిలను ఉపయోగించి కొండ రాళ్ళను బ్లాస్టింగ్ చేస్తుంటారు. గతంలో లేని ఇబ్బందులు గ్రామస్థులకు ఇప్పుడు వచ్చి పడ్డాయి. కూలీలు పనులు చేసినంత కాలం ఇబ్బందులు లేవు కానీ అధునాతన యంత్రాల కారణంగా



విపరీతంగా బ్లాస్టింగ్ చేయటం అప్పటి కప్పుడే యంత్రాల ద్వారా రవాణా చేయటంతో విపరీతమైన ధ్వని, వాయు కాలుష్యం ఉత్పన్నమతున్నాయి. వీటిపై అటు నిర్వాహకులు గాని, అధికారులు గాని పట్టించుకోవటం లేదని గ్రామస్థుల అందోళన. అయితే ఈ ప్రాంతములో మైనింగ్ అధికారుల అధికారిక లెక్కల ప్రకారం 37మంది క్వారీ యజమానులు ఉన్నారు. అయితే ఇందులో ప్రస్తుతం పనులు చేస్తుంది మాత్రం 7మంది క్వారీ యజమానులేనని వారు తెలుపుతున్నారు. అయితే గ్రామస్థులు మాత్రం ఇక్కడ ఉన్న ప్రతి క్వారీలో పనులు జరుగుతున్నాయని, మీరు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నిస్తున్నారు. దీని కారణంగా ఇటు ప్రభుత్వానికి వచ్చే రాబడి గండి పడుతున్నట్లేమరి. మైనింగ్ అధికారుల ఉదాసీన వైఖరితో ప్రభుత్వ అదాయం పడిపోవటం ఇటు గ్రామస్థుల ఇబ్బందులు అధికమవటం జరుగుతున్నాయని వారంటున్నారు. అధికారులు తీరు మార్చుకొని విధులు సక్రమంగా నిర్వహించి అనుమతులు పొందిన వారు మాత్రంమే అదీను గ్రామానికి, గ్రామస్థులకు ఇబ్బందులు కలుగకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మైనింగ్ అధికారుల విధానం ఏవిధంగా ఉంటుందో వేచి చూడవల్సి ఉంటుంది.

## ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**వినుకొండ, జూన్26, ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు హాజరయ్యారు. ఏపీ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ అసోసియేషన్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ న్యూఢిల్లీకి చెందిన వజ్రాల వెంకటనాగిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని



నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులుగా కొండపల్లి బ్రహ్మయ్య, గౌరవ అధ్యక్షులుగా కట్టమూరు శ్రీనివాసరావు, సెక్రటరీగా మాదాల శివ కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా బింగి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పశువులేటి ఏడుకొండలు, జాయింట్ సెక్రటరీగా సుగ్రీవ మల్లికార్జునరావులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు నూతన కార్యవర్గంను అభినందించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని చెప్పారు.

## వార్డుల్లోని కాలువల్లో పూడిక తీత పనులు

**వినుకొండ, జూన్26, ప్రభాతవార్త:** పురపాలక సంఘం పరిధిలో వివిధ వార్డుల్లో గల మేజర్ కాలువల్లో పూడిక తీత పనులు మున్సిపల్ సిబ్బంది గురువారం చేపట్టారు. మెయిన్ బజారు, నర్సరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డు, ఇసుకవాగు మెయిన్ డ్రైనేజీ నందు పూడిక తీత పనులు నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోసు పనులు పర్యవేక్షించారు. రాబోయే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయం



కాకుండా ఉండేందుకుగాను ఏపీ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆదేశాల మేరకు సిల్ట్ తొలగింపు పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యవసరాలు అందజేత

వినుకొండ, జూన్26, ప్రభాతవార్త: బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నిత యవసరాలు, ఆర్థిక సాయం అందజేత కార్యక్రమం గురువారం నిర్వహించారు. భాగవతుల రవికుమార్ అనురాధ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా 4 పేద బ్రాహ్మణ కుటుంబాలకు సహాయం అందించడం జరిగింది. అలాగే భాగవతుల జనార్ధనాచార్యులు బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం పెద్దలు మాట్లాడుతూ దాతల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత ముందుకు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో మంత్రిరాజు సత్యనారాయణ, గాలి శ్రీనివాసరావు, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, పి.వి సురేష్, గాలి రమణ తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలు అలవాటు చేసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

**పెదకూరపాడు, జూన్ 26 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనర్థాలు కలిగి జీవితం నాశనం అవుతుందని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చక్కగా విద్యను అభ్యసించి ప్రయోజకులు కావాలన్నారు. ఈ కార్య క్రమంలో కాకతీయ ఇంటర్మీడియట్ అండ్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు పిలుపు



**తెనాలి, జూన్ 26 (ప్రభాతవార్త) :** జులై 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం కె.రవికుమార్ అధ్యక్షతన జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, కార్మిక సంఘాలు మరియు స్వతంత్ర ఫెడరేషన్‌లు ఢిల్లీలో సమావేశంలో జులై 9దేశ వ్యాప్తంగా హక్కుల పరిరక్షణ కోసం సమ్మెకు పిలుపునిచ్చారని, ప్రతి యూనియన్ సభ్యుడు ఆరోజు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ రోజున జరిగే కార్మిక ప్రదర్శనలో ప్రతి కార్మికుడు తన కుటుంబ సభ్యులతో కలసి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఆ రోజు యే ఫ్యాక్టరీ సైరన్ మోత వినిపించకూడదని చెప్పారు. చిమ్నీలో నుండి పొగ రాకూడదని చెప్పారు. ఏక్కడ యంత్రాలు, వాహనాలు అక్కడే నిలిచిపోవడం జరగాలని చెప్పారు. కార్మికశక్తి పాలకులకు అర్థమయ్యేలాగా మన పోరాటం ఉండాలని చెప్పారు. ప్రతి యూనియన్ కార్యవర్గ సమావేశం మరియు జనరల్ బాడీ సమావేశంలు జరపాలని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని కోరారు. కార్మికులకు కనీస హక్కులు యాజమానులదయాదాక్షిణ్యం మీద కార్మికులు బ్రతుకులు ఆధారపడి వుండాలనే విధంగా ప్రభుత్వ వైఖరి ఉందని, మనందరం కలిసికట్టుగా ప్రభుత్వ దివాలా కోరు ఆలోచనలను తిప్పి కొట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, దాల్‌మిల్లర్ వర్కర్స్ యూనియన్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, సెంట్రింగ్ వర్కర్స్, యూనియన్, తాపీ వర్కర్స్ యూనియన్, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.నాగేశ్వరరావు, వర్ధన్, జోనేష్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎం.సాంబశివరావు, డి.ప్రసాద్, మరియమ్మ, రెడ్డి రాధ, వై.ఈశ్వరి, సీఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరు రైతు సేవ కేంద్రంలో వరి విత్తనాలు పంపిణీ



**కొల్లూరు,జూన్ 26 (ప్రభాతవార్త) :** మండల కేంద్రమైన కొల్లూరులోని రైతు సేవా కేంద్రంలో గురువారం మాజీ మంత్రి, వేమూర శాసన సభ్యులు నక్కా ఆనందబాబు రైతులకు సబ్సిడిపై వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ కొల్లూరు మండలానికి వరి రకం బిపిటి 5204విత్తన రకం 240క్వింటాళ్ళు విత్తనాలు రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు అందించటానికి సిద్ధంగా ఉన్నాయని అని తెలియజేశారు. ఒక కేజీ వరి విత్తనం పూర్తి ఖరీదు రూ.43లు గాను రూ.5లు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. సబ్సిడీపోను రైతు ఒక కేజీకి రూ.38లు చెల్లించాలని తెలియజేశారు. వరి పండించే రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, రాష్టట తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.ప్రభాకర్‌రావు, బిఎన్ వంశీ, మండల వ్యవసాయశాఖ అధికారిని నరేంద్రబాబు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**కొల్లూరు,జూన్ 26 (ప్రభాతవార్త) :** అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ పరిధిలోని కొల్లూరు మండలంలోని అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారిణి ఎ.లక్ష్మీదేవి తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కొల్లూరు మండల పరిధిలోని కొల్లూరు ఎస్సీ ఏరియాలోని 109వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ వర్గానికి చెందిన వారు, క్రాప గ్రామంలోని 122వ అంగన్‌వాడీ కంప్రేంద్రంలో ఓసి వర్గానికి చెందిన వారు, దోనేపూడి గ్రామంలోని 148వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ వర్గానికి చెందిన వారు హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు పుట్టిన తేదీ, కుల దృవీకరణ, విద్యార్హత దృవీకరణ పత్రము, నివాస స్థల దృవీకరణ పత్రము, ఆధార్ కార్డు, తదితర పత్రాలను దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన పత్రాలను అమృతలూరు ఐసిడిఎస్ కార్యాలయానికి జులై 5వ తేది సాయంత్రం ఐదు గంటల లోపు అందించాలన్నారు. ఈ ఉద్యోగాలకు మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఆఫీస్ పనివేళల యందు సంప్రదించాలన్నారు.

## రేషన్‌కార్డుకు గడువు లేదు..ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

### -ఎంపీడీఓ విజయలక్ష్మి



**కొల్లిపర,జూన్ 26 ప్రభాతవార్త:** రేషన్‌కార్డుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్‌ఫేర్ అసిస్టెంటులతో కొత్త రేషన్‌కార్డులు..పెన్షన్‌లు నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ తప్పనిసరిగా రేషన్‌కార్డు ధరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు.సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి,ఈవోపిఆర్‌డి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపులు ప్రజలు సద్వినియోగించుకోవాలి : మండల వైద్యాధికారి నీహ



**కొల్లిపర,జూన్ 26 ప్రభాతవార్త:** గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు.గురువారం మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.ప్రతి నెలా నిర్వహించు ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేసారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుసి మ్రత,ఎఎన్‌ఎం లక్ష్మి,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 9 న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

### -సీఐటీయూ జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి



**కొల్లిపర,జూన్ 26 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జూలై 9 వ తేదీన జరిగే సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు.గురువారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో సమ్మెలో పంచాయతీ కార్మికులు పాలొ ్గంటారని తెలియజేస్తూ సీఐటీయూ నాయకులు జూనియర్ అసిస్టెంట్ లీలాకుమారికి వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడుదారుల ప్రయోజనం కోసం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్ తెచ్చిందన్నారు.కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.కార్యక్రమంలో గోదా సుందరరావు,మల్లోల రమేష్,పొత్తూరు ఏసుపాదం,కొల్లిపర కోటేశ్వరరావు,గోదా ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ గరుత్మంతుడుకు ప్రత్యేక పూజలు



**కొల్లిపర,జూన్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రం కొల్లిపరలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయ సమీపంలో ఉన్న గరుత్మంతుడు ఉన్న స్థంభాన్ని ఇటీవల లారీ డీ కొనటంతో ముక్కలు..ముక్కలుగా అయిపోయింది. దీంతో గ్రామానికి శ్రేయస్సు కాదని బావించిన గ్రామ పెద్దలు గురువారం పండితులు చేత హోమం నిర్వహించారు.గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ గరుత్మంతుడుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గరుత్మంతుడుకు ప్రత్యేక పూజలు నిర్వహించటంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రధాన అద్యక్షుడు పరాశరం జగన్నాధాచార్యులు, కుమారస్వామి,ప్రసాద్,పోగుల రామలింగేశ్వరశర్మ,నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

**రొంపిచర్ల, జూన్ 26 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి చెరువుకట్ట సెంటర్




వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ నిర్మలా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాలను తీసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎంపిడివో కె.మాథ్యూబాబు మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్, నరసింహారెడ్డి, గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపిఎస్ ఆర్టీసీలో 28వ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**నరసరావుపేట టౌన్, జూన్ 26 ప్రభాతవార్త :** నరసరావుపేట ఏపిఎస్ ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు 20వ బ్యాచ్‌ను మరో వారం రోజుల్లో ప్రారంభిస్తున్నామని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు గురువారం తెలియజేశారు. ఇప్పటికి 19 బ్యాచ్‌లు శిక్షణను పూర్తి చేసుకున్నాయని వారు తెలియజేశారు. శిక్షణా స్కూల్ నందు ప్రవేశం పొంది ఉత్తమ డ్రైవర్లుగా శిక్షణ పూర్తి చేసుకోవాలని కోరారు. కనీసం లైట్ వెయిట్ లైసెన్స్ ఉండాలన్నారు. రూ.23 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు : డిపో ఆవరణలో సంప్రదించాలని కోరారు.

## ఎన్ఈసిలో అవగాహన కార్యక్రమం

**నరసరావుపేట, జూన్ 26 ప్రభాతవార్త :** నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో లింగంగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అ క్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్, ఎన్‌సిసి అధికారి మేడికొండ రాజేష్‌బాబు, డాక్టర్ పార్థసారధి, డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడారు. మాదకద్రవ్యాల వలన కలిగే శారీరక, మానసిక అనారోగ్యాలను వివరించారు. వెసనాల బారిన పడవద్దని యువతకు సూచించారు. మానవహారంగా ఏర్పడ్డారు.

## కూటమి పాలనలో మాలలకు తీవ్ర అన్యాయం

### -రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గోదాజాన్‌పాల్


**వినుకొండ,జూన్26,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ పాలనలో మాలలకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గోదాజాన్‌పాల్ విమర్శించారు. పట్టణంలోని సీపీఎం భవన్ నందు



మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గోదాజాన్‌పాల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరిట కూటమి ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలపై మానసిక దాడి జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మాలల సన్మానవాటికకు భూములు కేటాయించాలని అనేకమార్లు రెవిన్యూ అధికారులకు అర్జీలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పల్నాడు, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ స్థాయి మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

## రాజుపాలెం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా అంచుల నరసింహారావు

**రాజుపాలెం, జూన్ 26 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్ఠానం సముచి స్థానంతో గుర్తించి, గౌరవిస్తుందని అందుకు నిలువెత్తు నిదర్శనం అంచుల నరసింహారావు అని మండల కాపు సంఘం అధ్యక్షుడు పులిబండ్ల సాంబశివరావు, మాజీ సర్పంచ్ జెట్టి కోటేశ్వరరావులు



అన్నారు. రాజుపాలెం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన అంచుల నరసింహారావును పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావులతో పాటు పలువురు నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పదవి చేపట్టిన ఆ పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి నరసింహారావు అని కొనియాడారు. కష్టాలను ఇష్టంగా భరించి, నాడు వైకాపా అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేసిన నరసింహారావు ఎంతో మంది కార్యకర్తలకు దిక్సూచిగా మారారు అనడంలో ఎటువంటి సందేహం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి శ్రీనివాసరావు, చొక్కా రాంబాబు, చొక్కా శ్రీనివాసరావు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లేబాకుల బ్రహ్మయ్య, యామర్తి వెంకట్రామయ్య, దుడుకు శ్రీనివాసరావు, తుమ్మల జాన్సన్, వెంకటేశ్వర్లు, జంగం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే జూలకంటి



**మాచర్ల, జూన్ 26 ప్రభాతవార్త:** అనారోగ్యంతో తల్లడిల్లే ఆర్తుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రమ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాచర్ల మండలం పశువేముల గ్రామంలో బెజవాడ రమేష్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం రూ.3 లక్షల 8 వేలు నగదు చెక్కును బాధితుడి భార్య మరియమ్మకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీత వేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీఆర్‌డీసీ ఆధ్వర్యంలో నషాముక్తి అభియాన్ ర్యాలీ

**విజయపురిసౌత్, జూన్ 26 ప్రభాతవార్త:** స్థానిక ఏపీఆర్‌డీసీలో నషాముక్తి అభియాన్ (డ్రగ్ ఫ్రీ క్యాంపెయిన్) కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నయీంభాను, ఎన్ఎస్ఎస్ పీఓ మొహమ్మద్ బాష,



అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చేలా ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఏఎస్పై సోమయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు : ఎస్సై వాసు

**కారంపూడి, జూన్ 26 ప్రభాతవార్త:** స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్య అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వాసు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా విద్యార్థులు తమ జీవితాలను బంగారు భవిష్యత్తు వైపు అడుగులు



వేయాలని సూచించారు. మాదక ద్రవ్యం వాడినా, అక్రమంగా రవాణా చేసినా కఠినంగా శిక్షలు ఉంటాయని తమ జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే వ్యసనాలకు, మద్యానికి, మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలు పాడుచేసుకోవడంతో సమాజం పాడైపోతుంద న్నారు. విద్యార్థులతో కారంపూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు

## ప్రతిభ చూపిన విద్యార్థినికి నగదు పురస్కారం

**మాచర్ల, జూన్ 26 ప్రభాతవార్త:** ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి స్థానిక న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం నగదు



పురస్కారాన్ని గురువారం అందజేసింది. పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాలలో చదువుకున్న ఉప్పుతోళ్ల లలిత ఇంటర్‌లో 959 మార్కులు సాధించింది. న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ బ్రాంచ్ తీసుకుని విద్యనభ్యసిస్తోంది. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నగదు పురస్కారాన్ని అందజేసినట్లు కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**మాచర్ల, జూన్ 26 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందదిన సంఘటన పట్టణ శివారు గుంటూరు రోడ్డు చెన్నకేశవ కాలనీ సమీపంలో ని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద జరిగింది. చెన్నకేశవ కాలనీలో నివాసముండే కామినేని వినోద్‌బాబు (40) గోగుల వెంకటేశ్వర్లు తో కలసి బైక్‌పై పట్టణం నుంచి కాలనీకి వస్తుండగా రిలయన్స్ బంకు వద్ద లారీ ఢీకొట్టింది. దీంతో వినోద్‌బాబుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య శైలజ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్య రంగంలో కొత్త శకానికి నాంది

### -జెఎన్‌టియు ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** మెడికల్ రంగంలో ఆధునిక పదార్థాల వాడకం ద్వారా కృత్రిమ అవయవాలు, డెంటల్ ఇంప్లాంట్లు, బోన్ ప్లేట్స్ వంటి వాటిని శరీరానికి అనుకూలంగా తయారు చేయడం ఇప్పుడు




సాధ్యమవుతోందని జెఎన్‌టియు కాకినాడ ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ అన్నారు. బయోకంపాటబుల్ పదార్థాలు శరీరంలో తిరస్కరణ లేకుండా పనిచేయడం వల్ల వైద్య రంగంలో ఇది ఒక కొత్త శకానికి నాంది అని పేర్కొన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్‌టియు కాకినాడ వారి సౌజన్యంతో అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రో గ్రామ్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో ఖచ్చితత్వంతో కూడిన వస్తు తయారి అనేది వైమానికి, ఖగోళ పరిశోధనల్లో ఎంతో అవసరమన్నారు. సాంప్రదాయ తయారీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్ సహకారంతో మ్యానుఫాక్చరింగ్‌ను అతివేంగా ఖచ్చితత్వంగా చేయవచ్చని పేర్కొన్నారు. ఆటో మొబైల్ రంగమైన వాహనాల తయారీ సంస్థలు ప్రస్తుతం తేలికపాటి కానీ బలమైన పదార్థాలు వంటి పదార్థాలను వాడడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించడమే కాక, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా పనిచేస్తున్నాయని తెలియజేశారు. ఏరోస్పేస్ రంగంలో అధిక బలం, తక్కువ బరువు కలిగిన పదార్థాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని, టిటానియం, కార్బన్‌ఫైబర్ వంటి పదార్థాలు విమానాల శరీర భాగాలను నిర్మించడంలో వాడుతున్నారని తెలిపారు. దీనివల్ల విమానాల సమర్థత పెరిగి, ఇంధన వినియోగం తగ్గుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ 40మందికి పైగా విద్యావేత్తలు, పరిశోధకులు ఈ ఎఫ్‌డీపీ కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, న్యూరల్ నెట్వర్క్ వంటి ఆధునిక అంశాలు, మెటీరియల్స్, మాన్యుఫాక్చరింగ్ రంగాలలో ఏ విధంగా ఉపయోగించవచ్చో తర్ఫీదు తీసుకొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపిఎంఈ డాక్టర్ ఎం.మధుసూధనప్రసాద్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి మారుపేరు టిడిపి ప్రభుత్వం

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** అభివృద్ధికి మారుపేరు టిడిపి అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.35కోట్లతో నిర్మించే కాలువలు, సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మంచినీటి సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా ఉండేందుకు మంచినీటి పనుల నిమిత్తం 25వ వార్డులో రూ.15లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీరామా మునిసిపల్ ముందు వెనుక కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ ప్రాంత వాసిగా ఈ ప్రాంతాన్ని జిల్లాలోనే అత్యంత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు తదితరులున్నారు.

## ట్రిపుల్ ఐటీకి భార్గవి ఎంపిక



పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త: మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఐదవ వార్డు, నిడుబ్రోలుకు చెందిన విద్యార్థిని పాలపర్తి భార్గవి(569/600)మార్కులు సాధించి ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాన్ని కల్పిస్తుందన్నారు. అందులో భాగంగా మునిసిపల్ ఉన్నత పాఠశాల నుంచి భార్గవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ ప్రభుత్వం తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటానన్నారు. తల్లిదండ్రులు తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా, వారి ఆకాంక్షలకు అనుగుణంగా విద్యనభ్యసిస్తానని చెప్పారు. భార్గవిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గోపి, వెంకటేశ్వరమ్మ అభినందించారు.

## ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షునిగా నల్లమోతు రవీంద్రబాబు



**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన నల్లమోతు రవీంద్రబాబును నియమిస్తూ వైకాపా అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామస్థాయిలో మంచి పలుకుబడి ఉండడం, పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషిచేయడం వంటి అంశాలు రవీంద్రబాబు నియామకానికి దోహదపడ్డాయి. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో పటిష్టతకు కృషి చేస్తానన్నారు. అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. పదవి కట్టబెట్టిన పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర డీసీఎంఎస్ ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబు

**పొన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర డీసీఎంఎస్ ఛైర్మన్‌గా గుంటూరు డీసిఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర



ఉమ్మడి జిల్లాల డీసిఎంఎస్ ఛైర్మన్‌లు అందరూ కలిసి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో వడ్రాణం హరిబాబును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లా ఛైర్మన్ గొంప కృష్ణను, ఉపాధ్యక్షులుగా పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణను, కార్యదర్శిగా అనంతపురం జిల్లా ఛైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని జిల్లాల ఛైర్మన్‌ల సమస్యల పరిష్కారానికి, రైతులకు మంచి లాభాలు చేకూరేవిధంగా వారికి అవసరమైన సేవలను అందిస్తానన్నారు. అన్ని జిల్లాల ఛైర్మన్లు రైతుల బాగుకోసం, వారి అవసరాలను తెలుసుకొని వాటిని నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వడ్రాణం హరిబాబును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు.

## రహదారులపై దమ్ము ట్రాక్టర్లు తిప్పితే కఠిన చర్యలు : ఎస్సైవాసు

కారంపూడి, జూన్ 26 ప్రభాతవార్త: రహదారులపై దమ్ము చక్రాలతో ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని కారంపూడి ఎస్సై వాసు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పొలాలను దమ్ము చేసే పనిలో ట్రాక్టర్లు అధికంగా కనిపిస్తున్నాయి. దమ్ము చక్రాల ట్రాక్టర్లు ఇష్టారీతిన తిరుగుతుండటం రహదారులకు గండంగా మారింది. సంవత్సరాలపాటు నిలవాల్సిన రహదారులు నెలల వ్యవధిలోనే పూర్తిగా దెబ్బ తింటున్నాయన్నారు. వీటిని నియంత్రించడంలో పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.

# జులై 25న 'మహావతార్ నరసింహ'

భారతీయ సినిమా రంగాన్ని పాన్ ఇండియా స్థాయిలో అదరగొడుతున్న హోంబలే ఫిల్మ్స్, భారీ బడ్జెట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించే ఈ సంస్థ, ఇప్పుడు క్లీమ్ ప్రొడక్షన్స్‌తో మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ అనే గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రారంభించనుంది. ఇది భారతీయ పురాణాలను ఆధారంగా చేసుకుని లార్డ్ విష్ణు దశావతారాలను కట్టింగ్ ఎడ్జ్ యానిమేషన్, గొప్ప స్టోరీ టెల్లింగ్, సినిమాటిక్ స్కేల్‌లో రీఇమాజిన్ చేయనుంది. మహావతార్ యూనివర్స్ 12 సంవత్సరాల ప్లానింగ్‌తో ప్రారంభమవుతుంది. ఈ పయనం మొదటి అడుగు మహావతార్ నరసింహ రూపం



లో, జులై 25, 2025న 3డి ఫార్మాట్‌లో, భారతదేశంలోని ఐదు ప్రధాన భాషలలో విడుదల కానుంది. ఈ చిత్రానికి దర్శకుడు అశ్విన్ కుమార్, నిర్మాతలు శిల్పా ధవాన్, కుశల్ దేశాయి, చైతన్య దేశాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ వైరల్‌గా మారి మేకర్స్ విజన్‌పై అంచనాలను పెంచింది. ఈ యూనివర్స్ దశావతారాలను తెరపైకి తీసుకొస్తుంది. 2025లోనరసింహ, 2027లో పరశురామ, 2029లో రఘునందన్, 2031లో ద్వారకాధీశ్, 2033లో గోకులానంద, 2035లో మహావతార్ కల్కి పార్ట్ 1, 2037లో మహావతార్ కల్కి పార్ట్ 2 చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. తాజాగా 'మహావతార్ నరసింహ' నుంచి ఫస్ట్ సింగిల్ 'రోర్ అఫ్ నరసింహ' ను విడుదల చేశారు. స్టార్ కంపోజర్ సామ్ సి.ఎస్ ఈ పాటను డివైన్ వైబ్స్‌తో పవర్‌ఫుల్‌గా కంపోజ్ చేశారు. సామ్ సి.ఎస్, రాకేందు మోళి పవర్‌ఫుల్ సాహిత్యాన్ని అందించడమే కాక, అంతే ఎనర్జిటిక్‌గా కూడా పాడారు. ఈ సాంగ్ ప్రస్తుతం అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో ఉంది. దర్శకుడు అశ్విన్ కుమార్ మాట్లాడుతూ, "భారతీయ వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నంలో, మా క్లీమ్ ప్రొడక్షన్స్, హోంబలే ఫిల్మ్స్ కలిసి పని చేయడం గర్వంగా ఉంది. ఇది కేవలం సినిమా కాదు, ఒక ఆధ్యాత్మిక అనుభూతి అన్నారు. నిర్మాత శిల్పా ధవాన్ మాట్లడుతూ, ఇప్పుడు మన కథలు తెరపై అలరించబోతున్నాయి.

# నా రీఎంట్రీకి సరైన మూవీ 'తమ్ముడు' : నటి లయ

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో టాలీవుడ్ లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు నటి లయ. తమ్ముడు సినిమా జులై 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ తో పాటు ఝూన్సీ కిరణ్మయి క్యారెక్టర్ లో నటించిన తన ఎక్స్‌పీరియన్స్ తెలిపారు నటి లయ. నేను 2023 ఫిబ్రవరిలో ఇండియాకు వచ్చాను. ఇక్కడ కొన్ని యూట్యూబ్ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూస్ ఇచ్చాను. ఆ ఇంటర్వ్యూస్ చూసి జూన్‌లో తమ్ముడు మూవీ టీమ్ నుంచి కాల్ వచ్చింది. నేను తీసుకున్న కొన్ని ఫొటోస్ పంపిస్తే, వాటిలో ఈ క్యారెక్టర్‌కు సెట్ అయ్యేలా కనిపించలేదు. దాంతో మళ్లీ ఫొటోషూట్ చేసి పంపమన్నారు. ఆ ఫొటోస్ చూసి నన్ను సెలెక్ట్ చేసుకున్నారు. అప్పటికి లైన్‌గా తమ్ముడు కథ తెలుసు. నా రీ ఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది. క్యారెక్టర్ కోసం కొంచెం లావు కావాలని చెప్పారు. స్వీట్స్ తిని బరువు



పెరిగాను. ఈ మూవీ కోసం కొన్ని నెలల పాటు ఇక్కడే ఉన్నాను. తమ్ముడు మూవీలో ఝాన్సీ కిరణ్మయి అనే క్యారెక్టర్‌లో నటించాను. తనొక ఆఫీసర్. స్ట్రిక్ట్‌గా ఉంటుంది. కుటుంబాన్ని చూసుకుంటూనే, ఆఫీసర్‌గా నా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాను. హీరో నితిన్‌కు సోదరి పాత్ర నాది. ఈ చిత్రం కోసం అడవిలో షూటింగ్ చేశాం. రోజూ యూనిట్‌లో ఎవరో ఒకరికి గాయాలు అయ్యేవి. షూటింగ్ పిక్నిక్ లా చేశామని చెబుతుంటారు. కానీ మేము పిక్నిక్ లా చేయలేదు. కష్టపడాల్సి వచ్చింది. మూవీ బాగా వస్తుందనే సంతోషంలో అంతా యూనిటీగా పనిచేశాం. ఈ సినిమా షూటింగ్ కాదని ఎవరూ ఎక్కడికీ వెళ్లలేదు. చాలా డెడికేటెడ్‌గా వర్క్ చేశాం. నితిన్‌తో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తను స్టార్ హీరో అయినా చిన్న పిల్లాడిలా మా అందరితో కలిసిపోయారు. పర్ఫార్మెన్స్ పరంగా చూస్తే ఈ సినిమాలో నితిన్ చాలా మెచ్యూర్డ్‌గా కనిపిస్తాడు. చాలా కష్టమైన సీన్స్ కూడా ఈజీగా చేశాడు. సీన్స్ కోసం చేసిన ప్రిపరేషన్ వల్లే అంత సులువుగా నటించగలిగారు. తమ్ముడు అనే టైటిల్ ఈ సినిమాకు యాప్ట్. మీరు సినిమా చూశాక చెబుతారు. పవన్ కల్యాణ్ తమ్ముడు మూవీకి ఈ చిత్రానికి పోలిక లేదు.



# జులై 25న 'ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్'

మార్వెల్ అభిమానులకు పండగే! ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్ సినిమా జూలై 25, 2025న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ ఇప్పుడు విడుదలైంది, ఇది మార్వెల్ మొదటి సూపర్ హీరో కుటుంబానికి, గ్రహాలను మింగేసే గెలాక్టస్‌కి మధ్య జరగబోయే భీకర పోరాటాన్ని చూపిస్తుంది. 1960ల నాటి రెట్రోఫ్యూచరిస్టిక్ సెట్టింగ్‌లో ఈ సినిమా ఉంటుంది. కొత్త వెనెస్సా కిర్బీ (సూ స్ట్రోమ్/ ఇన్విజిబుల్ ఉమెన్), జోసెఫ్ క్విన్ (జానీ స్ట్రోమ్/హ్యూమన్ టార్చ్), మరియు ఎబోన్ మోస్‌బచ్‌రాక్ (బెన్ గ్రిమ్/ది థింగ్) ఉన్నారు. వీరు భూమిని కాపాడాలి, గెలాక్టస్ (రాల్ఫ్ ఇనెసన్) మరియు అతని దూత సిల్వర్ సర్ఫర్ (జూలియా గార్నర్) నుండి రక్షించాలి. గ్రహాన్ని కాపాడటమే కాకుండా, వారి కుటుంబ బంధాన్ని నిలబెట్టుకోవడం కూడా వారికి ఒక పెద్ద సవాలు. ఈ యాక్షన్ అడ్వెంచర్‌లో పాల్ వాల్టర్ హౌసర్, జాన్ మల్కోవిచ్, నటాషా లియోన్ మరియు సారా నైల్స్ కూడా నటిస్తున్నారు. మాట్ షాక్‌మాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను కెవిన్ ఫీజ్ నిర్మించగా, లూయిస్ డిఏస్పోసిటో, గ్రాంట్ కర్టిస్ మరియు టిమ్ లూయిస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌లుగా వ్యవహరించారు.




# పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నయన్ సారిక

2024లో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకోవటమే కాదు.. బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ అయిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించిన ఈ చిత్రం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అందించిన గద్దర్ అవార్డ్స్‌లో జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు చిత్ర దర్శకుడు యదు వంశీకి ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా కూడా అవార్డ్ వచ్చిన విషయం తెలిసిందే. తొలి ప్రయత్నం లోనే అందరినీ మెప్పించిన ఈ సక్సెస్‌ఫుల్ బ్యానర్‌లో ఇప్పుడు రెండో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పింక్ ఎలి ఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందనున్న రెండో సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ప్రతిభావంతుడైన యువ కథా నాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఇది వరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ సరసన హీరోయిన్‌గా నయన్ సారిక నటిస్తుంది. ఆయ్, క వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించిన ఈమె పింక్ ఎలిఫెంట్‌పిక్చర్స్ నిర్మించిన జీ5 వారి హలో వరల్డ్, సోనీ లివ్ వారి బెంచ్ లైఫ్ వంటి వెబ్ సిరీస్‌ల్లోద్వారా తెలుగుకి పరిచయం అయ్యారు.



# 'కన్నప్ప' కల్పితం కాదు.. అది మన చరిత్ర..

## మీడియా మీట్‌లో విష్ణు మంచు..

డైనమిక్ హీరోవిష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' జూన్ 27న విడుదల కాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. ఎం. మోహన్ బాబు నిర్మాణంలో ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటి వరకు రిలీజ్‌చేసిన టీజర్, ట్రైలర్‌లు ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. ఈ క్రమంలో గురువారం నాడు విష్ణు మంచు, కన్నప్ప టీం మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో విష్ణు మంచు మాట్లాడుతూ.. .. 'కన్నప్ప'కు ఇప్పటి వరకు లక్షకు పైగా టికెట్లు తెగాయి. ఇంతటి రెస్పాన్స్ చూసి నాకు ఆనందమేస్తోంది. ఇదంతా శివ లీల అనిపిస్తుంది. 'కన్నప్ప' మీద ఇంత పాజిటివిటీ వస్తుందని ప్రారంభంలో ఎవ్వరూ నమ్మలేదు. అది వారితప్పుకాదు. ఇప్పుడు 'కన్నప్ప' మీద ఫుల్ పాజిటివిటీ వచ్చింది. 'కన్నప్ప' చిత్రాన్ని ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా చూడాలని కోరుకుంటున్నాను. అందుకే నేను టికెట్ రేట్లు పెంచడం లేదు. ఎపిలో కొన్ని చోట్ల మాత్రమే పెంచాం. కన్నప్ప కోసం మా టీం పడినంత కష్టాన్ని నేను అయితే పడలేదు. నా నలుగురుపిల్లలు ఈచిత్రంలో నటించారు. అసలు 'కన్నప్ప' ఈ రేంజ్ పాజిటివిటీతో వస్తుందని ఒకప్పుడు ఎవ్వరూ ఊహించలేదు. నా చిత్రం పది వారాల వరకు ఒటిటిలో రాదు. ఈచిత్రంలో ఎవ్వరినీ ఎక్కడా కూడా అగౌరవ పర్చలేదు. దేవుడు, భక్తుడికి మధ్యలోఎవ్వరూ ఉండాల్సిన పని లేదు, మూఢ నమ్మకాలు అవ సరం లేదు అని చెప్పడమే ఈ చిత్రం ఉద్దేశం. దేవుడి మీద మనసారా భక్తి ఉంటే చాలు అని చెప్పాలని అనుకున్నాం. ఈ చిత్రంలో మోహన్‌లాల్ గారి పాత్ర చాలా సర్‌ప్రైజింగ్‌గా, షాకింగ్‌గా అనిపిస్తుంది. 'కన్నప్ప' కథ కల్పితం కాదు. కన్నప్ప ఉన్నారు.. ఇప్పటికీ ఆయన్ను ఆరాధిస్తుంటారు. మళ్లీ చెబుతున్నాను 'కన్నప్ప' కల్పితం కాదు.. చరిత్ర.. మన చరిత్ర. మన మధ్యలో జీవించినవాడు అని అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నేను ఇంత వరకు కన్నప్ప గురించి ఎంతో చెప్పాను. మేం కన్నప్ప చిత్రాన్ని గొప్పగా తెరకెక్కించాం. ఇక ఇప్పుడు మేం మా పనికి తగ్గ ప్రతిఫలం వస్తుందా? అని ఎదురుచూస్తున్నాం. మేం ఆడియెన్స్ ఇచ్చే ఫలితం కోసం వెయిట్ చేస్తున్నాం. కన్నప్ప గురించి ఇప్పటి తరానికి ఎక్కువగా తెలియదు. భక్తి, దేవుడు అనే వాటి మీద నమ్మకం లేని వ్యక్తి.. చివరకు గొప్ప శివ భక్తుడిలా ఎలా మారాడు? అన్నది ప్రపంచానికి తెలియజేయాలని ఈ కన్నప్ప సినిమాను తీశాం. ఇందులో ప్రతీ పాత్రకు అందరూ ప్రాణం పెట్టి నటించారు. పూర్తి నిర్మలమైన మనసుతో సినిమాను చూడండిఅన్నారు. శివ బాలాజీ మాట్లాడుతూ.. భూమ్మీద అతిసుందరమైన ప్రదేశంలో షూటింగ్‌చేశాం. ప్రస్తుతం సినిమా మీద పూర్తిగా పాజిటివిటీ ఏర్పడింది. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. నేను కన్నప్ప చిత్రాన్ని ఆల్రెడీ చూశాను. సినిమా అద్భుతంగా ఉంటుంది అని అన్నారు.



# 'కానిస్టేబుల్ కనకం' ట్రైలర్ రిలీజ్

కానిస్టేబుల్ కనకం ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రాజెక్ట్. భారీ బడ్జెట్, హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నాం. ఒక ఓటీటీ సంస్థ ఇదే కథని కాపీ కొట్టి ట్రైలర్ రిలీజ్‌చేసింది. దీనిపై మేము న్యాయ పోరాటం చేస్తున్నాం: ప్రెస్‌మీట్‌లో దర్శకుడు ప్రశాంత్: ఈటీవీ విన్ టీం. వర్ష బొల్లమ్మ టైటిల్ రోల్‌లో నటించిన వెబ్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయిబాబా, వేటూరి హేమంత్ కుమార్ నిర్మించారు. రాజీవ్ కనకాల, మేఘ లేఖ, రమణ భార్గవ్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి సంబధించి ఒక ముఖ్యమైన ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో దర్శకుడు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. కానిస్టేబుల్ కనకం వెబ్ సిరీస్‌ని అందరం చాలా కష్టపడి చేశాం. ఈ ప్రాజెక్టు కు సంబంధించి ఒక మంచి సందర్భంలో మిమ్మల్ని అందరిని కలవాలి అనుకున్నాం. కానీ ఇలాంటి సిచువేషన్ వస్తుందని మేము ఊహించలేదు. ఈ మధ్య కాలంలో ఇదే కథతో వేరే ఓటీటీ సంస్థ నిర్మించిన ఒక ట్రైలర్ బయట కు వచ్చింది. అది చూసి మేము షాక్ అయ్యాము. న్యాయస్థానాన్ని ఆశ్రయించాము. కోర్టులో కేసు నడుస్తోంది. నిజానికి ఇలాంటి పరిస్థితి వస్తుందని మేము ఊహించలేదు. చాలా బాధగా ఉంది. ఒక దర్శక, రచయితగా కథని ఎంతో మందికి చెప్తాను. ఈ క్రమంలో ఒక సంస్థకి కథ చెప్ప డం జరిగింది. అన్ని మెయిల్స్ రూపంలో వాళ్లకి పంపడం జరి గింది. కొంత వర్క్ అయిన తర్వాత వాళ్లు వద్దనుకున్నారు. తర్వాత నేను మరో ప్రయత్నం చేసుకున్నాను. అలా ఈటీవీ విన్‌లోకి వచ్చాను. ఇక్కడ ప్రాజెక్ట్ సెట్స్ పైకి తీసుకెళ్ళాం. ఇలా ఇప్పుడు అదే కథతో ఆ సంస్థ నుంచి సిరీస్ ట్రైలర్ కనిపిస్తుంది. మా దగ్గర అన్ని ఆధారాలు వున్నాయి. ఈ విషయంలో మేము న్యాయ పోరాటం చేస్తున్నాం అన్నారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. కానిస్టేబుల్ కనకం ఈటీవీ విన్ ఒరిజినల్ సిరీస్. మేము దేని నుంచి కాపీ కొట్టలేదు. సినిమా వచ్చిన తర్వాత చేసేది పైరసీ అంటారు. అసలు రాకముందే ఇలా చేసేవారిని ఏమనాలో అర్థం కావడం లేదు. అదే స్టోరీ స్క్రీన్ ప్లే క్యారెక్టర్స్ కాపీ కొట్టి తీస్తే ఏమనాలో మీరే చెప్పాలి.



# 27న 'చంద్రేశ్వర' విడుదల

జూన్ 27న మరో శివుని చిత్రం విడుదల కాబోతోంది. 'కన్నప్ప'తో పాటు మహాశివుడి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న చిత్రం 'చంద్రేశ్వర'. 'అదృశ్య ఖడ్గం' అనేది ట్యాగ్‌లైన్. శివ బాలాజీ ఫిలింస్ పతాకంపై బేబీ అఖిల సమర్పణలో.. సురేష్ రవి, ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఆర్కియాలజీ సస్పెన్స్ అండ్ హారర్ థ్రిల్లర్ చిత్రం 'చంద్రేశ్వర'. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ సాంగ్స్ అన్నీ కూడా ట్రెమండస్ రెస్పాన్స్‌ను రాబట్టుకుని సినిమాపై భారీగా అంచనాలను పెంచేయగా, జూన్ 27న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రవీంద్ర చారి మాట్లాడుతూ.. "శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అన్నట్లు 'చంద్రేశ్వర' మూవీతో నేను పరిశ్రమలోకి అడుగుపెడుతున్నాను. ఆర్కియాలజీ నేపథ్యంలో ఎమోషన్స్‌తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఏ టెక్నాలజీ లేని ఆ కాలంలో మన పూర్వీకులు గొప్ప దేవాలయాలు నిర్మించారు. అప్పటి వారి జీనవ విధానం ఎలా ఉండేది? అనే అంశాలు ఆకట్టుకుంటాయి. ఆర్కియాలజీ బ్యాక్‌డ్రాప్‌లో ఇంత వరకు ఇలాంటి సినిమా రాలేదని గర్వంగా చెప్పగలం. ఈ సినిమాకు సంగీతం ప్రధాన హైలెట్‌గా ఉంటుంది. ఇందులో సాంగ్స్ అన్నీ అత్యద్భుతంగా వచ్చాయి. 'ఈశ్వరా.. నా పరమేశ్వరా', 'అఖిల అఖిల' డ్యూయెట్ సాంగ్, 'నమస్తే చిదంబరం' అనే సాంగ్.. ఇలా సాంగ్స్ అన్నీ వండర్‌ఫుల్‌గా వచ్చాయి. ప్రస్తుతం ఈ పాటలు ట్రెండ్ అవుతున్నాయి. సినిమా కూడా సస్పెన్స్, హారర్ అంశాలతో అత్యద్భుతంగా వచ్చింది. ఈ సినిమాను జూన్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాము. ఈ వారంలో రెండు భక్తి సినిమాలు ఒకటి 'కన్నప్ప', రెండు 'చంద్రేశ్వర' పోటాపోటీగా విడుదలవుతున్నాయి. ఈ రెండు సినిమాలు బ్రహ్మాండమైన విజయాన్ని సాధించాలని కోరుకుటున్నాము. దర్శకుడు అద్భుతంగా ఈ సినిమాను రూపొందించారు. చివరినిమిషం వరకు ఈ సినిమా అత్యంత ఉత్కంఠ భరితంగా ప్రేక్షకులను సినిమాలో లీనమయ్యేలా చేస్తుంది. ఎటువంటి అశ్లీలత ఇందులో ఉండదు. సెన్సార్ నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చింది. ప్రేక్షకులు ఈ సినిమాను చూసేందుకు థియేటర్లకు తరలి వచ్చి బ్రహ్మాండమైన సక్సెస్ చేస్తారని కోరుకుంటున్నాము. ఈ జర్నీలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని తెలిపారు. సురేష్ రవి, ఆశ వెంకటేష్, నిలగల్ రవి, బోసే వెంకట్, అడుకులం మురుగదాస్ గజరాజ్, జె ఎస్ కే గోపి, తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెరాడ్ ఫిలిక్స్, డిఓపి: ఆర్వి సీయోన్ ముత్తు, సింగర్స్: సాయి చరణ్, లిరిక్స్: వెంకట్, జ్యోతి, డిటిఎస్: శ్యామ్, ఎడిటర్: నందమూరి హరి, పిఆర్వో: బి. వీరబాబు.



# 'నేను రెడీ' టైటిల్, గ్లింప్స్ లాంచ్

నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ నేను రెడీ. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న నేను రెడీ మూవీ టైటిల్, గ్లింప్స్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఆర్టిస్ట్ రోహన్ రాయ్ మాట్లాడుతూ ఈ రోజు బర్త్ డే జరుపుకుంటున్న మా హీరో హవీష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మా డైరెక్టర్ త్రినాథరావు, హవీష్ సూపర్ హిట్ కొట్టేందుకు నేను రెడీ అంటున్నారు. ఇది స్టాటర్స్ మాత్రమే ఫుల్ మీల్స్ రెడీగా ఉంది. ఎంటైర్ మూవీ టీమ్‌కు ఆల్ ది బెస్ట్ అన్నారు.నటుడు బలగం సత్యనారాయణ మాట్లాడుతూ, నేను రెడీ మూవీలో మంచి క్యారెక్టర్ చేశాను. ఈ చిత్రంలో మంచి ఫన్ ఉంటుంది. సినిమా ఆద్యంతం మీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ త్రినాథరావుకి థ్యాంక్స్ అన్నారు. నటి జయవాణి మాట్లాడుతూ, నేను రెడీ సినిమాలో ఇంపార్టెంట్ రోల్ చేశాను. చాలా రోజుల తర్వాత నాకు ఇలాంటి ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ దక్కింది. ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ త్రినాథరావు గారికి కృతజ్ఞతలు. మా హీరో హవీష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అన్నారు. నటుడు మాణిక్ రెడ్డి మాట్లాడుతూ, హవీష్ ఈ సినిమా గురించి చాలా రోజుల కిందట నాతో చెప్పారు. మంచి ఎంటర్ టైనింగ్ మూవీ చేస్తున్నాను త్రినాథరావుతో అన్నారు. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్ కు ఇంపార్టెన్స్ ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ ఎంటర్ టైన్ చేస్తుంది. నాకు కూడా మంచి రోల్ ఇచ్చారు. ఎంతోమంది దర్శకులు టాలీవుడ్‌లో ఎంటర్‌టైనింగ్ మూవీస్ చేస్తున్నారు. వారి లిస్టులో త్రినాథరావు కూడా ఉంటారు. ఈ కథలో ఎక్కడ అవకాశం దొరికినా ఆయన నవ్వించే సీన్స్ చేయించారు. కథ బాగున్న ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. నేను రెడీ సినిమా కూడా ఘన విజయం సాధిస్తుందని నమ్మకంతో చెబుతున్నా అన్నారు. నటి రూప లక్ష్మి మాట్లాడుతూ, మంచి క్యారెక్టర్స్ చేసినప్పుడు ఆర్టిస్టులకు ఎంతో సంతృప్తి దక్కుతుంది. అలాంటి అవకాశం నేను రెడీ చిత్రంతో నాకు దక్కింది. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు మేమంతా హ్యాపీగా ఫీలయ్యాం. ఇదే సంతోషం థియేటర్స్‌లో ప్రేక్షకులకూ అందించబోతున్నాం అన్నారు. నటి మహతి మాట్లాడుతూ నేను రెడీ మూవీలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. డైరెక్టర్ త్రినాథరావు మూవీస్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన ధమాకా చిత్రంలో అవకాశం వస్తుందని ఆశించాను. ఈ చిత్రంలో ప్రేక్షకులకు కావాల్సినంత ఫన్ ఉంటుంది. నేను ఎన్నో సీరియల్స్‌లో నటించాను. ఇప్పుడు మూవీస్ ద్వారా ప్రేక్షకుల అభిమానం పొందాలని ప్రయత్నిస్తున్నా అన్నారు. నటి హరితేజ మాట్లాడుతూ, హవీష్‌కి ఈ బర్త్ డే ఎంతో స్పెషల్ కావాలని కోరుకుంటున్నా. నేను రెడీ సినిమా నుంచి ఆయనతో పాటు మా అందరికీ సక్సెస్ దక్కాలి. ఈ సినిమాకు 3 రోజులు షూటింగ్ చేశాను. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నా అన్నారు. నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ,నేను రెడీ సినిమాలో నేనొక మంచి రోల్ చేశాను. ఈ చిత్రంలో ఎంటర్ టైన్ మెంట్, ఎమోషన్ ఆకట్టుకుంటాయి. మధ్య తరగతి లైఫ్‌లో ఉండే అన్ని ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని త్రినాథరావు రూపొందించారు.



27-6Pg5.qxd:27-6Pg5.qxd 01/01/01 8:52 AM Page 1



# 'షాంఘై' ఉమ్మడి తీర్మానంపై సంతకానికి రాజ్‌నాథ్ 'నో'

## పహల్గాం దాడి గురించి లేకపోవడంపై అసంతృప్తి ప్రకటించిన రక్షణ మంత్రి




**బీజింగ్,జూన్ 26:** అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదం విషయంలో తన దృఢ వైఖరిని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ మరోసారి నిష్కర్షగా చాటుకుంది. చైనాలోని కింగ్‌డావో నగరంలో గురువారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రవాద నిర్మూలన, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై రూపొందించిన ఉమ్మడి ప్రకటనలోని కొన్ని ప్రతిపాదనలు భారత ప్రయోజనాలకు, వైఖరికి విరుద్ధంగా ఉండటంతో, దానిపై సంతకం చేయడానికి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఆ ప్రతిపాదనల పత్రాలను పరిశీలిస్తూ పెన్ను పక్కనపెట్టేశారు. ఈ నిర్ణయం, ఉగ్రవాదంపై, ప్రత్యేకించి సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ ఎంతటి కఠిన వైఖరిని అవలంబిస్తుందో ప్రపంచానికి స్పష్టం చేసింది. సమావేశానంతరం విడుదల చేయాలని భావించిన ఉమ్మడి ప్రకటన ముసాయిదాలో, ఇటీవలే జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. అదే సమయంలో, పాకిస్థాన్ పదేపదే ఆరోపిస్తున్న బలూచిస్థాన్‌లోని మిలిటెంట్ కార్యకలాపాల గురించి పరోక్షంగా ప్రస్తావించే ప్రయత్నాలు జరిగాయని, దీనిని భారత్ తీవ్రంగా వ్యతిరేకించిందని సమాచారం. ఉగ్రవాద అంశంపై సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, చివరికి ఎస్‌సిఒ ఎలాంటి ఉమ్మడి ప్రకటనను జారీ చేయకుండానే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో చైనా, రష్యా, పాకిస్థాన్‌తో పాటు ఎస్సీఓలోని పది సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంలో భాగంగా మార్చుకుని, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి శిక్షణనిస్తున్నాయని పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ, ఇది పాకిస్థాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ దుశ్చర్యేనని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న శక్తులను ఎస్‌సీఓ సమష్టిగా నిలదీయాలి. శాంతి, శ్రేయస్సు అనేవి ఉగ్రవాదంతో కలిసి మనుగడ సాగించ లేవని ఆయన ఉద్ఘాటించారు. ఉగ్రవాద చర్యలు ఎక్కడ, ఎవరు, ఏ ఉద్దేశంతో చేసినా అవి నేరపూరితమైనవేనని, వాటిని సమర్థించ రాదని ఆయన పిలుపునిచ్చారు.

ఈ చైనా పర్య టనలో భాగంగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సైనిక హాట్‌లైన్‌ను పునరుద్ధరించడం సహా పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. గల్వాన్‌లోయలో ఘర్షణల అనంతరం భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం.




# ఇరాన్ అణుకేంద్రాలు పూర్తిగా ధ్వంసమే: డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 26:** ఇరాన్ అణుకేంద్రాలపై తాము దాడి చేశాక ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. అగ్రరాజ్య దాడుల్లో ఇరాన్‌కు ఊహించినంత నష్టం జరగలేదంటూ.. పెంటగాన్‌ను ఉటంకిస్తూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈవిధంగా స్పందించారు. ట్రంప్ నాటో సదస్సులో మాట్లాడుతూ 'మీకు తెలుసా వాళ్ల (ఇజ్రాయెల్) మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోంది. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. నేను కూడా నమ్ముతున్నాను.. ఏదీ మిగిలే అవకాశం లేదు' అని ఫోర్డో కేంద్రం గురించి పేర్కొన్నారు.

**ఆ కేంద్రాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి : సిఐఎ**

ఇరాన్‌లోని అణు కేంద్రాలు అమెరికా దాడిలో తీవ్రంగా దెబ్బతిన్నాయని సిఐఎ కూడా ధ్రువీకరించింది. ఈ మేరకు దాని డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. అక్కడి కేంద్రాలు ధ్వంసం కావడం వల్ల చాలాకాలం వరకు అవి కోలుకొనే పరిస్థితి లేదన్నారు. వీటి పునర్ నిర్మాణానికి కొన్నేళ్ల సమయం పడుతుందన్నారు. 'ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్లు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించింది. మరిన్ని వివరాలను మేం సేకరించి పాలకులకు అందిస్తాం. దీంతోపాటు అమెరికా ప్రజలకు కూడా తెలియజేస్తాం. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తాం' అని సిఐఎ పేర్కొంది.

మరోవైపు బుధవారం ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ కూడా అణు కేంద్రాలు దెబ్బతిన్న విషయాన్ని అంగీకరించారు. కాకపోతే.. పూర్తి వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. అమెరికాతోపాటు ఇజ్రాయెల్ కూడా పదేపదే దాడులు చేయడంతో తీవ్రంగా విధ్వంసం జరిగిందన్నారు. మరోవైపు న్యూయార్క్ టైమ్స్, సిఎన్ఎన్ మాత్రం పెంటగాన్ నివేదికను ఉటంకిస్తూ.. అమెరికా దాడులు ఇరాన్ అణుకేంద్రాలపై పెద్దగా ప్రభావం చూపలేదని పేర్కొన్నాయి. దీనికితోడు టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే పూర్తిస్థాయిలో యురేనియం శుద్ధి చేపట్టే అవకాశం ఉందని వెల్లడించాయి,



# ఇజ్రాయెల్‌పై విజయం మాదే


### ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వెల్లడి

**టెహ్రాన్,జూన్ 26:** ఇజ్రాయెల్‌పై ఇరాన్ విజయం సాధించిందని, అమెరికాను కూడా చావుదెబ్బ తీశామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌ను నేరుగా ప్రస్తావించకుండా, "మోసపూరిత జియోనిస్ట్ పాలన" అంటూ సంబోధించారు. ఎంత గందరగోళం సృష్టించినా, ఎన్ని ప్రకటనలు చేసినా, జియోనిస్ట్ పాలన ఆచరణాత్మకంగా ఇస్లామిక్ రిపబ్లిక్ దెబ్బలకు చిత్తయి, నలిగిపోయిందని ఖమేనీ ఒక పోస్టులో పేర్కొన్నారు. దేశ ప్రజలకు ఈ విజయం పట్ల అభినందనలు అంటూ పోస్టుచేశారు. ఆ వెంటనే అమెరికాను లక్ష్యంగా చేసుకుని మరో పోస్ట్ చేశారు."మన ప్రియమైన ఇరాన్ అమెరికాప్రభుత్వంపై సాధించిన విజయానికి నా అభినందనలు. జియోనిస్ట్ పాలన పూర్తిగా నాశనమవుతుందని భావించిన అమెరికా ప్రభుత్వం, దానిని కాపాడేందుకే నేరుగా యుద్ధంలోకి దిగింది. కానీ ఏమీ సాధించలేకపోయింది" అని ఖమేనీ అన్నారు. గల్ఫ్‌లో మోహరించిన అమెరికా దళాలపై ఇరాన్ ప్రతీకార దాడిని కూడా ఖమేనీ ప్రస్తావించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికా చెంప చెళ్లుమనిపించింది. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది" అని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను ఇస్లామిక్ రిపబ్లిక్ చేరుకోగలగడం, అవసరమని భావించినప్పుడల్లా చర్యలు తీసుకోగలగడం ఒక ముఖ్యమైన విషయం.

# 15 యేళ్ల కాపురం తర్వాత ప్రియుడితో వివాహంచేసిన భర్త!

**కాన్పూర్,జూన్ 26:** పదిహేనేళ్ల కాపురంచేసి యుక్తవయసు పిల్లలు ఉన్నతర్వాత భార్యకు ఉన్న అక్రమసంబంధం తెలుసుకున్న భర్త ప్రియుడితో వివాహం జరిపించిన సంఘటన కాన్పూర్ సమీపగ్రామంలో జరిగింది. భగ్గనివాడ గ్రామ పెద్ద జై చంద్ తెలిపిన ప్రకారం, యోగేష్ తివారీ (40) అనే దినసరి కూలీకి, ఔరంగాపూర్ సంభికి చెందిన కృపా శంకర్ మిశ్రా కుమార్తె సోని (30)తో 2010లో వివాహమైంది. వీరికి 12 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే, కన్నౌజ్‌కు చెందిన వికాస్ ద్వివేది (35) అనే వ్యక్తితో సోనికి కొంతకాలంగా వివాహేతర సంబంధంకొనసాగుతోంది. ఈవిషయంపై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల సోని తన పుట్టింటికి వెళ్లి, సోమవారం తిరిగి భర్త ఇంటికి వచ్చింది. అదే రోజు వికాస్ కూడా వారి గ్రామానికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగామారింది. వికాస్‌ను గమనించిన యోగేష్, వెంటనే 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. మొదట వికాస్ అక్కడి నుంచి పారిపోయినప్పటికీ, యోగేష్ తన భార్య ఇష్టాన్ని గుర్తించి, వికాస్‌ను తిరిగి రమ్మని కోరాడు. అనంతరం, గ్రామ పెద్దల సమక్షంలో ఒక పంచాయితీ నిర్వహించారు. ఈ పంచాయితీలో, సోని తన కొత్త వివాహానికి లిఖిత పూర్వకంగాఅంగీకారం తెలుపుతూ, యోగేష్‌తో ఉన్న 15 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలికింది. దీంతో, యోగేష్ స్వయంగా తిస్తి పోలీస్ పోస్ట్ సమీపంలోని ఒక ఆలయంలో సోని, వికాస్‌ల వివాహాన్ని పోలీసు అధికారులు మరియు గ్రామస్థుల సమక్షంలో జరిపించాడు.

# అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం బ్లాక్‌బాక్స్, వాయిస్‌రికార్డర్ డేటా డౌన్‌లోడ్!



**న్యూఢిల్లీ,జూన్ 26:** అహ్మదాబాద్‌లో ఇటీవల చోటు చేసుకున్న విమాన ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తులో కీలక పురోగతి లభించింది. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి చెందిన బ్లాక్‌బాక్స్‌లలోని సమాచారాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విజయవంతంగా డౌన్‌లోడ్ చేసింది. ఈ విషయాన్ని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. ఈ డేటా విశ్లేషణ ద్వారా ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయడానికి వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిన విషయం తెలిసిందే.

ఈ దుర్ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికులు, సిబ్బందిలో ఒక్కరు మినహా మిగిలిన 241 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానం ఒక మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో అక్కడ కూడా పలువురు మరణించారు. గుజరాత్ ప్రభుత్వ లెక్కల ప్రకారం, ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 270 దాటింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు జూన్ 13న ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అదేరోజున ప్రమాద స్థలంలో విమానం యొక్క పైకప్పు భాగంలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డేటారికార్డర్ (ఎఫ్‌డిఆర్)లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, ఈ బ్లాక్‌బాక్స్‌లను అత్యంత భద్రత నడుమ ఢిల్లీలోని ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. పౌర విమానయాన శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జూన్ 24 నుంచి ఏఏఐబీ సాంకేతిక బృందం బ్లాక్‌బాక్స్‌ల నుంచి డేటాను వెలికితీసే ప్రక్రియను ప్రారంభించింది. "విమానం ముందు భాగంలో ఉండే బ్లాక్‌బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్ (సీపీఎం)ను సురక్షితంగా వేరు చేశాం.

జూన్ 25న మెమొరీ మాడ్యూల్‌ను విజయవంతంగా యాక్సెస్ చేసి, అందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్‌లో డౌన్‌లోడ్ చేయడం జరిగిందని మంత్రిత్వ శాఖ వివరించింది. ప్రస్తుతం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్‌లలోని సమాచారం విశ్లేషణ కొనసాగుతోందని, ఈ ప్రక్రియ పూర్తయితే ప్రమాద సమయంలో అసలేం జరిగిందో స్పష్టంగా తెలుస్తుందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు ఈ విశ్లేషణ ఎంతగానో దోహదపడుతుందని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని పౌర విమానయానశాఖ వెల్లడించింది.

# ఇరాన్‌పై దాడులపట్ల సోనియా తీవ్రనిరసన

**న్యూఢిల్లీ,జూన్ 26:** ఇరాన్‌పై అమెరికా జరిపిన దాడుల పట్ల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ భూభాగంపై జరిగిన ఈ బాంబు దాడులను, ప్రణాళికాబద్ధమైన హత్యలను భారత జాతీయ కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని ఆమె స్పష్టం చేశారు. అమెరికా దాడులు యుద్ధాన్ని మరింత రెచ్చగొట్టే ప్రమాదం ఉందని సోనియా గాంధీ హెచ్చరించారు. ఇటీవల గాజాలో ఇజ్రాయెల్ తీసుకున్న అమానవీయ చర్యలతో ఈ సైనిక చర్యను పోలుస్తూ, అక్కడ అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకున్నట్లే, ఇరాన్‌లోని ఈ దాడి కూడా సాధారణ ప్రజల జీవితాలను, ప్రాంతీయ స్థిరత్వాన్ని ప్రమాదంలో పడేస్తోందని ఆమె అన్నారు.

ఇటువంటి హింసా త్మక చర్యలు మానవత్వానికి వ్యతిరేకం కావడమే కాకుండా, ప్రపంచ శాంతి కోసం జరుగుతున్న ప్రయత్నాలనుకూడా బలహీనపరుస్తాయని కాంగ్రెస్ నాయకురాలు నొక్కిచెప్పారు. అంతకు ముందు, సోనియా గాంధీ ఆంగ్ల దినపత్రికలో ఇరాన్‌పై దాడులను ఖండిస్తూ ఒక వ్యాసం రాశారు. తనవ్యాసంలో ఆమె అమెరికా, ఇజ్రాయెల్ విధానాలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. ఇజ్రాయెల్ స్వయంగా అణ్వాయుధ శక్తిగా ఉన్నప్పుడు, అణ్వాయుధాలు లేని ఇరాన్‌ను నిరంతరం లక్ష్యంగా చేసుకోవడానికి నైతిక ప్రాతిపదిక ఏమిటని ఆమె ప్రశ్నించారు.



ఇది ఇజ్రాయెల్ ద్వంద్వ ప్రమాణం అని ఆమె పేర్కొన్నారు. ఇటువంటి చర్య ప్రాంతీయ శాంతికి ప్రమాదం కలిగించడమే కాకుండా, అంతర్జాతీయ విశ్వాసం, సమతుల్యతను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని సోనియా గాంధీ అన్నారు. భారత్ మౌనం ప్రమాదకరం ట్రంప్ యూటర్న్ నిరాశపరిచింద న్నారు. ఇరాన్ ఏళ్లుగా భారతదేశానికి విశ్వస నీయమైన, చారిత్రక మిత్రదేశమని, అటువంటి సమయంలో భారత దేశ మౌనం ఆందోళన, బాధ రెండింటికీ కారణమని సోనియా గాంధీ తన వ్యాసంలో స్పష్టంగా రాశారు. గాజాలో జరిగిన విధ్వంసం పైనా, ఇప్పుడు ఇరాన్‌లో జరుగుతున్న దాని పైనా భారతదేశం బాధ్యతాయుతమైన, స్పష్టమైన, ధైర్యమైన గొంతుతో మాట్లాడాలని ఆమె అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై కూడా ఆమె తీవ్రమైన వ్యాఖ్య చేశారు.

ట్రంప్ స్వయంగా అమెరికా అంతులేని యుద్ధాలు, సైనికపారిశ్రామిక లాబీని విమర్శించే వారని, కానీ ఇప్పుడు ఆయనా అదే మార్గంలో వెళ్తున్నారని రాశారు. ఇరాక్‌పై దాడి తప్పుడు ఆరోపణల ఆధారంగా జరిగిందని, అక్కడ సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయని చెప్పారని, అవి ఎన్నడూ కనుగొన బడలేదని ట్రంప్ స్వయంగా చాలాసార్లు చెప్పిన విషయాన్ని కూడా ఆమె గుర్తుచేశారు. ఇటువంటి హింసాత్మక చర్యలు ప్రపంచ శాంతి స్థాపన ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని కాంగ్రెస్ నాయకురాలు ఉద్ఘాటించారు.

# తుల్‌బుల్ నేవిగేషన్‌ప్రాజెక్టుతో మరిన్ని సింధుజలాలు!



**న్యూఢిల్లీ,జూన్ 26:** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, పాకిస్థాన్‌తో సంబంధాలు క్షీణిస్తున్న తరుణంలో సింధూ జలాల ఒప్పందంపై భారత్ పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి, పశ్చిమంగా ప్రవహించే నదుల నీటిని మరింత సమర్థంగా వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల పాకిస్థాన్‌కు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ తయారీ పనులు జరుగుతున్నాయని, ఏడాదిలోగా ఇది పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జీలం నదిపై (ఉలర్‌సరస్సు వద్ద) నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే నీటి రవాణాకు, నిల్వకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. పశ్చిమ దిశగా ప్రవహించే సింధు, జీలం, చీనాబ్ నదుల జలాల్లో భారత్‌కు ఉన్న వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. వీటిలో భాగంగా, ఈ నదుల్లో ఒకదాని నుంచి కొంత నీటిని పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు మళ్లించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. భారత్, పాకిస్థాన్ మధ్య 1960లో కుదిరిన సింధూ జలాల ఒప్పందం ప్రకారం, పశ్చిమంగా ప్రవహించే సింధు, దాని ఉపనదులైన చీనాబ్, జీలం నదులపై భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు మాత్రమే ఉన్నాయి.

ఈ నదీ వ్యవస్థలోని మొత్తం నీటిలో దాదాపు 20 శాతం భారత్, 80 శాతం పాకిస్థాన్ వినియోగించుకునేలా ఒప్పందం జరిగింది. అయితే, ఈ నదులపై భారత్‌కు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే సామర్థ్యం తక్కువగా ఉండటం ఒక సవాలుగా మారిందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో అధికంగా వచ్చే నీటిని నిల్వ చేసుకోలేకపోవడం వల్ల ఆ నీరు దిగువన ఉన్న పాకిస్థాన్‌కు తరలిపోతోందని వారు పేర్కొన్నారు. గతంలో, ఈ ఒప్పందం అమలు వల్ల వరదల సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, ప్రస్తుతం రిజర్వాయర్ల నిర్వహణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆ అధికారి వివరించారు. పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, కిషన్‌గంగ జల విద్యుత్ ప్రాజెక్టును భారత్ విజయవంతంగా పూర్తి చేసింది. అదేవిధంగా, రాట్లే జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# మెక్సికోలో కాల్పులు

### 12 మంది మృతి, మరో 20 మందికి గాయాలు

**మెక్సికో, జూన్ 26:** మెక్సికో గ్వానాజువాటో రాష్ట్రంలో ఇరాపుయాటో నగరంలో జరిగిన వేడుకల్లో ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 12 మంది మరణించారు. బాప్టిస్ట్ సెయింట్ జాన్ జన్మదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి అకస్మాత్తుగా కాల్పుల జరిపాడు. ఆ క్రమంలో ప్రజలంతా భయాందోళనతో పరుగులు తీశారు. అందుకు సంబంధించిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనలో మరో 20 మంది గాయపడ్డారని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఈ కాల్పుల ఘటనపై మెక్సికో అధ్యక్షురాలు క్లాడయా షీన్‌బామ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుందన్నారు. మరోవైపు.. ఇదే రాష్ట్రంలో శాన్‌బార్టోలో డి బెర్రియోస్‌లోని క్యాథలిక్ చర్చిలో గత నెలలో ఒక వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. గ్వానాజువాటో రాష్ట్రం.. మెక్సికోకు వాయువ్య ప్రాంతంలో ఉంది. దేశంలోని అత్యధిక నేరాలు జరిగే రాష్ట్రాల్లో ఇది ఒకటి.


ఈ రాష్ట్రంలో పలు గ్రూప్‌లు ఆధిపత్యం కోసం నిరంతరం ఘర్షణలకు దిగుతాయి. ఆ క్రమంలో ఈ యేడాది ఇప్పటివరకు 1,435 మంది మరణించారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే.. ఇది రెట్టింపు అని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# తీర్పుల సమయంలో స్వతంత్రంగా ఆలోచించాలి

### న్యాయమూర్తులకు సుప్రీం చీఫ్‌జస్టిస్ సూచనలు

**న్యూఢిల్లీ,జూన్ 26:** పౌరులహక్కులు, రాజ్యాంగ విలువలకు న్యాయమూర్తులు సంరక్షకులని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పేర్కొన్నారు. తీర్పు వెలువరించేటపుడు స్వతంత్రంగా ఆలోచించాలని న్యాయమూర్తులకు సూచించారు. తీర్పుపై ప్రజలు ఏమనుకుంటారనే విషయం పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు చేసే వ్యాఖ్యలు కోర్టు తీర్పులపై ప్రభావం చూపకూడదన్నారు. ఈమేరకు తన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతిలో నిన్న జరిగిన సన్మాన సభలో సిజెఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమని, ప్రజాస్వామ్యంలోని మూడు ప్రధాన అంగాలైన కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు రాజ్యాంగానికి లోబడే పనిచేస్తాయని జస్టిస్ బి.ఆర్. గవాయ్ స్పష్టం చేశారు. పార్లమెంట్‌కు రాజ్యాంగాన్ని సవరించే అధికారం ఉన్నప్పటికీ, దాని మౌలిక స్వరూపాన్ని మార్చలేదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఆయన గుర్తుచేశారు. చాలామందిపార్లమెంటే అత్యున్నతమైనదని భావిస్తారని, కానీ తన అభిప్రాయం ప్రకారం భారత రాజ్యాంగమే సర్వోన్నతమని జస్టిస్ గవాయ్ చెప్పారు. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలలో ఏది గొప్పదనే చర్చ ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. కానీ, ఈ మూడు వ్యవస్థలూ రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలోనే పనిచేస్తాయని ఆయన వివరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చినంత మాత్రాన ఒక న్యాయమూర్తి స్వతంత్రుడైపోరని సిజెఐ అభిప్రాయపడ్డారు. "పౌరుల హక్కులు, రాజ్యాంగ విలువలు, సూత్రాలకు తాము సంరక్షకులమనే విషయాన్ని న్యాయమూర్తులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. మాకు కేవలం అధికారమే కాదు, బాధ్యత కూడా ఉంది," అని ఆయన నొక్కి చెప్పారు. తాను ఎప్పుడూ తన తీర్పులు, పని ద్వారానే మాట్లాడతానని, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులకు కట్టుబడిఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. "బుల్డోజర్ చర్యలకు" వ్యతిరేకంగా తాను ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, నివాసం పొందే హక్కు అత్యున్నతమైనదని పేర్కొన్నారు. తాను ఆర్కిటెక్ట్ కావాలనుకున్నప్ప టికీ, తన తండ్రి కోరిక మేరకు న్యాయవాది వృత్తిని ఎంచుకున్నానని జస్టిస్ గవాయ్ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

# లక్షలాది శరణార్థి దరఖాస్తుల తిరస్కరణకు అమెరికా సిద్ధం



**వాష్టింగ్టన్, జూన్ 26:** వలసదారులపై మరింత కఠిన చర్యలకు ట్రంప్ కార్యవర్గం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా లక్షలాది శరణార్థి దరఖాస్తులను తిరస్కరించి వారిని వేగంగా దేశం బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అమెరి కాకు వచ్చి రక్షణ పొందే వలసదారులను అడ్డుకొనేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సిఎన్ఎస్ కథనంలో వెల్లడించింది. ఇప్పటికే వలసదారులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేయాలన్న లక్ష్యాలను చేరుకోలేక అమెరికా ఫెడరల్ అధికారులు ఒత్తిడితో ఉన్నారు. దీంతో మరింత మందిని డిపోర్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించి ఆశ్రయం కోసం దరఖాస్తుల చేసుకొన్న వారిని ఈ కొత్త నిబంధనల్లో లక్ష్యంగా చేసుకొనే అవకాశాలున్నాయి. వారి కేసులను త్వరగా మూసివేసి.. బహిష్కరణ పరిధిలోకి తీసుకురావాలన్నది ప్రణాళికంగా సిఎన్ఎస్ పేర్కొంది. దీంతో లక్షల మంది శరణార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత పదేళ్లలో అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రెంట్ సర్వీసెస్, యుఎస్‌సిఐఎస్‌ను ఆశ్రయం కోరిన వారిలో కనీసం 25శాతం అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారు. ఈ విషయాన్ని 2023 ఫెడరల్ రిపోర్టు వెల్లడించింది. స్వదేశాల్లో అణచివేత, హింసకు గురైనవారు అమెరికా చట్టప్రకారం ఆశ్రయం కోరవచ్చు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా దక్షిణ సరిహద్దుల నుంచి వచ్చి ఆశ్రయం కోరేవారిని పూర్తిగా అడ్డుకున్నారు. ప్రస్తుతం అమెరికా ఏజెన్సీల వద్ద 14.5 లక్షల మంది శరణార్థుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

27-6Pg6exHMNWJQE.qxd:27-6Pg6exHMNWJQE.qxd 01/01/01 8:51 AM Page 1



# జగన్ పైశాచికానందానికి ఆరేళ్లు : హోం మంత్రి అనిత

## - పరామర్శల పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారు



**విజయవాడ,జూన్ 26,ప్రభాతవాక్తప్రతినిధి:** ఐదేళ్ళ పాటు విధ్వంసం,నిర్భంధాలు,అక్రమ కేసులు, అణచివేతలు, కూల్చివేతలే ఎజెండాగా ఎమర్జెన్సీని తలపించేలా పాలించిన వైకాపా అధ్యక్షుడు జగన్ ఉండవల్లి లోని ప్రజావేదికను కూల్చేసి పైశాచిక ఆనందం పొంది జూన్ 25కి సరిగ్గా ఆరేళ్ళయ్యిందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడ ఇవ్వకుండా,పులివెందుల ఎంఎల్ఏ స్థానానికే పరిమితం చేసినా అదే విధ్వంసక పంథాను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. 'ఇక్కడున్నది కూటమి ప్రభుత్వం.మీ ఆటలు సాగవ్.తగిన మూల్యం చెల్లించక తప్పదు.వైకాపా మూకలు జాగ్రత్తగా ఉంటే మంచిది'అని హెచ్చరించారు. ఆమె బుధవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రూ.8 కోట్లతో నిర్మించిన ప్రజావేదికలో 2014-19 మధ్య అనేక సమావేశాలు,కార్యక్రమాలు జరిగాయి. జగన్ 2019 జూన్ 25న అక్కడ కలెక్టర్ల సదస్సు పెట్టి,సాయంత్రానికి కూల్చేయించి పైశాచిక ఆనందం పొందారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళూ ృ అమరావతి విధ్వంసానికి పోలవరాన్ని నాశనం చేసేందుకు కంకణం కట్టుకుని, విద్వేషానికి,విధ్వంసాలకు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరించారే తప్ప,ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధిని పట్టించుకోలేదు'అని ఆమె ఆరోపించారు.'బెట్టింగ్‌లలో డబ్బులు కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తికి సంవత్సరం తర్వాత విగ్రహం ప్రారంభించేందుకు వెళుతూ జగన్ ముగ్గురి ప్రాణాలు తీశారు. అది సన్నటి దారి అని, ఎక్కువ జనాన్ని సమీకరిస్తే ఇబ్బంది ఎదురవుతుందని రక్షణ కల్పించలేమని పోలీసులు చెప్పినా పెడచెవిన పెట్టారు'అని ధ్వజమెత్తారు. అనిత తిట్లశాఖ మంత్రిగా మారారంటూ వైకాపా నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యల గురించి విలేకర్లు ప్రస్తావించగా...ఆయన గతంలో 'నోటీ'పారుదల శాఖ మంత్రిగా పేరుపడ్డారు. ఆయన గురించి మాట్లాడి నా స్థాయిని తగ్గించుకోలేను'అని అనిత బదులిచ్చారు. ప్రజల్ని ఐదేళ్ళు పీడించి ఇప్పుడు నీతి కబుర్లు చెబుతున్నారన్నారు.ఐదేళ్ళ పాలనలో జగన్ బయటకు వస్తే పరదాలు కట్టేసి,చెట్లు నరికేసి, షాపులు మూసేసి...టిడిపి నాయకుల్ని గృహ నిర్బంధంలో పెట్టేసి నానా అరాచకం సృష్టించారు. అప్పటి మంత్రులు,ఎంఎల్ఏలతో ప్రతిపక్ష నాయకుల్ని బూతులు తిట్టించారు. అసెంబ్లీ సాక్షిగా అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుతో కన్నీరు పెట్టాంచారు. అలాంటి జగన్,ఆయన మనుషులు ఇప్పుడు బయటకొచ్చి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది' అని అనిత మండిపడ్డారు. పరామర్శల పేరుతో జగన్ వైకాపా మూకల్ని రోడ్డు పైకి తెచ్చి బలప్రదర్శన, విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు.

# నకిలీ ఇ స్టాంపుల కుంభకోణంలో వైఎస్సార్సీ కుట్ర

## కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధ్వజం

**అనంతపురం, జూన్ 26, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నకిలీ ఈ స్టాంప్స్ సృష్టించిన స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏజెన్సీని రాష్ట్రస్థాయిలో కర్నూలుకు చెందిన వైసిపి వారు తీసుకున్నారు అని , ఈ కుట్ర వెనుక వైసీపీ వారి భాగస్వామ్యం కూడా ఉంటుందని కళ్యాణ్ దుర్గం శాసనసభ్యుడుఅమిలినేని సురేంద్రబాబు అనుమాన వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన మాజీ ఎంపీ తలారి రంగయ్య కు పది రోజులు ముందే నకిలీ ఈస్ట్ స్టాంపులు వ్యవహారం తెలిసిందంటే ఈ కుట్ర వెనక ఆయన హస్తం కూడా ఉంటుందని, కళ్యాణ్ దుర్గం లో అభివృద్ధిని అడ్డుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ కు వైసీపీ దిగుతోందని, నకిలీ ఈ స్టాంపుల విషయంలో ఏ లాంటి విచారం చేపట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఆయన వెల్లడించారు. ఎస్సార్ ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ 26 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తోందని అనవసరంగా బురదజల్లే ప్రయత్నం వైసీపీ చేస్తోందని ఆయన విమర్శించారు. గురువారం అనంతపురం రహదారులు భవనాలు శాఖ అతిథి గృహంలో కళ్యాణదుర్గం టీడీపీ సీనియర్ నాయకులు రామ్మోహన్ చౌదరి, మల్లికార్జునప్ప తదితరుల తో కలసి ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ స్టాంపుల ఆరోపణలపై ఎమ్మెల్యే సురేంద్రబాబు మాటల్లోనే.. ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదు. ఈ స్టాంప్ కుంభకోణంలో భాగస్వాములు అందరిని బయటకు తీయిస్తాం. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకుని వ్యాపారాలు చేయలేదు. వ్యాపారాలు చేసిన తరువాత ప్రజాసేవ చేస్తూ రాజకీయాల్లోకి వచ్చాను ముందుగా ఈ విషయటంలో ఆరోపణలు చేస్తున్న ప్రతి ఒక్కరు గమనించాలి. స్టాంపులు స్కామ్ జరిగిందన్నది నిజం.. ఈ విషయాన్ని ఎస్సార్సీ కంపెనీ బయట పెట్టె వరకు ఎవరికీ తెలియదు. మేము బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నాం కాబట్టి.. మాలో ఎలాంటి తప్పు లేదు కాబట్టి దీన్ని మేము బయటపెట్టాము.. మేము తప్పు చేసుంటే ఎందుకు దీని గురించి ఇంత ఓపెన్ గా మాట్లాడుతాము.యర్రప్ప అలియాస్ మీ సేవా బాబు గవర్నర్, లోకేష్, నాతో ఫొటోలు దిగటం తప్పు అయితే.. మే నాయకుడు జగన్ పై 11 ఈడీ కేసులు ఉండి 16 నెలలు జైల్లో ఉండి వచ్చి ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులతో ఫొటోలు దిగుతాడు తప్పు కాదా, నువ్వెళ్ళి ఆయనతో ఫొటోలు దిగితావ్ మరి తప్పు కాదా.యర్రప్ప మా పార్టీ కార్యకర్త కాదని మేము ఎక్కడ చెప్పలేదు.. మా పార్టీ కార్యకర్త కాబట్టే ఫొటో దిగాడు.

## కెజిబివి ఉపాధ్యాయినులకు షోకాజ్ నోటీసులు!

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గత నాలుగేళ్ల నుంచి పదోతరగతి సహా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల రాష్ట్ర సరాసరి కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించడానికి కారణమైన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయినులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశించింది. ఈ జాబితాలో 99 మంది పీజీటీలు, 166 మంది సీఆర్టీలు ఉన్నారు. వీరికి షోకాజ్ నోటీసులిచ్చి, ఫలితాల్లో వెనుకబాటుకు కారణాలతో వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని మెరుగుదలకు తీసుకున్న చర్యలు తెలియజేయాలని కేజీబీవీ అడగనుంది.



తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీం బేగ్‌కు ఉత్తమ కార్యకర్త అవార్డును బహూకరిస్తున్న దృశ్యం

## తెలుగు యువత ఉపాధ్యక్షుడు డాక్టర్ హసీం బేగ్‌కు 'ఉత్తమ కార్యకర్త' అవార్డు బహూకరించిన మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్త** ముఖ్య నాయకులు,కార్యకర్తలతో టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి పార్టీ సభ్యత్వాల్లో తనకంటూ రాష్ట్ర స్థాయిలో ఓ బలమైన ముద్ర వేసిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్‌కు 'ఉత్తమ కార్యకర్త' అవార్డును నారా లోకేష్ తన చేతుల మీదుగా అందించారు. బందరులో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్,ఎపి జోనల్-3 కో-ఆర్డినేటర్, మాజీ ఎంఎల్‌సీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## 5న కంప్యూటర్ నైపుణ్య పరీక్ష

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రూప్-2 ఎనలిస్టు గ్రేడు - 2 పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ను అనుసరించి సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థులకు జులై 5న కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహించనున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, అనంతపురంలో పరీక్ష కేంద్రాలు ఉంటాయని ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు గురువారం ఒక్కప్రకటనలో తెలిపారు.

## పికెడి టు ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి :మంత్రి సవిత

**పెనుకొండ, జూన్ 26 ప్రభాతవార్త** మాదకద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ చేనేత జౌలిశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. గురువారం నాడు ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజానికి చెడు చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. అందరూ కలసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగ పని చేయాలంటు ప్రతిగ్న చేయించారు,మాదక ద్రవ్యాలు వాడిన వారు తన అమ్మ,సోదరి,సహాతురు అని చూడకుండా ఎన్నో అఘాయిత్యాలకు పాల్పడ్డారని, గత ప్రభుత్వంలో గంజాయి పంటలు వేసి,గంజాయిని పండించి యువత భవిషత్తుని నిర్వీర్యం చేసారని,ఇప్పటి ప్రభుత్వంలో గంజాయిని కట్టడి చేసామని,గత ప్రభుత్వంలో 11 వేల ఎకరాల్లో గంజాయి పండించిందన్నారు, మాదక ద్రవ్యాలు వాడిన, వాటితో వ్యాపారాలు చేసిన ఎంతటి వారినైనా వారి పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.గంజాయి గురించి తెలీయక పంటలు పెట్టిన వారికి ఉపాధి చూపించి,సంఘ విద్రోహమైన మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళకుండా వారికి భవిత చూపిన ఘనత కూటమి ప్రభుత్వందని ఆమె అన్నారు. ర్యాలీకి డిఎస్పి నర్సింగప్ప సీఐ రాఘవన్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ప్రసాద్ పట్టణ కన్వీనర్ శ్రీరామ్ యాదవ్ తెలుగుదేశం నాయకులు తివేంద్ర సోమశేఖర్ తహసిల్దార్ శ్రీధర్ పలు మండలాల నుండి విద్యార్థిని విద్యార్థులు పాఠశాలల సిబ్బంది ప్రభుత్వ శాఖల శాఖల అధికారులు మహిళలు, మహిళా సంఘాల నాయకులు ,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలి :ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్



**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఎపిసిపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సిపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరాపై సచివాలయం నుంచి వర్చువల్‌గా విజయానంద్ గురువారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయాలు తలెత్తితే తక్షణం స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల కంటే ఎత్తుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు, జరుగుతున్నాయని తెలిపారు. స్తంభాల కంటే ఎత్తు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకునేందుకు, విద్యుత్ అంతరాయాలు అరికట్టేందుకు ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి గ్యాంగ్‌లను ఏర్పాటు చేసి జంపర్లు,హంగింగ్ వైర్లు, లో వోల్టేజ్ సమస్యలను వెంటనే గుర్తించి తక్షణం పరిష్కరించి నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను గుర్తించేందుకు డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్‌శాఖపై ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేందుకు విద్యుత్ సంస్థలు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు కూడా తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం తలెత్తితే ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతు పనులు జరిగే సందర్భంలో విద్యుత్‌శాఖతో పాటు వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు.

## రూ.9,000 కోట్ల అప్పు కోసం 1,91,000 కోట్ల గనులు తాకట్టు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు :మాజీ సిఎం జగన్

విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అప్పులు చేయడంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఏపీఎండీసీ ద్వారా మళ్లీ నిన్న కూడా బాండ్లు జారీచేశారు. 5526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారని తెలిపారు. ఈ డబ్బుంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి? అని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు. చంద్రబాబు సర్కార్ అడ్డగోలుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు. రూ.5526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారు. గతంలోనే ఈ రాజ్యాంగ ఉల్లంఘనపై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.అయినప్పటికి ఏపీఎండీసీ ద్వారా మళ్లీ అప్పులు చేశారు. రానున్న రోజుల్లో మళ్ళీ మళ్లీ ఏపీఎండీసీ ద్వారా అప్పులు చేయటానికి సిద్ధమయ్యారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రైవేటు వ్యక్తులు నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు డ్రా చేయటానికి వీల్లేదు. కానీ చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పార్టీలే నేరుగా నిధులు డ్రా చేసుకునేలా అవకాశం కల్పించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203,204,293(1) నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. రూ.9000 కోట్ల అప్పుల కోసం ఏపీఎండీసీకి చెందిన రూ.1,91,000 కోట్ల విలువైన గనులను తాకట్టు పెట్టడం దారుణం,అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావటం ద్వారా ఎపిఎండీసీ పై సంవత్సరానికి రూ.235 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ డబ్బుంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి.



# దుర్గమ్మకు ఆలయ ఇఒ తొలి సారె

## - ఆషాఢం సారె సమర్పించిన హోంమంత్రి

**ఇంద్రకీలాద్రి, జూన్ 26, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆషాడమాసం తొలిరోజు గురువారం ఆలయ ఈవో వికె శీనా నాయక్ దంపతులు తొలి సారె అందించారు. అలాగే రాష్ట్ర హోమ్‌మంత్రి వి అనిత ఆషాడం సారె సమర్పణకు రాగా, ఆలయ ఈవో వికె శీనా నాయక్ మంగళవాయిధ్యములు, వేదమంత్రాల నడుమ స్వాగతించగా హోమ్ మంత్రి అనిత ఆషాడం సారె సమర్పించారు. వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందించారు. ఈ తొలి ఆషాడం సారె సమర్పణలో ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్ రంగారావు, ఏఈవో'లు బి వెంకటరెడ్డి, ఎన్ రమేష్‌బాబు, ఎం తిరుమలరావు, శ్రీనివాస్, కె. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కనకదుర్గమ్మకు సారె సమర్పించే భక్త బృందాలవారు ముందస్తుగా తమ వివరాలు తెలిపి నమోదు చేసుకోవాలని వివరించారు.

**- మహిమాన్విత వారాహి నవరాత్రులు తొలిరోజు :** దుర్గమ్మవారి ఆలయంలో గురువారం నుండి జూలై 04 వరకు నిర్వహించనున్న వారాహీ నవరాత్రి వేడుకలు తొలిరోజున ఆలయ ఈవో వికె శీనా నాయక్ దంపతులు పూజాధికాలలో పాల్గొన్నారు.

**- ధర్మపదంలో నృత్యోత్సవం :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో మహారాజ గోపురంలో ధర్మపదం వేదికపై జగన్మాత సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ అభినయ కూచిపూడి అకాడమి విద్యార్థులు భక్తి శ్రద్దలతో శ్రీ కనకదుర్గ అమ్మవారికి నిర్వహించిన నృత్యకళార్చనలో నృత్యాచార్యాణి ఊర్వశి సతీష్ ఆధ్వర్యంలో 20మంది విద్యార్థులు పలు భక్తి కీర్తనలకు నర్తించి, దుర్గమ్మకు తమ నృత్య నీరాజనాలు అందచేశారు.

## గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరగడం దురదృష్టకరం: ఈగిల్ విభాగాధిపతి ఆకె రవికృష్ణ

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:**యువత బంగారు భవిష్యత్తు చేజేతులా నాశనం అయ్యే దిశలో గంజాయి, డ్రగ్స్ వినియోగం నానాటికీ పెరిగిపోతుందని ఈగల్ విభాగాధిపతి,.ఐపిఎస్ అధికారి ఆకె రవికృష్ణమాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా ఆకే రవికృష్ణతో ప్రత్యేక ప్రకటన ద్వారా పలు సూచనలు చేశారు. ప్రధానంగా యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం వాటిని నిర్మూలించేందుకు డ్రగ్స్ వద్దు బ్రోఖీ లాంటి ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని మార్చేందుకు రూపొందించినఈగల్‌ఖి వ్యవస్థ మెరుగైన ఫలితాలనిస్తోందని ఆకే రవికృష్ణ అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇదే నేరం ఎక్కువ సార్లు చేస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్(పిట్ ఎన్డీపీఎస్) చట్టాన్ని వాడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక క్లబ్ (ఈగల్)లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో క్లబ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిపి మొత్తం 10 మంది సభ్యులుగా ఉండాలి. అయితే ఈ క్లబ్ ల ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ఈ రోజుకీ చాలా విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేయలేదు. రాష్ట్రంలో రహస్యంగా అటవి ప్రాంతంలో మత్తు మొక్కలు నాటుకునేలా చేశారు. ప్రజల ప్రాణాలను తోడేసే శాంతిభద్రతలతో చెలగాటమాడే గంజాయి భూతానికి గతంలో ఎంతగానో స్వేచ్ఛనిచ్చారనే అభియోగాలున్నారు. రాజకకీయాలకు చెందిన కొందరు మత్తు పదార్థాల వ్యాపారులుగా మారారు. ఫలితంగా బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లలెందరో జీవచ్ఛవాలయ్యారు. కుటుంబాలకు ఆసరా కావాల్సిన యువత నేరగాళ్లుగా మారారు. ఈ రోజు(గురువారం) అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం.

ఈ సందర్భంగా యువతలో మార్పు తెచ్చేందుకు రాష్ట్రంలో పలు చోట్ల పోలీసులు అవగాహన ర్యాలీలు నిర్వహి స్తున్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు బాని సలైన పిల్లల్లో మార్పు తెచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## ద్రవిడ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్, ఎపిఆర్‌ఒ నివాసాల్లో చోరీ

### - బంగారం, వెండి.. నగదు దొంగిలించిన దుండగులు !!



గుండ్లసాగరం వద్ద చోరీ జరిగిన ద్రవిడ వర్సిటీ విసి నివాసం

**కుప్పం, జూన్ 26 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలంలో గుర్తు తెలియని దొంగలు మూడు వేర్వేరు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. ఏకంగా ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతికి చెందిన నివాస ం, ద్రవిడ వర్సిటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి, మరో ఉపాధ్యాయుల ఇంట్లో చోరీలకు పాల్పడ్డారు. దీంతో బాధితులు గుడుపల్లె పోలీసులను ఆశ్రయించారు. ఈసంఘటనకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామంలో ద్రవిడ వర్సిటీలో ఎపిఆర్‌ఒగా పనిచేస్తున్న నరేష్ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని ఇంటిపైభాగంలో ఉన్న మరో ఇంటిని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామి అద్దెకు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వీరి నివాసాల్లో ఎవరూ లేని విషయం గమనించిన గుర్తు తెలియని దుండగులు వారి ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. అదే విధంగా నలగాంపల్లి గ్రామం వద్ద ఓ భార్యభర్త ఉపాధ్యాయులుగా పనిచేస్తూ అద్దె ఇంట్లో ఉన్నారు. వీరి నివాసానికి సైతం దొంగలు కన్నం వేశారు. ద్రవిడ వర్సిటీ విసి ఇంట్లో సుమారు 2లక్షల నగదు, ఎపిఆర్‌ఒ నరేష్ ఇంట్లో సుమారు 200గ్రాముల బంగారం, ఒకటిన్నర కిలోల వెండి, ఉపాధ్యాయుల ఇంట్లో దాదాపు 40గ్రాముల బంగారం, అర్ధకిలో వెండి పట్టుకెళ్లినట్లు బాధితులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న గుడుపల్లె పోలీసులు ద్రవిడ వర్సిటీ విసి నివాసం ఉన్న ఇంటిని, మరో ఇద్దరు బాధితుల ఇళ్లను పరిశీలించారు.

## మూలధన వ్యయానికి మరింత ప్రాధాన్యం : సిఎం చంద్రబాబు నాయుడు

### - ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి



**విజయవాడ, జూన్ 26,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఆర్థిక శాఖ స్థితిగతులు, రాబడులు, ఖర్చులపై సమీక్షించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల ఖర్చు, విడుదలపై సీఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. పింఛన్లతో సహా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతినెలా వెచ్చిస్తున్న ఖర్చుతో పాటు....రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన నిధులపై చర్చించారు. ఆయా కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధుల లభ్యతపై చర్చించారు. నాబార్డు నుంచి నిధులు సమీకరించి పంచాయతీ రాజ్ శాఖపై ఎక్కువ ఖర్చు చేయాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. కేంద్రం వివిధ కార్యక్రమాల కింది ఇచ్చే నిధులను మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని సీఎం అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు...సంపద సృష్టికి, రెవెన్యూ జనరేషన్‌కు కారణం అయ్యే మూలధన వ్యయం మరింత పెంచాలని..ఈ తరహా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు తీర్చామని అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ వెళ్తున్నామని సీఎం అన్నారు. సమస్యలు అధిగమించేలా కార్యాచరణ తయారు చేస్తున్నామని అలానే ప్రభుత్వ నిర్ణయాలను అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో అమలు చేయాలని తెలిపారు. కొత్త రోడ్లు చేశాం ఇంక పాడైన రోడ్లకు మరమ్మతులు చేశామని వచ్చే మూడేళ్లలో అమరావతిని ఒక స్థాయికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047ను మనం లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం వివరించారు. గతేడాదితో పోల్చితే రెవెన్యూ వసూళ్లు పెరగడం శుభసూచకమని సీఎం అన్నారు. జీఎస్టీ ఆదాయం కూడా క్రమంగా పెరగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నూతన మద్య విధానం అమలు తర్వాత రాష్ట్రానికి రూ.2432 కోట్ల మేర ఆదాయం పెరగనున్నట్టు తెలియజేశారు.

## గోదావరి పుష్కరాలకు 12 మంది మంత్రులతో కమిటీ

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి పుష్కరాలకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. 2027 లో జరిగే పుష్కరాల్ని సాఫీగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు వ్యూహాల రూపకల్పనకు 12 మంది మంత్రులతో ఉపసంఘాన్ని నియమించింది. మంత్రుల ఆనం రామనారాయణ రెడ్డి పి.నారాయణ పయ్యావుల కేశవ్ నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ కందుల దుర్గేష్ వాసంశెట్టి సుభాష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి , గొట్టిపాటి రవికుమార్ సత్యకుమార్ యాదవ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. దేవాదాయ శాఖ కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత ప్రభుత్వశాఖల కార్యదర్శులంతా మంత్రుల కమిటీకి సహకారం అందిస్తారు.

## ప్రవాస తెలుగు వ్యవహారాల సలహాదారుగా వేమూరి రవి

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రవాస తెలుగు వ్యవహారాల సలహాదారుగా వేమూరి రవికుమార్‌ను నియమిస్తూ ఏపీ ప్రభుత్వ సాధారణ పరిపాలనా విభాగం ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవాసుల సర్వీసులు పెట్టుబడుల వ్యవహారాలను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

## జూలై 6న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

**విజయవాడ జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కన్వీనర్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జులై 6న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఇప్పటికే అభ్యర్థులు కోరిని ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు విశ్వవిద్యాలయం సన్నాహాలు చేస్తోంది. పరీక్ష ప్రొవిజనల్ జవాబుపత్రాన్ని జులై 9న విడుదల చేయనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. అభ్యర్థులు పరీక్ష రోజున మధ్యాహ్నం 12.30 గంటల్లోనే పరీక్ష కేంద్రనాకి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

## భార్యాభర్తలు ఆత్మహతాయత్నం

### - భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

**బంగారుపాళ్యం, జూన్ 26 ప్రభాతవార్త:** ప్రతి రోజు మద్యం సేవించి ఘర్షణ దిగుతున్న భర్త నుండి మద్యం మాన్పించాలని ప్రయత్నంలో భార్యభర్తలు పురుగుల మందు సేవించారు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్త పరిస్థితి విషమంగా వుంది. చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలం జగమర్ల గ్రామంకు చెందిన ఎం.సుధాకర్ నలగాంపల్లి సమీపంలోని ఓ మామిడి తోటలో కుటుంబంతో కలిసి కాపలాదారుడిగా జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు వున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సుధాకర్ మద్యం సేవించి ఇంటికి వెళ్ళగా భార్య పల్లవి(23) ఈ విషయంపై భర్తతో వాగ్వివాదం చేసింది. ఆ సమయంలో ప్రక్కనే వున్న పురుగుల మందును భర్త సుధాకర్ సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఈ విషయంను గుర్తించిన పల్లవి భయపడి ఆ పురుగుల మందును తాను సేవించి ఆత్మహత్యకు పాల్పడంది. వీరిద్దరిని సత్వరం చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ భార్య పల్లవి మృతి చెందింది. మెరుగైన వైద్యం కోసం భర్త సుధాకర్‌కు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఇ-పాస్‌పోర్టులతో సులువుగా ఇమిగ్రేషన్ - రాష్ట్రమంతా గత నెలజారీచేసినవే..

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఇమిగ్రేషణ్ ప్రక్రియను సులభతరం చేసే ఈ-పాస్‌పోర్టుల జారీ మన రాష్ట్రం లోనూ అమల్లోకి వచ్చింది. తొలుత విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో ఆరంభించగా,గత నెల నుంచి విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో కూడ జారీ మొదలుపెట్టారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో మే 4 నుంచి ఈ-పాస్‌పోర్ట్స్ జారీ మొదలుపెట్టగా ఇప్పటికి 25,000 జారీ చేశారు. పాత పాస్‌పోర్టుదారులకు వాటికి కాలపరిమితి ఉన్నంతవరకు అవి మనుగడలో ఉంటాయి. రెన్యువల్ సమయంలో ఈ-పాస్‌పోర్ట్ జారీ చేస్తారు.

ఇప్పుడే పాత పాస్‌పోర్ట్ స్థానంలో ఈ-పాస్‌పోర్ట్ పొందాలనుకుంటే రీ ఇష్యూ కేటగిరిఈలో ధరఖాస్తు చేసుకోవాలి.స్లాట్ బుక్ చేసుకొని,వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయితే వారికి ఈ-పాస్‌పోర్టు ఇస్తారు.పాస్‌పోర్టు సేవా కార్యక్రమం(పీఎస్‌పీ) వెర్షన్ 2.0లో భాగంగా కేంద్రం ఈ పాస్‌పోర్టుల జారీ అమల్లోకి తెచ్చింది.

## ఉద్యోగులు, పెన్షనర్ల వైద్య బిల్లుల బకాయిలు రూ.180 కోట్లు మంజూరు

### 26,519 మందికి ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 26:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న వైద్య చికిత్సల ఖర్చుల బిల్లులను ప్రభుత్వం ఎట్టకేలకు క్లియర్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు చెందిన మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు 2023 మార్చి 4 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కొంత కాలంగా ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల మెడికల్ బిల్లుల చెల్లింపు కోసం రూ.180.38 కోట్లు విడుదల చేసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.ఆర్థిక ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులకు ప్రాధాన్యతనిస్తూ బిల్లులు చెల్లించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేరుకుపోయిన బకాయిలతో పాటు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఈ పెండింగ్ బకాయిలను విడుదల చేయడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించారు. ఈ చర్య ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

## ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల కన్సల్టెన్సీల కార్మిక దోపిడీని అరికట్టాలి

### ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రవేటు ఎలక్ట్రికల్ బస్సుల కన్సల్టెన్సీ అయిన జెబిఎం చేస్తున్న కార్మిక దోపిడీని అరికట్టాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. జెబిఎం ఎలక్ట్రికల్ బస్సుల కన్సల్టెన్సీలైన శ్రీ బాలాజీ సిల్‌కాన్‌కు చెందిన వారు జెబిఎం బస్సులపై పనిచేస్తున్న కార్మికుల జీతాల నుండి పిఎఫ్ డబ్బులు రికవరీ చేసుకొని 5 నెలలుగా ఆ డబ్బును పిఎఫ్‌లో జమ చేయకుండా స్వంతానికి వాడుకోవడం అన్యాయమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. వెంటనే ఆ డబ్బును వారి పిఎఫ్ ట్రస్ట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత 5 నెలల నుండి జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బంది జీతాల నుండి పిఎఫ్ పేరుతో నెలకు రూ. 3000 రూపాయలు కట్ చేసుకొని ఆట్టి డబ్బులను కార్మికుల పిఎఫ్ ఖాతాలో జమచేయక పోవడాన్ని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దీనిపై జెబిఎం యాజమాన్యం, ఆర్‌టిసి యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల పిఎఫ్ డబ్బులను కాజేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి వెంకన్న డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల డబ్బులను వెంటనే పిఎఫ్ ఖాతాలో జమ చేయించాలని.. లేకపోతే జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బందికి యూనియన్ అండగా నిలిచి వారి సమస్యల కోసం పోరాటం చేస్తామని ఈదురు వెంకన్న హెచ్చరించారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 26, ప్రభాతవార్త :** బొగ్గులకుంట, తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, ప్రస్తుత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిని మరోసారి సారస్వత పరిషత్తు అధ్యక్షుడుగా సర్వ సభ్యమండలి ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈమేరకు పరిషత్తు నియమావళిని అనుసరించి గురువారం విలేకరుల సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, ఐఎఎస్ విశ్రాంత అధికారి డా. కె.వి.రమణాచారి, ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డిలు ఉపాధ్యక్షులుగా, డా. జుర్రు చెన్నయ్య ప్రధాన కార్యదర్శిగా, మంత్రి రామారావు కోశాధికారి కొనసాగుతారని తెలిపారు. డా. మసన చెన్నప్ప, డా. సి.వసుంధర, ఆచార్య ఎస్వీ రామారావు, ఆచార్య ఎస్.ఆర్.వెంకటేశం, మోతుకూరి నరహరి, డా. డి.చంద్రశేఖర్‌రెడ్డి, డా. సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, రింగు రామమూర్తి, డా. కసిరెడ్డి వెంకటరెడ్డి, గిరిజా మనోహర్‌బాబు, డా. టి.గౌరీశంకర్, డా. అమ్మంగి వేణుగోపాల్. డా. సిల్మానాయక్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమిస్తున్నట్లు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రకటించారు. ఈ కార్యవర్గం 2030వరకు కొనసాగుతుందన్నారు.



ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

## రాష్ట్రంలో జరిగిన కుంభకోణాలపై సిబిఐ విచారణ జరపాలి

### మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** తెలంగాణలో జరిగిన కుంభకోణాలు సిబిఐతో దర్యాప్తు జరపాలని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులను సిబిఐతో దర్యాప్తు జరపాలన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అందుకే తెలంగాణ ప్రభుత్వ దర్యాప్తు తేలడం లేదన్నారు. కెసిఆర్ హయంలో జరిగిన కుంభకోణాలపై అసెంబ్లీకి రావాలని చర్చలకు రావాలని రేవంత్ పిలుస్తున్నారే తప్ప కెసిఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత 10 యేళ్ల కృష్ణ, గోదావరిపై ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందన్నారు. కృష్ణ, గోదావరి నీరు, నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతికత కెసిఆర్, హరీశ్‌రావుకు లేదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణ పరిధిని తెలంగాణ ప్రభుత్వం తక్కువ చేసి చూపుతున్నట్లు కనిపిస్తుందన్నారు. కేంద్రం కాళేశ్వరం అవినీతిపై సిబిఐ దర్యాప్తుకు ఆదే శిస్తుందని భావిస్తున్నానని అన్నారు. అవినీతి అంశాలపై నేరుగా సుమోటోగా సిబిఐ దర్యాప్తు చేసే పరిస్థితి లేదని, సిబిఐతో దర్యాప్తు చేయా లని రాహుల్‌గాంధీ, రేవంత్ డిమాండ్ చేశారు, కానీ ఇప్పుడు కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యారు కాబట్టే అవినీతి విచారణలు తేలడం లేదన్నారు. ఇందుకు విద్యుత్ కొనుగోళ్ల అవినీతి కేసు విచారణ నిదర్శనం అన్నారు.

# తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు బోనాలు ప్రతీక

### జగదాంబ మహంకాళి అమ్మవారికి తొలిబోనాన్ని, పట్టువస్త్రాలను సమర్పించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

### వైభవంగా ప్రారంభమైన గోల్కొండ బోనాలు



**హైదరాబాద్ (మెహదీపట్నం), జూన్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ బోనాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశాడమాస బోనాల ఉత్సవాలు గోల్కొండ కోట నుంచి ప్రారంభంవుతుండడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనల ఉత్సవాలు గురువారం ప్రారంభం కావడంతో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

లాల్ దర్వాజా ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన బంగారు బోనానికి మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి జోగిని నిషాక్రాంతికి ఎత్తారు.

లంగర్‌హౌస్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బారీ తొట్టెలకు మంత్రులతో పాటు రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షులు హనుమంత్‌రావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ మధు యాష్కీగౌడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...గోల్కొండ జగదాంబిక అమ్మవారి అనుగ్రహం మనపై ఉండాలని, కొన్ని వందల సంవత్సరాల నుండి జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారు చాలా మహిమగల తల్లి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ జంట నగరాల్లో నిర్వహించే బోనాల నిర్వహణకు రూ.20 కోట్ల నిధులను ముందుగానే అందజేశారని తెలిపారు. జగదాంబిక అమ్మవారి ఆశీస్సులు ప్రభుత్వంపై ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత చరిత్ర ఉందన్నారు. జంట నగరాల్లో దారులన్నీ గోల్కొండ వైపై ఉన్నాయని భక్తులు తండోపతండాలుగా వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, భక్తులు పోలీసులకు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో సంప్రదారీతిలో గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నానని, ప్రభుత్వం ఈబోనాల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అమ్మవారికి సమర్పించే బోనాలలో భక్తులకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ బోనాల ఉత్సవాలలో ఈటెల పాల్గొని బోనం సమర్పించారు అదేవిధంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనం సమర్పించారు.

# హైదరాబాద్ అభివృద్ధిలో హెచ్‌సిటీ గేమ్‌ఛేంజర్

### నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాం

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరాభివృద్ధిలో హెచ్‌సిటి (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫరమేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ గేమ్ చేంజర్ అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దేశంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా నగరాన్ని అభివృద్ధి చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి ఇది దిక్సూచిగా మారుతుందన్నారు. 'హెచ్ సిటీ' ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.45 కోట్లతో ఎన్ హెచ్ 65 నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనులకు గురువారం ఆయన చందానగర్‌లో శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. బడ్జెట్‌లో రూ.10వేల కోట్లకు పైగా నిధులు కేటాయించాం అని అన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు, నగరాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రూ.7032 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకే హెచ్‌సిటీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం అని మంత్రి వివరించారు. "ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రహదారి నెట్‌వర్క్‌ను మెరుగుపరచడం, పర్యావరణ హితంగా నగరాన్ని అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యాలు అన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న జనాభాతో నగరంపై పడుతున్న ఒత్తిడి చాలా వరకు తగ్గుతుందన్నారు. నగరవాసులకు సౌకర్యమంతమైన నాణ్యమైన జీవన శైలి అందుతుంది అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. "ఇప్పటికే నగరంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో వేయి ఎలక్ట్రిక్ బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించాం. వాటికి అదనంగా మరో 800 బస్సులను తీసుకురావాలని సిఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇందుకు కేంద్రం సైతం సహకరించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియో గాన్ని పెంచేందుకు కీలక ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాదచారుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం అని ఆయన చెప్పారు. "హైదరాబాద్ అభివృద్ధిని ఒక్క ప్రాంతానికే పరిమితం చేయకుండా నలువైపులకు విస్తరిస్తాం. మాపై కొందరూ పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. మంచి చేయాలని సంకల్పిస్తే హెచ్‌సియు భూముల విషయంలో వారేం చేశారో మీరంతా గమనించారని అన్నారు. మా లక్ష్యం, ధ్యేయం ఒక్కటే అభివృద్ధి అని అన్నారు. మీకోసం పనిచేసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సహకరించండి అని మంత్రి శ్రీధర్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు మంజుల, రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం బిసి రిజర్వేషన్లతో 'స్థానిక'ఎన్నికలు నిర్వహించాలి

### బిజెపి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బిజెపి ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యా లయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు తీర్పు ప్రకారం, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి నట్లుగా 42 శాతం బిసి రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిం చాలన్నారు. బిసి రిజర్వేషన్లకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మద్దతు ప్రకటించారని, ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా స్పష్టం చేశారని అన్నారు. బిసి రిజర్వేషన్లను ఇవ్వాల్సిన అధికారం, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్ల హామీని ప్రకటించిందని, మేనిఫెస్టోలో కూడా అదే హామీ ఇచ్చారని, ఇప్పుడు దానిప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయడం వల్ల విద్యార్థులు కళాశాలల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు రూ. 6,000 నుంచి రూ.8,000 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల చాలా కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ పకడ్బందీగా అమలవ్వాలన్నారు.

# టీచర్లతో స్కూళ్ల తనిఖీ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి ఉపాధ్యాయులను నియమించాలనే ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ గురువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సంఘం నేతలతో కలిసి పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంత రావు, రాష్ట్ర ప్రధాన క్యాదర్శి నవాత్ సురేష్‌తో కలిసి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డైరెక్టర్‌కి పలు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. టీచర్లతో స్కూళ్ల తనిఖీకి సంబంధించి ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమైనవని.. పైగా టీచర్లను తీవ్రమైన ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురి చేసేలా ఉన్నాయని.. కాబట్టి ఈ ఉత్తర్వులను పునసమీక్షించి రద్దు చేయాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్ సమస్యలతోపాటు.. కేజీబీవీల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే టీచర్లను వెంటనే తొలగించ కుండా.. నోటీసు ఇచ్చి విచారణ జరిపేలా చూడాలని కోరారు. టీచర్లను తనిఖీలకు ఉపయోగించుకునే ఉత్తర్వుల మూలంగా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఇటువంటి ఆదేశాలు అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయని.. విద్యా రంగంలో ప్రతికూల అభిప్రాయాన్ని సృష్టిస్తాయని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న జారీ చేసిన ఉత్తర్వులను పునఃపరిశీలించి, ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను ( ప్రోత్సహించడానికి బలమైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.




సమావేశంలో పాల్గొన్న అనిల్‌కుమార్, గౌతమ్‌రెడ్డి, కె.రాజభాను, నిఖిల్, రాజగోపాలరావు తదితర ప్రముఖులు

# ఫైర్ సర్వీసుల్లోకి త్వరలో మహిళలు

### ఫార్మా లైఫ్‌సైన్సెస్ పరిశ్రమల్లో వార్షిక అగ్నిభద్రతా తనిఖీలు తప్పనిసరి చేయాలి : అగ్నిమాపక సంస్థ సూచన

### ఫార్మా కెమికల్ రంగాల్లో పారిశ్రామిక భద్రతపై పిల్లర్స్ ఆఫ్ ప్రొటెక్షన్‌పై సమావేశం : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సిఐఐ

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 26, ప్రభాతవార్త :** వివిధరంగాల పారిశ్రామిక భద్రతపై అవగాహన పెంచడం కోసం కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సిఐఐ తెలంగాణ తన మొదటి సమావేశాన్ని పిల్లర్స్ ఆఫ్ ప్రొటెక్షన్-ఫోర్జింగ్ సఫర్ ఫ్యూచర్ ఫర్ ఫార్మా అండ్ కెమికల్ మాన్యుఫ్యాక్చరింగ్ పేరుతో నిర్వహించింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డైరెక్టర్ జనరల్ తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్టుమెంట్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ భద్రత అనేది ప్రణాళిక, నిర్మాణ సమయంలో అమలు, ఆపరేషన్ల నిర్వహణ ఈ మూడింటిలోనూ అంతర్భాగంగ భావించాలన్నారు.

భవన డిజైన్ లోపాలు, భద్రతా వ్యవస్థలు పనిచేయక పోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ఇండస్ట్రీ అయినా, సామాన్యుడైనా భద్రతా నియమాలకు తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ఫార్మా పరిశ్రమల్లో వార్షికంగా అన్నిభద్రత తనిఖీలు తప్పనిసరి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూ ఇండస్ట్రీలు కూడా స్వచ్ఛందంగా అగ్నిభద్రతా తనిఖీలు జరిపించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. గత దశాబ్దంలో ఫార్మపరిశ్రమల్లో 102 పెద్ద అగ్నిప్రమాదాలు సంభవించి వందకోట్లకుపైగా ఆస్తినష్టం, ఆరుగురు మృతిచెందారని తెలిపారు. డిపార్టుమెంటు 2024లో 4035 కోట్ల ఆస్తిని రక్షించినా 1223కోట్ల నష్టమూ జరిగిందన్నారు. రాష్ట్రంలో 147 ఫైర్‌స్టేషన్లు ఉండగా వాటిలో 38 హైదరాబాద్‌లో ఉన్నాయని చెప్పారు. త్వరలో మహిళలను ఫైర్‌సర్వీసుల్లో తీసుకోవాలని, డ్రోన్ల వినియోగాన్ని పరిశీలి స్తున్నామని నాగిరెడ్డి వెల్లడించారు. అగ్నిప్రమాద భద్రత వ్యక్తిగతం కాదు సంస్థ సంస్కృతిగా మారాలని నొక్కివక్కాణించారు.

ఇండస్ట్రీస్ కమిషనరేట్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ఐఎఎస్ మాట్లాడుతూ భద్రత విషయంలో హెచ్‌ఎజెడ్‌ఓపి, ఫెయిల్యూర్ మోడ్ అనాలిసిస్ వంటి ఆధునిక పద్ధతులను అనుసరించాలని, కృత్రిమ మేధా, ఐఓటీ, డిజిటల్ ట్విన్ వంటి సాంకేతికను వినియోగించి ముందుగానే ప్రమాదాలు గుర్తించాలన్నారు.డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాలరావు భద్రత అనేది సంస్థల బలమైన మూలస్తంభమని, ఉత్పత్తి, నాణ్యత, వినియోగదారుల సంతృప్తికి సమాన ప్రాముఖ్యత ఉందన్నారు.

ఈ సందర్భంగా సమావేశ లక్ష్యాలను వివరించి ఈ కార్యక్రమం తెలంగాణ లైఫ్‌సైన్సెస్ రంగాన్ని రెండింతలు పెంచే లక్ష్యాన్ని, హైదరాబాద్‌ను ఆసియా ఫార్మాహబ్‌గా తీర్చిదిద్దే దృష్టితో ముందుకు తీసుకువెళ్తుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో డా. వినయ్‌కుమార్ గుప్తా, కె.రాజభాను, ఆర్వీపిఎస్,చక్రవర్తి, సిఐఐ తెలంగాణ వైస్‌ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ తర్వాత సిఎం కావడానికి ప్రజలకు దరఖాస్తు చేసుకొంటా!

### కాంగ్రెస్ రాష్ట్ర నేత జగ్గారెడ్డి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డి సిఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి అభ్యర్థన దరఖాస్తును ప్రజల దగ్గర పెడతానని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ మూడేళ్లు రేవంత్‌రెడ్డే సిఎంగా ఉంటారని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయ త్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బిఆర్ఎస్‌లో ఉంటే ఏంటి? బయటకు వస్తే ఏంటని ఆయన ప్రశ్నించారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని, ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని జగ్గారెడ్డి చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదని జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా వారు పరస్పరం విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. రైతు భరోసా ఆలస్యం అయినా ఫరవాలేదు కానీ మొదలు పెట్టడం మాత్రం రైతులు సంతృప్తిచెందేలా తొందరగా ఒకే సారి డబ్బులు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. అందరికీ డబ్బులు ఒకేసారి వేయాలని రేవంత్ డిప్యూటీ సిఎం భట్టి ముందుచూపు ఆలోచన సక్సెస్ అయ్యిందని అన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే, సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం సర్కారు రైతు భరోసా వేసిందన్నారు.




అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఐ కార్యకర్తలు, చిత్రంలో ఇ.టి.నర్సింహ, వి.ఎస్.బోస్, ఎస్.ఛాయాదేవి తదితరులు

## మావోయిస్టు పార్టీ నిర్మూలన సాధ్యం కాదు

### ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి

### సిపిఐ నేత ఇ.టి.నర్సింహా

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 26, ప్రభాతవార్త:** మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆనేకమంది సిపిఐ కార్యకర్తలు నల్ల దుస్తులు ధరి ంచి గురువారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో కార్యకర్తలు ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ లిబర్టి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం అడవిలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతూ ఆదివాసీలకు కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటాలు నిర్వహిస్తూ జీవితాలను త్యాగం చేస్తున్న మావోయిస్టు పార్టీతో చర్చలు జరపకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. నిరసన ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, నాయకులు చందునాయక్, చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని ప్రకటించాలి

### 2023 జూలై 1 నుంచే అమలు చేయాలి

### పెండింగ్ డిఎలను మంజూరు చేయాలి

### లక్ష మందితో 80 యేళ్ల ఆవిర్భావ సభ

### టిఎన్‌జిఒ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని ప్రకటించాలని, జూలై 1, 2023 నుంచే అమలు చేయాలని టిఎన్‌జివో కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. పెండింగ్‌లో ఉన్న డిఏలను మంజూరు చేయాలని.. బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ తెలిపారు. తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ నేతృత్వంలో నాంపల్లిలోని కేంద్ర సంఘం భవనంలో జరిగింది. సమావేశానికి 33 జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కేంద్ర కార్యవర్గ సభ్యులతోపాటు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన కోసం ప్రభుత్వంతో, క్యాబినెట్ సబ్ కమిటీతో, ఆఫీసర్స్ కమిటీలతో సుదీర్ఘంగా చర్చించామని.. ప్రధానంగా పంచాయితీ కార్య దర్శులను గ్రేడులుగా విభజించడం, సచివాలయంలో 12.5 శాతం కోట అమలు, పెండింగ్ బిల్లులకు సంబంధించిన మెడికల్ బిల్లుల మంజూరు, డిఏ ఉత్తర్వులు ఇవ్వడం, కొన్ని శాఖలకు అదునపు పోస్టులను మంజూరు చేయించడం వంటి 16 సమస్యలను పరిష్కరించినప్పటికి.. ప్రధానంగా కేంద్రం సంఘం ఇది వరకే ప్రభుత్వం ముందు ఉంచిన పెండింగ్ డిమాండ్లలో జులై 1, 2023 నుండి 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ డిఏలను మంజూరు చేయాలని.. అలాగే పెండింగ్ బిల్లుల చెల్లింపులు, సిపిఎస్ రద్దు, గచ్చిబౌలి ఇండ్ల స్థలాలను బిటిఎన్‌జీవోస్ సొసైటీకి కేటాయించ డానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ మెమోను రద్దుచేసి.. వెంటనే బిటిఎన్‌జీవోస్ స్థలానికి కేటాయించాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. గచ్చిబౌలి టిఎన్‌జీవోస్ రెండో పేస్ భూమిని టిఎన్‌జీవో సొసైటీకు బదలాయిం చడం, హెల్త్ కార్డు విషయంలో స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలనే పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్క రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. అలాగే త్వరలో లక్ష మంది ఉద్యోగులతో హైదరాబాద్లో టిఎన్‌జీవో 80 సంవత్సరాల ఆవిర్భావన సభను నిర్వహిస్తామని తెలిపారు. సంఘం ఎల్లప్పుడూ ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే.. పెండింగ్ సమస్యలు సాధన కోసం పోరాటాలకు వెనకడుగు వేయదని తెలియజేస్తూ .. త్వరలోనే ఉద్యోగుల అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గంలో 9 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్టు మారం జగదీశ్వర్ తెలిపారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. సిపిస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. వివిధ కారణాలతో ప్రభుత్వ శాఖల్లో సస్పెండ్ అయిన ఉద్యోగులను నిబంధనల మేరకు విధుల్లోకి తీసుకోవాలి. అన్ని శాఖల్లో పాత జిల్లాల ప్రతిపాదికన అదనపు పోస్టులను(క్యాడర్‌స్ట్రెంత్‌లు) మంజూరు చేయాలి.

# సెమీస్‌కు భాంబ్రీ-రాబర్ట్ జోడీ

## బ్రెజిలియన్‌పై వరుస సెట్లలో విజయం



**న్యూఢిల్లీ:** స్పెయిన్‌లోని మల్లోర్కాలో జరిగిన ఛాంపియన్‌షిప్స్-2025, ఎటిపి 250 ఈవెంట్‌లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే దూసుకుపోయారు. స్పెయిన్‌లోని మల్లోర్కాలో 69 నిమిషాల పాటు జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో భాంబ్రి మరియు గాల్లోవే 6-2, 6-3 తేడాతో బ్రెజిలియన్ జంట రాఫెల్ మాటోస్ మరియు మార్సెలో మెలోపై వరుస సెట్లలో విజయం సాధించారు. నాల్గవ సీడ్ ఇండో అమెరికన్ జంట ప్రారంభం నుండే జోన్‌లో ఉన్నారు. అలాగే నాల్గవ గేమ్‌లో సర్వీస్‌ను బ్రేక్ చేసి మొదటి సెట్‌లో 3-1 ఆధిక్యాన్ని తెరిచారు. ఎనిమిదో గేమ్‌లో మరోసారి బ్రేక్ వేసి 32 నిమిషాల్లో 6-2 తేడాతో మొదటి సెట్‌ను చేజిక్కించుకున్న భాంబ్రీ-గాలోవే అడిగిన ప్రశ్నలకు మాటోస్ మరియు మెలో వద్ద సమాధానాలు లేవు. రెండవ సెట్‌లో బ్రెజిలియన్ జంట మెరుగైన పోరాటాన్ని ప్రదర్శించింది కానీ ఎనిమిదో గేమ్‌లో భాంబ్రీగాలోవే గోల్ చేసి, బ్రేక్ పాయింట్‌ను గెలుచుకుని 5-3 ఆధిక్యాన్ని తెరిచింది. ఆ తర్వాత తొమ్మిదవ గేమ్‌లో ఇండో-అమెరికన్ ద్వయం తమ సొంత సర్వీస్‌ను నిలబెట్టుకుని మ్యాచ్‌ను ముగించి సెమీఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. అంతకుముందు, భాంబ్రి-గాలోవే జంట గ్రెగోయిర్ జాక్ మరియు అలెగ్జాండ్రే ముల్లర్‌పై జరిగిన తొలి రౌండ్‌లో 6-3, 6-3 తేడాతో విజయం సాధించి పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.



# షూటింగ్ ట్రయల్స్‌లో

# సమ్రా అనీష్ భన్వాలా గెలుపు

**న్యూఢిల్లీ:** త్రిశూల్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పురుషుల మరియు 50 మీటర్ల 3 పొజిషన్ల ఈవెంట్లలో ఒలింపియన్లు అనిష్ భన్వాలా మరియు సిఫ్ట్ కౌర్ సమ్రా నేషనల్ సెలక్షన్ ట్రయల్స్ (టి3)ను గెలుచుకున్నారు. డెహ్రాడూన్‌లోని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలో జరిగిన ఫైనల్స్‌లో అనిష్ 33 పాయింట్లు సాధించాడు, తన రాష్ట్ర సహచరుడు ఆదర్శ్ సింగ్ కంటే నాలుగు మెరుగ్గా ఉండి రెండవ స్థానంలో నిలిచాడు. నేవీకి చెందిన ప్రదీప్ సింగ్ షెకావత్ 23 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. అంతకుముందు, అనిష్ స్టేజ్ 1లో 293 పాయింట్లు సాధించి మొత్తం 582-21నతో మొదటి స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించిన తర్వాత, క్వాలిఫికేషన్ స్టేజ్ 2లో 289 పాయింట్లు జోడించాడు. ప్రదీప్ 581-17న (290,291) స్కోరుతో రెండవ స్థానంలో నిలిచాడు, గుర్మీత్ సింగ్ 579-15న (289,290) స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. హర్సిమార్ సింగ్ రత్తా (577-21న), నీరజ్ కుమార్ (576-16న), మరియు ఆదర్శ్ సింగ్ (574-23న) టాప్ సిక్స్‌ను పూర్తి చేశారు. కాగా సిఫ్ట్ కౌర్ సమ్రా, 50 మీటర్ల 3 పొజిషన్స్ మహిళల ఫైనల్స్‌లో 467.3 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి తన క్లాస్‌ను ప్రదర్శించింది, ఇది 456.9 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచిన ఆకృతి దహియా కంటే 10.4 పాయింట్లు మెరుగ్గా ఉంది. క్వాలిఫికేషన్‌లో 592 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచిన ఆషి చౌక్సీ 443.9 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది, ముందు వరుసలో సిఫ్ట్ 591 స్కోరుతో నిలిచింది. ఆకృతి 588 స్కోరుతో మూడో స్థానంలో నిలవగా, మెహులీ ఘోష్ (588), ఆయుషి పొద్దర్ (587), విదర్శ కె. వినోద్ (586), వంశిక షా (585), నిశ్చల్ సింగ్ (585) టాప్ ఎనిమిదో స్థానంలో నిలిచారు.

## ఇంగ్లండ్ రెండో టెస్టుకు టీమిండియాలో

# కీలక మార్పులు


## మరో ఇద్దరు ప్లేయర్లకు ఛాన్స్.. ఇప్పటికే స్టార్ రాణా ఔట్







**న్యూఢిల్లీ:** ఐదు టెస్టు మ్యాచ్‌లు సుదీర్ఘ సిరీస్ ఆడేందుకు ఇంగ్లాండ్ వెళ్లిన యంగ్ టీమిండియాకు తొలి మ్యాచ్‌లోనే ఊహించని షాక్ తగిలింది. బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ తొలి టెస్టులో గిల్ సేన ఓటమి పాలైంది. తొలి టెస్టులో జట్టు కూర్పుసరిగా లేదని, అందుకే భారత్ జట్టు ఓడిపోయిందని పలువురు మాజీ క్రికెటర్లు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో జులై 2 నుంచి ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టెస్టుకోసం భారత్ జట్టులో కీలక మార్పులు చేసేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్ కసరత్తు మొదలు పెట్టింది. తొలి మ్యాచ్‌లో ఫెయిలైన శార్దూల్ ఠాకూర్ స్థానంలో చైనామాన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలనే ఆలోచన చేస్తోంది. తొలి టెస్టులో శార్దూల్‌ను ఆడించాలన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయాన్ని చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించినా, రెండో టెస్టు జట్టు ఎంపికపై పెద్దగా స్పందించలేదు. మరోవైపు తొలి టెస్టులో నలుగురు పేసర్లతో ఆడటంపై విమర్శలొస్తున్నాయి. అయితే రెండో టెస్టు జరిగే బర్మింగ్ హోమ్ పిచ్ స్పిన్నర్లకు బాగా సహకరిస్తుంది. దీంతో జడేజాతో పాటు కుల్దీప్ కూడా ఉంచే అవకాశం ఉంది. తొలి టెస్టులో కుల్దీప్ ఉండి ఉంటే ఫలితం మరోలా ఉండేదని భారత్ క్రికెట్ బోర్డులో అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండో టెస్టులో కుల్దీప్‌ను ఆడించాలని, అవసరమైతే నితీశ్‌ను కూడా తీసుకునే ఛాన్స్ ఉంది. ఆస్ట్రేలియాలో నితీశ్ బాగా ఆడాడు. తొలి టెస్టులోనే ఆడిస్తే బాగుండేది. ఇంగ్లాండ్ లో ఆడేటప్పుడు నాణ్యమైన బౌలర్లే ఉండాలని, అందులో ఇద్దరు స్పిన్నర్లు ముఖ్యంగా నితీశ్ తప్పనిసరిగా ఉండాలని బోర్డు మెజార్టీ సభ్యుల్లో వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ దిశగా చర్యలు చేపట్టనుంది. ఇంగ్లండ్‌తో ఓటమి తర్వాత ఇప్పటికే ఓ స్టార్ పేసర్‌ను ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు రిటన్ పంపించింది. తొలి టెస్ట్‌లో ఓడిపోయిన మరుసటి రోజు పేసర్ హర్షిత్ రాణాను జట్టు నుంచి విడుదల చేసినట్లు సమాచారం. మొదటి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి మంచి ప్రదర్శన ఇచ్చాడు, కానీ రెండవ ఇన్నింగ్స్‌లో, తరువాతి టెస్ట్‌లో అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు.



## తొలి టెస్టులో ఆస్ట్రేలియా

# 123 రన్స్ ఆధిక్యం

### స్పష్టమైన క్యాచ్ అయినా నాటౌట్.. అంపైర్ నిర్ణయం వివాదాస్పదం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ తొలి రోజున ఒక వివాదాస్పద నిర్ణయం జరిగింది. బార్బడోస్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో థర్డ్ అంపైర్ ఆడ్రియన్ హోల్డ్‌స్టాక్ తీసుకున్న నిర్ణయం వల్ల షమర్ జోసెఫ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. వెస్టిండీస్ ఫీల్డర్లు కూడా చాలా క్యాచ్‌లు వదులుకున్నారు. జోసెఫ్ ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్‌ను కుదిపేశాడు. ట్రావిస్ హెడ్‌పై అప్పీల్‌పై, అంపైర్ నితిన్ మీనన్ అతన్ని అవుట్ ఇవ్వలేదు, కానీ థర్డ్ అంపైర్ కూడా బ్యాట్స్‌మన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చాడు. తరువాత, జోసెఫ్ సహచరుడు జేడెన్ సీల్స్ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆలౌట్ అయింది. దీనికి ప్రతిస్పందనగా, గురువారం రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 57 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ తొలి రోజున షమర్ జోసెఫ్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అతను ట్రావిస్ హెడ్‌కు బంతిని వేశాడు. బంతి బ్యాట్‌కు తగిలిందా లేదా అనే దానిపై వివాదం నెలకొంది. అంపైర్ నితిన్ మీనన్ హెడ్ బంతిని తాకినట్లు భావించాడు. కాబట్టి అతను థర్డ్ అంపైర్ సహాయం కోరాడు. అల్ట్రాఎడ్జ్ టెక్నాలజీ బంతి హెడ్ బ్యాట్‌ను తాకినట్లు చూపించింది. కానీ బంతి నేరుగా వికెట్ కీపర్ షాయ్ హోప్ చేతుల్లోకి వెళ్లిందా లేదా అనేది స్పష్టంగా లేదు. ఒక రీప్లేలో బంతి నేలను తాకినట్లు చూపించింది. రెండవ రీప్లే స్పష్టంగా లేదు. థర్డ్ అంపైర్ అడ్రియన్ హోల్డ్‌స్టాక్ చాలా సమయం తీసుకున్నాడు. తర్వాత అతను హెడ్‌ను అవుట్ ఇవ్వలేదు. బంతి నేరుగా హోప్ చేతుల్లోకి వెళ్లిందని నిరూపించడానికి తన వద్ద తగినంత ఆధారాలు లేవని ప్రకటించాడు.

## ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ చేతిలో పాక్ ఓటమి

### స్వర్ణం గెలుచుకున్న అభయ్ జోడీ

### మరో రెండు ఈవెంట్స్‌లోనూ స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** ఆసియా స్క్వాష్ డబుల్స్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ చారిత్రాత్మక ప్రదర్శన ఇచ్చింది, పురుషులు, మహిళలు మరియు మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో మూడు టైటిళ్లను గెలుచుకుంది. ఈ డబుల్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ మట్టికరిచింది. ఉత్కంఠ భరితంగా జరిగిన డబుల్స్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో భారత్‌కు చెందిన అభయ్‌సింగ్, వేలవన్ సేధిల్‌కుమార్ పురుషుల డబుల్స్ ఫైనల్లో పాకిస్థాన్‌కు చెందిన నూర్ జమాన్, నాసిర్ ఇక్బాల్ జోడీపై విజయం సాధించి ప్రతిష్టాత్మక స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇక్బాల్‌ను మూడు గ్రిప్పింగ్ గేమ్‌లలో ఓడించారు. అభయ్, సేధిల్ హై వోల్టేజ్ ఘర్షణలో పురుషుల డబుల్స్ ఫైనల్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకున్నారు. తొలి సెట్‌ను 9-11 తేడాతో కోల్పోయిన తర్వాత, భారత జట్టు తిరిగి పుంజుకుని తదుపరి రెండు గేమ్‌లలో 11-5, 11-5 తేడాతో ఆధిపత్యం చెలాయించి కైవసం చేసుకుంది. మహిళల జట్టులో, టీనేజర్ అనహత్ సింగ్ మరియు అనుభవజ్ఞురాలు జోష్నా చినప్ప కలిసి మలేషియాకు చెందిన ఐనా అమానీ మరియు యీ జిన్ యింగ్‌పై నాటకీయ పునరాగమన విజయాన్ని సాధించారు. మొదటి గేమ్‌ను 8-11తో కోల్పోయిన తర్వాత, భారత జంట 11-9తో గెలిచి, 11-10తో నిర్ణయాత్మక స్థానాన్ని కైవసం చేసుకుంది. 16 ఏళ్ల అనాహత్‌కు ఈ విజయం ఒక మైలురాయిగా నిలిచింది. అయితే జోష్న భారతదేశపు అత్యుత్తమ స్క్వాష్ క్రీడాకారిణులలో ఒకరిగా తన చారిత్రాత్మక వారసత్వాన్ని మరింతగా పెంచుకుంటూనే ఉంది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో భారతదేశం యొక్క స్వర్ణ పరుగు కొనసాగింది, అక్కడ అనహత్ సింగ్ మరియు అభయ్ సింగ్ జతకట్టి తమ మలేషియా ప్రత్యర్థులను వరుస గేమ్‌లలో 2-0 తేడాతో ఓడించారు.

# వాణిజ్యం

# టూవీలర్లపై టోల్‌ట్యాక్స్ లేదు: కేంద్ర మంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ,జూన్ 26:** జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాలవద్ద ఇకపై టూవీలర్లకు టోల్‌టాక్స్ ఉంటుందన్న వార్తలపై కేంద్ర రవాణా హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ప్రస్తుతం కార్లనుంచి భారీ వాహనాలవరకూ మాత్రమే టోల్‌ఫీజులు చెల్లిస్తున్నారు. ద్విచక్రవాహనాలకు, ఆటోలకు మాత్రం టోల్‌ఫీజులేదు. ఇకపై హైవేలపై వచ్చే టూవీలర్లు టోల్‌ఫీజు కట్టేవిధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జులై 15వ తేదీనుంచే ఈనిబంధన అమలుకు తెస్తున్నారంటూ వార్తలు వెలువడటంతో ఆందోళన మొదలయింది. ఈ ప్రచారంపై కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ స్పందించారు. ఈవార్తల్లో నిజంలేదని, ప్రస్తుతం టూవీలర్లకు టోల్‌టాక్స్ వసూలు అన్న వార్తల ప్రతిపాదన ఏదీ కూడా ఇప్పటివరకూ లేదని, అవి పుకార్లు మాత్రమేనని స్పష్టంచేసారు. టూవీలర్లకు ట్యాక్స్ మినహాయింపు ఎప్పటిలాగే కొనసాగుతుందని గడ్కరీ స్పష్టంచేసారు. ద్విచక్ర వాహనం కొన్నప్పుడు, ఆ సమ యంలో టోల్ పన్నువసూలు చేయబడుతుంది. అంటే దీని అర్థం ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారిపై టోల్ ప్లాజానుండి వెళ్ళినప్పుడు వారి నుండి టోల్ పన్ను వసూలు చేయదు. జాతీయ రహదారిపై నాలుగు చక్రాల వాహనాలు లేదా అంతకంటే ఎక్కువ వాహనాల నుండి మాత్రమే టోల్ పన్ను వసూలు చేయబడుతుంది. దేశంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మొత్తం 1057 ఎన్‌హెచ్‌ఎఐ టోల్‌లు ఉన్నాయి. వీటిలో దాదాపు 78 టోల్‌లు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. బీహార్‌లో 33 జాతీయ రహదారి టోల్‌లు ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో 123 టోల్ ప్లాజాలు ఉన్నాయి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల టోల్ కు సంబంధించి కొత్త పథకాన్ని ప్రకటించారు. దీంతో ఫాస్ట్ ట్యాగ్ ఆధారిత అన్యువల్ టోల్ పాస్ స్కిం ప్రవేశపెట్టారు. ఈ పథకం ఆగస్టు 15 నుండి ప్రారంభ మవుతుంది. ఈ పాస్ ధర రూ. 3000 ఇంకా 200 ప్రయాణాలు చేయవచ్చు. ఎన్‌హెచ్‌ఎఐ అలాగే ఎన్ఇ టోల్ ప్లాజాల లో మాత్రమే చెల్లుతుంది. అయితే ప్రచారంలోకి వచ్చిన టూవీలర్లకు టోల్‌ఫీజు అన్న అంశాన్ని మాత్రం కేంద్ర మంత్రి గడ్కరీ కొట్టివేసారు.

# భారత్‌కు చైనా ఎరువుల ఎగుమతులు నిలిపివేత



**న్యూఢిల్లీ, జూన్ 26:** వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే దేశాల్లో కీలకంగా ఉన్న చైనా, భారత్‌కు ఎగుమతులు నిలిపివేసి.. ఇతర దేశాలకు సరఫరా చేస్తూనే ఉండటం గమనార్హం. భారత్ తన అవసరాల కోసం దాదాపు 80 శాతం ఎరువులను చైనా నుంచి దిగుమతి చేసుకుంటోంది. గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా చైనా ప్రత్యేక ఎరువుల సరఫరాను భారత్‌కు తగ్గిస్తూ వస్తోంది. ఈసారి మాత్రం పూర్తిగా నిలిపివేసింది. అని సోల్యుబుల్ ఫెర్టిలైజర్ ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీబ్ చక్రబర్తి తెలిపారు. ఇదిలా ఉండగా, చైనా,భారత్ మధ్య సరిహద్దు వివాదాలు, పాకిస్థాన్‌కు మద్దతు వంటి కారణాల వల్ల డ్రాగన్ ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల భారత దేశంలో పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే చైనా ప్రభుత్వం భారత్‌కు ఎగుమతులను నిలిపివేయడానికి వివిధ విధానాలను ఉపయోగిస్తోంది. ఫ్యాక్టరీల నుంచి బయటకు వెళ్లే ప్రతి వస్తువును చైనా తనిఖీ చేస్తుంది. భారత్‌కు పంపాల్సిన సరుకులను తనిఖీ చేయడం లేదు. ఎటువంటి బహిరంగ నిషేధం విధించకుండానే ఎగుమతులను నిరోధించడానికి వివిధ విధానా లను ఉపయోగిస్తున్నారు అని ఈ విషయం గురించి తెలిసిన వ్యక్తులు తెలిపారు. భారత్‌తో సరిహద్దు పంచుకుం టున్న దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు అనుమతి తప్పనిసరి చేసింది కేంద్ర ప్రభుత్వం. దీనికి ప్రతిస్పందనగా చైనా ఈచర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఇరు దేశాల మధ్య గత ఐదేళ్లలోసరిహద్దు వివాదాలుపెరిగాయి. పాకిస్థాన్‌కు డ్రాగన్ మద్దతు ఇవ్వడం కూడా ఉద్రిక్తతలను పెంచింది. అధిక నాణ్యతగల పంటల పెరుగుదల దశల్లో వాటి ప్రత్యేక అవసరాలను తీర్చడం,దిగుబడిని పెంచేందుకు ఉపయోగ పడతాయి. అంతేకాకుండా నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం. కంట్రోల్డ్ లిలీజ్ మెకానిజంల ద్వారా పోషకాల వినియోగసామర్థ్యాన్ని పెంచుతాయి. పర్యావరణ సంబంధిత ఆందోళనలకు కూడా పరిష్కారంగా ఉంటాయి.

# రూ.860 కోట్లకు క్రిజాక్ ఐపిఒ!



**న్యూఢిల్లీ,జూన్ 26:** స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ ప్రొవైడర్ 'క్రిజాక్' రూ.860 కోట్ల విలువైన ఐపిఒకు వసునతన్నట్లుప్రకటించింది. వచ్చేనెల రెండోతేదీ మార్కెట్లకు విడుదలయ్యే ఐపిఒ జులై 4వ తేదీను ఇష్యూ ముగు స్తుంది. అలాగే ఒకటవ తేదీ యాంకర్ ఇన్వెస్టర్లకోసం ఇష్యూ ప్రారంభిస్తారు. అయితే కంపెనీ తన ఇష్యూధరను మాత్రం వెల్లడించలేదు. ఐపిఒ పూర్తిగా ఆఫర్‌ఫర్‌సేల్‌గా ఉంటుంది. 860 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు పింకీ అగర్వాల్ మనిష్ అగర్వాల్‌లు లిష్టింగ్‌చేసారు. ఇదే మొదటిసారి తాజా ఇష్యూ అని వెల్లడించారు. ముందు రోజే వారు డిఆర్‌హెచ్‌పిని దాఖలు చేసారు. మొత్తం 723 కోట్ల విలువైన ఈక్విటీ వాటాలను పింకీ అగర్వాల్, 137 కోట్లు మనీష్ అగర్వాల్‌లు ఐపిఒకు తెస్తున్నారు. ఆఫర్ ఫర్‌సేల్ కావడంతో క్రిజాక్ ఈ ఐపిఒనుంచి భారీ మొత్తం ఆశించ లేదు. గత ఏడాది నవంబరులోనే కంపెనీ 1000 కోట్ల నిధులు సమీకరించాలని ప్రతిపాదించింది. అయితే ఐపిఒ సైజును 860 కోట్లకు కుదించింది. ఆఫర్‌సైజ్ తగ్గించడానికి గల కారణాలు మానరతం వెల్లడికాలేదు. ముందు ఐపిఒ పత్రాలను గత ఏడాది మార్చి లో సెబీకి దాఖలుచేసింది. జులైలో సెబీ దాక్యుమెంట్లు తిప్పివేసింది. తర్వాత కంపెనీ మళ్లీ నవంబరు

# రూ.20లక్షల కోట్లు మార్కెట్ క్యాప్ దాటేసిన రిలయన్స్!

**ముంబయి, జూన్ 26:** రియలన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలు ఒక్కసారిగా రెండుశాతం పెరిగాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక్కసారిగా ఇంట్రాడేలో 1496.8 రూపాయలకు షేరు ధర పలికింది. దీనితో ఒక్కసారిగా 20 లక్షలకోట్లు మూలధన విలువు దాటేసినట్లు కంపెనీ ప్రకటించింది. గతేడాది సెప్టెంబరు 27వ తేదీ తర్వాత మళ్లీ 20 లక్షల కోట్ల ఒపాయలు దాటడం ఇదే మొదటిసారి. మధ్యాహ్నం సమయానికి మార్కెట్ టర్నోవర్‌ను చూస్తే 20,25,540.5 కోట్లుగా ఉంది. రిల్‌షేర్ల ధరలు 2.01 శాతం పెరిగి 1496.8 రూపాయలకు చేరింది. బిఎస్ఇ సెన్సెక్స్ కూడా 1.03 శాతంపెరిగి 83,708.71 పాయింట్లను నమోదుచేసింది. 52 వారాల గరిష్టం ధరలు రిల్‌పరంగా చూస్తే 1608.95 రూపాయలుగా ఉంది. అలాగే 52 వారాల కనిష్టం చూస్తే 1115.55 రూపాయలుగా ఉంది. ఏడాదికాలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లధరలు నాలుగుశాతం నష్టపోయాయి. అయితే ఏడాదికాలంలో సెన్సెక్స్ మాత్రం ఐదుశాతం పెరిగింది. కంపెనీ ఛైర్మన్ ముకేష్ అంబాని ముందురోజు మాట్లాడుతూ కొత్త వృద్ధిదశలోకి వస్తోందని, కృత్రిమమేధ, డీప్ టెక్నాలజీలు ఆధారిత వృద్ధి నమోదవుతోందని చెప్పారు. ఇకపై టెలికాం, ఇంధన రంగాల్లో కూడా విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు స్పష్టం చేసారు. అంతేకాకుండా కంపెనీ ఇప్పటికే 5జి ఇన్‌ఫ్రా వ్యవస్థను ఇన్‌హౌస్‌గానే ఏర్పాటుచేసుకుందన్నారు. రిలయన్స్ హైరిస్క్ కేపిటల్‌ప్రాంతాలకు దూరంగా ఉంటామని, జిపియులు వంటి వాటిపై ఫోకస్ లేదని చెపుతూనే దేశ అవసరాలకు తగినట్లుగా ఈ వృద్ధి ప్రణాళికలు అమలుచేస్తామని చెప్పడం కంపెనీ షేర్ల వృద్ధికి కలిసొచ్చింది. రిల్‌కు అనుబంధంగా ఉన్న బ్లాస్ట్ ఎస్పోర్ట్స్, రైస్ వ్యవస్థలు కూడా జాయింట్ వెంచర్‌కు వస్తున్నట్లు తెలిపారు. జియో బ్లాస్ట్ ఇందుకోసం బ్లాస్ట్ ఎస్పోర్ట్స్‌కు 50 లక్షల ఈక్విటీ వాటాలను కేటాయించింది. పదిరూపాయలు ముఖవిలువతో ఐదుకోట్లకు మించకుండా కేటాయింపులకు అనుమతించింది. దీనితో రైజ్ వాటాలు జియోబ్లాస్‌టలో 50శాతం మేరకు ఉంటాయి. జియోబ్లాస్ట్ రిల్ అనుబంధం కాకుండా ఒక జాయింట్ వెంచర్ కంపెనీగా నిలుస్తుంది.







Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14